కె.వి.యల్.యన్. ప్రకాష్

# ఉద్యోగ విజయం

"మీరు ఇంతకు మునుపు ఎవరినన్నా ప్రేమించారా ?" జయ అడిగింది భాస్కర్‌ని.

వేరుశనగ కాయలు తింటున్న భాస్కర్ ఉలిక్కిపడ్డాడు. జయ అడిగిన ప్రశ్నలో 'ఇంతకు మునుపు' అన్న రెండు పదాలు వున్నాయా, లేక అది తన భ్రమా అన్న సందేహం వల్ల వచ్చిన ఉలికిపాటు అది.

"నువ్వు ఇంతకు మునుపు ఎవరినన్నా ప్రేమించావా?" రాజేశ్వరి అడిగింది ప్రభాకర్‌ని.

లిమ్కా తాగుతున్న ప్రభాకర్ ఉలిక్కిపడ్డాడు రాజేశ్వరి అడిగిన ప్రశ్నలో 'ఇంతకు మునుపు' అన్న రెండు పదాలు స్పష్టంగా వినబడంతో కలిగిన వులికిపాటు అది.

రెండు జంటలు దాదాపుగా ఒక ఫర్లాంగు యెడంగా టాంక్‌బండ్ మీద వున్నపుడు. అవి రెండూ యువజంటలు అయినప్పుడు. ఒకే రకమయిన సంభాషణ జరిగితే ఆశ్చర్యం లేదుగాని. ఆ రెండు జంటల లోని ఫెయిర్ సెక్స్ ఒకే ప్రశ్న వెయ్యటం, దానికి వారి పార్ట్నర్స్—కారణాలు వేరయినా—ఒకే విధంగా వులిక్కిపడటం అన్నది ఎవరినయినా వులిక్కిపడేటట్లు చేస్తుంది.

"చెప్పండి! మీరు యింతకు మునుపు ఎవరినన్నా ప్రేమించారా ?" జయ మళ్ళీ అడిగింది.

భాస్కర్ సందేహం తీరిపోయింది ఈ సారి అతను ఆ రెండు పదాలు స్పష్టాతి స్పష్టంగా విన్నాడు.

"నేను యింతకు మునుపు.... వింటున్నారా?.... యింతకు మునుపు ఒకసారి ప్రేమించాను" అన్నాడు ఆమె మొహం లోకి ఆతృతగా చూస్తూ. భాస్కర్ దృష్టిలో ఆ రెండు పదాలకు ఎంతో అర్థం. వాటి వెనకాల ఎంతో భావం వున్నాయి. 'ఇప్పుడు నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని నాకు తెలుసుగాని పూర్వం సంగతి చెప్పు' అన్నట్లుగా జయ ప్రశ్నను తను అర్థం చేసుకున్నాడు. మరి జయ మాటలోని వుద్దేశ్యం అదేనా?

"నాకు పూర్తి వివరాలు కావాలి. అంటే, ఎప్పుడు, ఎవరిని, ఎట్లా, ఎంతకాలం. ఏమయ్యింది గట్రా అన్నమాట."

"చూడండి! నేను చెబుతానుగాని మీరు నవ్వకూడదు" అన్నాడు భాస్కర్.

"నవ్వకూడదా? ఏం?"

దీపావళి ప్రత్యేక నవల

"నేను చాలా సీరియస్‌గా ఒక భగ్న ప్రేమికుడి కథ మీకు చెబుతున్నాను. అదే చెప్పబోతున్నాను. అది సీరియస్ అని తెలిసీ మీరు నవ్వితే ఎంటర్‌టెయిన్‌మెంట్ టాక్స్ వసూలు చెయ్యాల్సి వస్తుంది."

"సరే!" అంది జయ.

"మా అమ్మా నాన్నా చిన్నప్పుడే చనిపోయారు. దాంతో మా అక్కా బావలే నన్ను పెంచి పెద్ద చేశారు. ఇదంతా మీకు తెలుసు అని నాకు తెలిసినా ఇందుకు చెబుతున్నానంటే నాకు ఆశించినంత స్వేచ్ఛ తక్కువ అని చెప్పటం కోసమే. ఆ రోజుల్లో.... అంటే నేను ప్రేమలో పడబోయే రోజుల్లో.... అంటే నేను బి. ఏ. పరీక్షలు రాసిన రోజుల్లో.... నేను దాదాపుగా స్వతంత్రుణ్ని అయ్యాను. ఎందుకంటే నాకు ఉద్యోగం సంపాదించి చదువంటే ప్రేమలేదు. అక్కయ్య కోసం. అక్కయ్య కోసం చూసి చదివానుగాని నాకు మొదటినుంచీ నాటకాల్లో వేషాలు వెయ్యటం సరదాగా వుండేది. ఎన్ని చదువులు చదివినా అప్పటికి నేనెవరిమీది [illegible] పండల [illegible]గా లేదా. [illegible] నాటకాల్లో వేషాలు వేసుకుంటూ, క్రమక్రమంగా మెట్టు ఎక్కి సినిమాల్లో చేరి పేరు సంపాదించుకోవచ్చునన్నది నా ఫిలాసఫీ.

"అక్కయ్య కోరుకున్న విధంగా గ్రాడ్యుయేట్‌ని అయిపోతున్నాను అన్న ఆనందం, ఉద్యోగం వచ్చేటప్పటికి ఏడాదన్నా పడుతుంది కదా. ఈ లోగా నాటకాలు వేసుకుంటూ మిమిక్రీ యింప్రూవ్ చేసుకోవచ్చు అన్న ఆశ కలిసి నాకు స్వతంత్రుడని అన్న భావన కలగచేశాయి.

ఇంకో నాలుగు నెలలలో థియేటర్ ఆర్ట్స్‌లో డిప్లమా కోర్సు కొత్తగా మొదలు పెడతారని తెలిసింది. అందులో తప్పక చేరాలి అనుకున్నాను. సినిమాల్లోకి ప్రవేశించడానికి అది సాయపడుతుంది కదా! కాని అక్కయ్య ఒప్పుకోదే!- మూడు వందల ఫీ కట్టాలనేకాదు. నేను ఎమ్. ఏ. లో చేరటానికి వీలు వుండదు అన్న ఆలోచనతో. నాకు ఎమ్. ఏ. లో సీటువస్తుందనుకునేవారు పిచ్చివారుగాని అమాయకులుగాని అయి వుండాలని అన్నది. మా లెక్చరర్ల అభిప్రాయం అని చెప్పినా వినిపించుకోలేదు. అంతవరకూ నేను నాటకాలలో పాల్గొనడానికి, మిమిక్రి నేర్చుకోవటానికి ఎంతో ప్రోత్సాహమిచ్చిన బావగారుకూడా అక్కయ్య ఈ విషయంలో మరీ గట్టిగా వుండటంతో, తాను ప్రత్యక్షంగా ఏ విధమయిన సాయం చెయ్యలేనని చెప్పారు. నేను ఫీ కట్టడానికి కావాల్సిన మనీ సంపాదించుకుని గుట్టుచప్పుడు కాకుండా ఆ కోర్సులో చేరిపోతే, అక్కయ్యకు ఎట్లాగో ఒకలా నచ్చ చెప్పగలనని మాత్రం హామీ యిచ్చారు.

ఆ హామీ యివ్వబడక మునుపు ఒకసారి, యివ్వబడ్డాక ఒకసారి నా ఫొటోను తీసి. వాటిని వరసగా 'డాష్ టోన్' తాగక మునుపు, రాగిన తర్వాత అని అడ్వర్టైజ్ చేస్తే ఆ డాష్ టోన్ వ్యాపారం పదింతలు పెరిగిపోయేలా మారిపోయాను.

నాలుగు నెలలలో మూడువందల చిల్లర సంపాదించాలన్న మాట.

'డబ్బు కోసమైనా మీ చింత 'డాష్' వుంది మీ చెంత' అన్న ప్రకటన చూసి ఆ 'డాష్' దగ్గరకు వెళ్ళాను. లాభం లేకపోయింది. అంతలో కాలేజీలో చదువుతుండగా మా మిత్ర బృందం మహారాజ పోషకులుగా వున్న సినిమా హాలు, నాకు కావాల్సిన డబ్బుల గుడ్లు పెట్టే అందాల బాతులాగా తోచింది. పైగా దీపే ఆ సినిమా హాలు పేరు హంస. హంస అన్నా, బాతు అన్నా ఒకటేనా?"

భాస్కర్ చెబుతున్నది అతిశ్రద్ధగా వింటున్న జయ "ఏమిటీ హంసపాదు కథ చెప్పండి ముందు" అంది

"హంసపాదు గురించి కాదు నేను అడిగింది. హంస ఈజ్ ఈక్వల్టు బాతు అవునా, కాదా అని."

**పన్ను**

పచ్చలవిడిగా
వచ్చే ఆదాయం
లాన్ గడ్డి వంటిది.
అప్పుడప్పుడు
గడ్డిని కత్తిరించే
యంత్రం
ఆదాయపు పన్ను.

—ఉపద్రష్ట సాయి

"కాదు హంస అంటే పాలు, నీరు విడదీసే దాపతు. బాతు అంటే బురదనీరు, చేపలు విడదీసే రకం అన్నమాట" అంది జయ చిన్నప్పుడు చదువుకున్న బాతునోటి నిర్మాణాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ.

"సరే అయితే ఆ రోజుల్లో నాకు తెలియదు...."

"ఏమని?"

"అదే హంస, బాతు ఒకటి కాదు అని. సరే యిప్పుడు కరెక్టెడ్ వర్షన్ చెబుతున్నాను. ఆ హంస సెవంటీ యంయం సినిమా హాలు నాకు కావల్సిన డబ్బుల గుడ్లు పెట్టే అందాల హంసలాగా కనిపించింది. అన్నట్లు హంస మరి గుడ్లు పెడుతుందా?"

"మాస్టారూ! హంస, బాతు ఒకటే అయినా, కాకపోయినా, హంస గుడ్లు పెట్టినా పెట్టకపోయినా, మీరు చెబుతున్నది నాకు అర్థం అవుతూనే వున్నది." అంది జయ చిరాకుగా.

"సరే! మీరు చెప్పినట్లుగానే హంస గుడ్లు పెట్టినా పెట్టకపోయినా, ఆ హంస సినిమాహాలు, డబ్బుల గుడ్లు పెట్టే శాల్తీలాగా కనబడింది. ఆ హాలు మేనెజరుతో మాకు వున్న పరిచయంతో మొత్తంమీద బాల్కనీటిక్కెట్లుతీసుకునేచోటవుద్యోగం సంపాదించాను. రోజూ మ్యాట్నీ టైంలో నుంచుంటే చాలు. నెలకి అరవై రూపాయల జీతం. అది కాకుండా నెలకి దాదాపుగా వంద రూపాయలు స్పెషల్ అలవెన్సు ట. ఆశ్చర్యపోకండి! నెలలో ముప్పైసార్లు సినిమా ఫ్రీగా చూస్తాం కదా దాని తాలూకు విలువట! అట్లా చేతికి వచ్చే అరవై, నేను చెప్పే ట్యూషన్ల ఆదాయంతో కలిసి దాదాపుగా నూటపది తాకుతుంది. కాబట్టి మూడు వందలు సంపాదించటం కష్టంకాదు."

"మొదటి రోజున అందుకనే చాలా వుత్సాహంగా పనిచేస్తూ సినిమా చూశాను. సినిమా ఏం బాగోలేదు. రెండో రోజూ చూశాను. ఇంకా బాగుండలేదు. మూడో రోజూచూశాను. యింకా యింకా బాగాలేదు. నాలుగో రోజుకి చూసిన సైడ్లే, (మీకు చలిగా వుందా? మలేరియా కావచ్చు. రక్త పరీక్ష చేయించుకోండి!) చూసిన షాట్సే. (తలకాయ నెప్పా? అనాసిన్ శీఘ్రంగా పోగొడుతుంది. తల నెప్పా? ఆస్ప్రో మేలైన బాధా నివారిణి; తలకాయ నెప్పా? అమృతాంజనం వాడండి.) చూసేసిన సినిమానే మళ్ళీ మళ్ళీ చూడాలంటే చాలా కష్టమయిన పని అని అవగతం అయింది. అయిదో రోజుకి ఒక భయంకరమయిన విషయం తెలిసింది— ఆ సినిమాని ఏమయినా సరే రెండు వందల రోజులు ఆడించటానికి ఒప్పందం కుదిరిందని. అంత తీవ్రమయిన నిరాశలోనూ, నిస్పృహలోనూ, డిప్లమో కోర్సులో చేరాలి అన్న పట్టుదల సడలిపోలేదు.


ఆరో రోజు పొద్దున్న నాకు జాలికో క్లాత్ మిల్స్ నుండి ఒక వుత్తరం వచ్చింది. వాళ్ళు నిర్వహించిన పోటీలో నాకు కన్సొలేషన్ ప్రైజ్ వచ్చిందిట. వారి ఆథరైజ్డ్ డీలర్స్ వద్ద రెండు వేల రూపాయలకి మించకుండా కొనే పక్షంలో నలభై శాతం రిబేటు యిస్తామని విన్నవించుకుంటూ రాసిన వుత్తరం. సిటీ బస్సు ఎక్కడానికి డబ్బులుండేవు. ఎట్లాగా అనుకుంటుంటే టాక్సీవాడు వచ్చి 'సగం ఫేర్‌కే తీసుకుపోతాను రండి సార్' అన్నట్లుగా అనిపించింది. రెండు వందలు లేవుగాని రెండు వేల రూపాయల బట్టలు కొనాలిట! ఆ వుత్తరాన్ని చూసిన బావగారు నాకు బ్రహ్మాండమయిన అయిడియా యిచ్చారు- రెండు వేల రూపాయలషాపింగ్ చేసేవారిని పట్టుకొని, వారితో ఒప్పందానికి వచ్చి మిగుల్చుకున్న పైసలు సగం సగం పంచుకోమని.

ఆ అయిడియా విన్నాక ఒకసారి, వినక మునుపు ఒకసారి, నా ఫొటోలు తీసి వాటిని డాష్‌మార్కు సిమ్మింగ్ మెషీన్ వాడక మునుపు, వాడిన తరువాత అని అడ్వర్టైజ్ చేస్తే ఆ డాష్‌మార్కు కంపెనీకి లక్షల లాభం వచ్చేలా మారిపోయాను. అవును మరి నాకు కావల్సిన మనీ దొరకటమే కాదు, ఆ పాడు సినిమా యింకా ఎనభై ఏడుసార్లు చూసే బాధ తప్పుతుంది.

వెంటనే నేను హంసకి హంసలా రెక్కలు కట్టుకుని....చిన్న సందేహాలు రెండు. హంసకి రెక్కలు వుంటాయా? వుంటే అవి ఎగరగలవా?"

"మాస్టారూ!" అంది జయ కోపంగా.

"క్షమించండి. హంసకు రెక్కలు వున్నా, లేకపోయినా, అది ఎగిరినా, ఎగరక పోయినా, నేను ఆ సినిమా హాలు దగ్గరకు రెక్కలు కట్టుకుని వాలి, బాతులాగా నడుచుకుంటూ మేనేజరు దగ్గిరికి వెళ్ళి వుద్యోగానికి రాజీనామా యిస్తున్నానని చెప్పాను. సినిమాలో డ్యూయెటో హీరో, హీరోయిన్ని చూసినట్లు చూశాడు నన్ను. నేను వెంటనె ఒక కుర్చీ వెనక్కి వెళ్ళి నుంచున్నాను- వాడు ఆ హీరోలా నన్ను నలిపేస్తాడేమో అన్న భయంతో.



వాడు వణకసాగాడు.

చలిగా వుందా? జ్వరంగా వుందా వెంటనే రక్త పరీక్ష చేయించుకోండి అన్నాను.

వాడి ఒణుకుడు ఎక్కువ కావటంతో తెలిసింది. వాడికి కోపం వచ్చినప్పుడు అది వస్తుందని. ఒణుకు వచ్చినప్పుడు రక్తపరీక్ష చేయించుకోడు. కాని కోపం తెప్పించినవారి రక్తం పరీక్ష చేయటానికి ఉబలాటపడతాడని. ఆ సినిమాలో హీరో హీరోయిన్లలాగా ఆ హాలుచుట్టూ మేమిద్దరం పరిగెత్తాక నా ఆరు రోజుల జీతం మైనస్ మూడున్నర (సినిమా చూసినందుకుట!) దాదాపు పది రూపాయలు నా చేతిలో పెట్టాడు.

థాంక్స్ చెప్పి ఏకాఏకీ నా బట్టల కొట్టు ధగ్గర నిలబడ్డాను. ఆ సినిమా ఆరు సార్లు చూసిన నాకు ఎదురు చూడటం అంత కష్టం కాలేదు. అందునా నేను ఎక్కువసేపు నిరీక్షించకుండా ఒక కారు వచ్చి బట్టలకొట్టుముందు ఆగింది. అందులోంచి ఇదుగో ఈ కథకి నాయిక దిగింది."

"బాగుంటుందా?" జయ అడిగింది కుతూహలంగా.

"బాగుంటుంది. ఎంత బాగుంటుందంటే ఆ అమ్మాయి రూపాన్ని నా మెదడు పూర్తిగా జీర్ణం చేసుకోక మునుపె నేను ఆ అమ్మాయిని, సినిమాలో హీరో హీరోయిన్ని డ్యూయెట్లో చూసినట్లు చూడసాగాను. చూసి...."

"ఇక చాలుగాని వర్ణించండి."

"ఏమని వర్ణింపమంటారు? ఆ అమ్మాయి సినిమాల్లోకి వెళ్ళకపోవటం వల్లనే హేమమాలిని యింకా అక్కడ వుందనిపించింది. ఆ అమ్మాయిని చూస్తుంటే, పాటలు పాడటం ఆ అమ్మాయికి యిష్టం లేక పోతేనే లత బాగా పాడుతుంది అని చెప్పుకుంటున్నాం అని అనిపించింది- ఆ అమ్మాయి గొంతు వింటుంటే. ఇక ఆ అమ్మాయి నడక చూస్తుంటే హంసలు యింత తక్కువగా

నడవవు కదా అని అనిపిస్తుంది. అన్నట్టు ఒక సందేహం....."

"మాస్టారూ! హంసలు చాలా చక్కగా నడుస్తాయి. అందులో సందేహం లేదుగాని వర్ణన ఆపుచేసి అసలు కథ చెప్పండి" అంది జయ అసహనంగా.

"అసలు మిమ్మల్ని చూసేంత వరకూ ఆమె కన్నా అంగగతెలు వుండరన్న భ్రమలో వుండేవాడ్ని." జయ మొహంలో ప్రసన్నత చోటు చేసుకోవటం చూసి మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు. "సరే! నేను వెర్రి వెంగళాయిలా- అవును ఆ హీరో అట్లాగే చూసాడు—చూస్తూ వున్నా. ఆ అమ్మాయి పేరు జానకి అని. ఆ అమ్మాయితోపాటు వచ్చి యింకా కారు దిగని అమ్మాయి పేరు శాంత అని వారి సంభాషణ బట్టి గ్రహించాను. అంతే కాదు శాంతకి పెళ్ళి జరగబోతున్నదని (థాంక్ గాడ్! పెళ్ళి జానకికి కాదు). ఆ పెళ్ళికి దాదాపుగా పదిహేను వందల రూపాయల బట్టలు అప్పటి ఇన్‌స్టాల్‌మెంట్లో కొనబోతున్నారని గ్రహించాను—వారి సంభాషణ ద్వారా.

జానకి, శాంత బట్టల షాప్‌లోకి వెళ్ళబోతున్నారు. నేను జానకి వెనక వెళ్ళి "ఎక్స్‌క్యూజ్‌మీ.....!" అన్నాను.

జానకి నా వంక తిరిగింది. నేను మాట్లాడే లోపున "యూ ఆర్ మిసర్ భాస్కర్!" అంది ఆనందాన్ని ఆశ్చర్యాన్ని సమపాళ్ళల్లో పలికిస్తూ. "యూనివర్శిటీలో మొన్న మీరు చేసిన మిమిక్రీ రియల్లీ మార్వలెస్."

# నేటి కవిత్వం

వాడొచ్చి అంటాడు
ఈ ప్రపంచం యిలా వుండటానికి కానీ
నాశన మవటానికి కానీ
నీ బాధ్యతేమీ లేదని—

భుజాలమీద బరువు దించినట్టుంటుంది-
నవ్వు పెల్లల్లాగానో, పక్షుల్లాగానో,
ఆడుకో, పో-
వాళ్ళు ఆడుకుంటారు

వాళ్ళు మరచిపోతారు
ఉనికికోసం ఊపిరికోసం
చేసే యుద్ధమే నేటి కవిత్వమని.

టాడెవుజ్ రోజవిజ్
పోలిష్ కవి
అనువాదం : కె. శివారెడ్డి

రాత్రి పడుకోబోయే ముందు. హేమమాలినిని పెళ్ళి చేసుకోవటం ఎట్లాగో సాధ్యం కాదు. ఒక సారి కలలో కనబడినా చాలు అని అనుకున్న వాడు పొద్దున్నే కళ్ళు తెరచి చూసేటప్పటికి, ఆ హేమమాలిని తన మెడలోని మంగళసూత్రాలని, వాడికాళ్ళని ఆల్టర్నేట్‌గా కళ్ళకద్దుకుంటూ కనిపిస్తే ఎట్లా అయిపోతాడో అట్లా అయిపోయాను. నాకు నోట మాట రాలేదు.

జానకి నన్ను ఎడాపెడా పొగిడేసింది. చివరికి తనతోపాటు లోపలికి రమ్మంది. ఆ ఆహ్వానాన్ని కాదనలేకపోయాను. జానకి నాతో మాట్లాడుతూనే చీరలు చూసింది. సరే బిల్లు వచ్చింది— పద్దెనిమిది వందల రూపాయల చిల్లర. నాకు బిలు పే చేయబోతుంటే నాకు అసలు విషయం గుర్తుకు వచ్చింది. జానకికి ఆ వుత్తరం యిచ్చి విషయమంతా వివరించాను రహస్యంగా.

ఇదరూ "ఇట్స్ వెరీ నైస్ ఆఫ్ యూ" అన్నారు.

నిముషాలమీద బిలు చెలించి దాదాపు ఏడు వందలు మిగుల్చుకున్న వారితో బయటపడాను.

"మీ స్కూటరేనా?" అంది జానకి పక్కగా పార్క్ చేసివున్న స్కూటర్ వంక చూస్తూ.

"నేను తీసుకురాలేదు" అన్నాను ఎటూ తేలకుండా.


"అయితే కారులో డ్రాప్ చేస్తాం రండి" అన్నారు యిదరూ డ్యూయట్ పాడుతూ.

"ముగ్గురం కలిసి హోటల్‌కి వెళ్ళాం- అది నేను సజెస్ట్ చేసిందే. ఎందుకంటే వాళ్ళ వ్యవహారం చూస్తే నన్ను యింటి దగ్గరే డ్రాప్ చేసేటున్నారు- అది నాకు యిష్టంలేదు. హోటల్ నించి బయట పడ్డాక ఏదో సాకు చూపించి గుడ్‌బై చెప్పాలని నా ఆలోచన. ఇదరూ కలిసి ఎడాపెడా ఆర్డర్స్ యిచ్చారు. అంతా అయిపోయాక సర్వర్ బిలు తీసుకువచ్చాడు- తొమ్మిది రూపాయల పది పైసలు. పది రూపాయలు జేబులోంచి తీసి యిచ్చి "కీప్‌ది ఛేంజ్" అని గర్వాగా అచాను.

మర్నాడు రవీంద్ర భారతిలో డాన్స్ ప్రోగ్రాంకి తన దగ్గర ఓ ఎక్స్ట్రా టికెట్ వుందని, నేను తప్పక రావాలి అని మరీ మరీ చెప్పి సెలవు తీసుకుంది జానకి.

జానకి వెళ్ళాక నా మెదడు యధాప్రకారం పనిచెయ్యటం ప్రారంభించింది. అప్పుడు నాకు రెండు విషయాలు తెలిశాయి- కన్సొలేషన్ ప్రైజ్ మూలకంగా సంపాదిదాం అన్న నా వాటా డబ్బులు నాకు రావు అని. సినిమా హాలువాడు యిచ్చిన డబ్బులు హోటల్‌లో ఖర్చు పెట్టాం అని.

జానకిధనవంతురాలని ఆమె నన్నూ. ఏడు వందల రూపాయల మొత్తం తృణప్రాయంగా వారికి యిప్పించిన నా వ్యవహారాన్ని చూసి నన్ను కూడా రిచ్ ఫెలో అనుకుందని కూడా తెలిసింది. అంటే



జానకితో నేను స్నేహం సంపాదించుకోవాలంటే నేను ఆ యిమేజ్ మెయిన్‌టైన్ చెయ్యాలన్నమాట. అంటే అంతవరకు డిప్లమా కోర్సులో చేరటానికి మాత్రమే డబ్బులు సంపాదించాల్సి వచ్చింది అప్పటి నుండి జానకితో తిరిగేందుకు కూడా డబ్బులు సంపాదించాలన్నమాట అంటే ముందసుగా ఒక ఉద్యోగం సంపాదించాలన్నమాట.

బాగా డబ్బు, రెండు మూడు బిజినెస్‌లు వున్న దాబాయి వున్న మా ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళి అప్పుయిస్తావా లేక ఏదన్నా వుద్యోగం యిప్పిస్తావా అని బెదిరించాను వాడు రెండోదే ఇస్తానని నేను ఎన్నుకోవడానికి మూడు వుద్యోగాలు చెప్పాడు. మొదటిది—పొద్దున్న తిరుగుతూ చేసున్న చవకరకం డిటర్జెంట్ బార్ షాప్ షాప్ తిరిగి అమ్మటం— ఇది నాకు చవకబారుగా కనబడింది రెండోది-వాళ్ళ బార్‌లో కూర్చుని బిల్స్ అకౌంట్స్ గట్రా రాయటం అది చవకబారు అని అనలేను ఎందుకంటే అది సిటీలో కల్లా బాగా కాస్ట్లీ బార్ కాని బార్‌లో కూర్చుని చల్లటి నీరు తాగినా బీరు అనుకుంటారు కదా. ఎంత దాచినా ఈ విషయం అక్కయ్యకి తెలిస్తే యింత బాధన నన్ను తిడుతుంగని అదీ కాదన్నాను. ఇక మిగిలిన దానికి ఏ విధమయిన తటపటాయింపు లేకుండా చేరాను.'

"ఏమిటో ఉద్యోగం?" జయ అడిగింది

"ఓ పెద్ద హోటల్‌లో సర్వర్ వుద్యోగం"

"నిజంగానా?"

"నిజమే! ముందు కొంత సంకోచించిన మాట వాస్తవమే కాని అదే రోజున పేపర్‌లో ఒక అడ్వర్టైజ్‌మెంట్ వచ్చింది. సర్వారాయ ఫిలింస్ వారి "సర్వరు సర్వలింగం" చిత్రంలో నటించడానికి అంగరూ కొత్తవారు కావాలని. దానికి అప్లై చేసి, ఈ లోగా సర్వర్ పని ఎట్లాంటిదో చూసుకుంటే నేనా పాత్రకు రిసెంట్ అయి. అందుల మేరకు ఆ పాత్రను పోషించవచ్చు కదా అన్న అభిప్రాయంతో ఆ సంకోచం ఎగిరిపోయింది

ఇక పోతే ఏం ఉద్యోగం అది! కావలసినన్ని సార్లు కాఫీ తాగచ్చు. జీతం అంటారా నెలకు నూటయిరవై. మధ్యాహ్నం ఎనిమిది గంటల నుండి సాయంకాలం ఎనిమిది వరకు పని నేను [illegible] లేకుండా మా ఫ్రెండ్ అరేంజ్ చేశాడు. నాటకాలలోని

# కవిత్వం

## చెట్టు

భూమిలోకి, ఆకాశంవైపూ
ఎదుగుతుంది

మనిషి
ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను
పెరుగుతూ వచ్చాడు.

భౌతిక శక్తివైపు మొగ్గు చూపదలిచిన
'పరిచర్చ వరి' రోజులలోని,
అంతఃచక్షువును కోల్పోయే
ప్రమాదాన్ని
'శంకుడు' అనుభవించాడు.

ఒక "చూపు" లక్ష్యపెట్టి
మరో 'చూపు'ని నిర్లక్ష్యం చేస్తే,
మనిషి సహజమైన వృద్ధి కుంటుపడుతుంది


భూమిలోకి సరిగా చొరబడి
ఎదగలేని చెట్టు,
ఆకాశంవైపు సరిగా పెరగలేదు.

—కె. ఎ. ఎన్. తల్పశాయి

అనుభవంతో, మిమిక్రీలో నాకున్న ప్రావిణ్యంతో సర్వరుపాత్రను శక్తిమేరా పోషిస్తూ, ఎన్నో విషయాలు నేర్చుకున్నాను అది మామూలేమో తెలియదు గాని నాకు జీతంతో సమానంగా టిప్స్ వస్తుండేవి- ఫ్యామిలీ రూంలో నా డ్యూటీ అవటం ఒక కారణం అయి వుండచ్చు. ఆ టిప్స్ తీసుకోవడమైతే తీసుకునేవాడిని కాని వాటిని దాచుకోవాలంటే అదోరకమైన సిగ్గులాంటిది వేసేది అందుకనే జానకితో బయట తిరిగేటప్పుడు ఆ చిల్లర బిచ్చగాళ్ళకు వేసేవాడిని అది జానకికి ఎంతో నచ్చింది. దాంతో మామిద్దరం ఎంతో సన్నిహితం అయిపోయాం— పచ్చిమిరపకాయ బజ్జీలా మిరపకాయ, శనగపిండిలా! మా యిద్దరి అభిరుచులు. రుచులు ఒకటే— యిద్దరికీ పచ్చిమిరపకాయ బజ్జీలు యిష్టం. ఇద్దరికీ కొన్నాళ్లు అమోల్ పాలేకర్ యిష్టం. ఆ తరువాత అమితాబ్ యిష్టం. అట్లాగన్నమాట

"ఆ వుద్యోగంలో ఇంకో సదుపాయం వుండేది. వాళ్ళు వారం చివర ఆ వారం జీతం యిచ్చేవారు. దాంతో జానకితో కలిసి తిరిగేందుకు కావాల్సిన మనీ ఎప్పటికప్పుడు దొరికేది. నెల అయిపోయాక మానుకుంటే నేను ఆ వుద్యోగంలో చేరి సాధించింది ఏమీ లేదని తేలిపోయింది- ట్యూషన్ నుంచి వచ్చిన ఆదాయాన్ని ఖర్చుపెట్టటం తప్ప. ఆ లెక్కన నేను డిప్లమో కోర్సులో చేరటం అన్నది వట్టి మాట అన్నమాట అయినా జానకితో రోజు రోజుకి పెరుగుతున్న ప్రేమ దాని గురించి ఆలోచించకుండా చేసింది [illegible]గా జానకితో వ్యవహరించే భాస్కర్‌కి మామూలు భాస్కర్‌కి చాలా తేడా వుంది. కత్తిమీది సాములాంటి ఆ ద్విపాత్రాభినయాన్ని నిర్వహిస్తుండగా దొరికే టైనింగ్ ఎక్కడా దొరకదని సమాధాన పరుచుకునేవాడిని.

ఓ రోజున నా డ్యూటీ మొదలుపెట్టి కస్టమర్స్ లేకపోవటంతో కిచన్‌కి వెళ్ళి,



# ఉద్యోగవిజయం

కాఫీ తాగి వచ్చాను. అప్పటికే ఫ్యామిలీ రూంలోంచి మాటలు వినిపిస్తుంటే ట్రేలో మంచినీళ్ళ గ్లాసులు పెట్టుకుని వెళ్ళబోయాను. నేను ఆ రూంకి దగ్గర అవుతున్న కొద్దీ. ఆ మాటలలో సగం జానకిదా అన్న అనుమానం ఎక్కువ కాసాగింది. ఎందుకయినా మంచిదని ట్రే బయట పెట్టి లోపలకి వెళ్ళాను.

నా అనుమానం నిజమే! జానకి, ఆమె స్నేహితురాలు యింకొక అమ్మాయి వున్నారు.

"ఎన్నిరోజుల తరువాత మధ్యాహ్నం కనిపించారు! డ్రామా రిహార్సల్స్ లేవా?" అంది జానకి పక్క కుర్చీలోకి మారి-నన్ను ఆ కుర్చీలో కూర్చోమన్నట్లు చెయ్యి వూపుతూ!

"రిహార్సల్సు కాన్సెల్ అయ్యాయి!" అన్నాను కూర్చుంటూ! కూర్చున్నాను గాని. నాకు భయంగానే వుంది—మా మేనేజరు ఎప్పుడు వస్తాడా అని. మా మేనేజరుది మహా బిజినెస్ మైండ్— వాళ్ళ అమ్మాయిని సినిమాకి తీసుకుని వెళ్ళినా ఏం ఫీల్ కాడుకాని. కస్టమర్స్‌తో చనువుగా వుంటే వాడికి మహాకోపం. అందులోనూ నా మీదవాడికి అనుమానంఎక్కువ అవటంతో నా మీద ఓ కన్ను వేసి వుంచుతాడు. ఇంతలో ఏం మాట్లాడాలో తెలియనప్పుడు. ఏం మాట్లాడలేక పోతున్నప్పుడు అబద్ధాలు చెప్పటం కన్నా మించిన పద్ధతి లేదని బావగారు యిచ్చిన సలహా గుర్తుకు వచ్చింది.

"ఈ హోటల్ ప్రొప్రైటరు మా ఫ్రెండే! చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం చాలా రోజుల తరువాత అనుకోకుండా సినిమా హాలులో కలుసుకున్నప్పుడు...."

జానకి ఏదో గుర్తు వచ్చినట్లుగా నన్ను తన ఫ్రెండ్‌కి పరిచయం చేసింది. చేశాక "ఈయన మిమిక్రీ చాలా బాగా చేస్తారు" అంది.

"అట్లాగా! అయితే ఒకసారి చేసి చూపించాలి" అంది ఆ అమ్మాయి.

ఇంతలో బయటనుండి అడుగుల చప్పుడు వినిపించింది. ఆ అడుగుల నడి నాకెరుకే! అది మా మేనేజరుది. ఆ చప్పుడు దగ్గరవసాగింది. యింకో పది క్షణాలలో వాడు తొంగి చూడటం తప్పదు.

ఇంతలో నాకు ఓ అయిడియావచ్చింది. చటుక్కున లేచి 'మిమిక్రీ చేస్తున్నా' అని రాజబాబు లాగా నుంచుని 'లడ్డు. జిలేబి. హల్వా. బాసుంది. యిడ్లీ. వడ.పకోడి.... అంటూ రాజబాబులాగా అన్నాను. నేను ఆ దండకం చదువుతుండగా మా మేనేజరు తొంగి చూసి. సంతృప్తుడై వెళ్ళిపోవడం జరిగింది.

"చాలా బాగుంది" అన్నారు యిద్దరూ.

నాకుమటుకు ఏమీ బాగాలేదు ఆ పరిస్థితి —కొత్త బ్లేడ్‌తో షేవ్ చేసుకుంటూ డాన్స్ చేస్తున్నట్లు వుంది. మా మేనేజరు అట్లా వస్తూనే వుంటాడు, అట్లా తొంగి చూస్తూనే వుంటాడు. వాడికి యిది, వీళ్ళకి అది, తెలియకుండా దాయాలంటే....?

"ఇంతకీ మీకేం కావాలో చెప్పలేదు" అన్నాను.

"ఏం కావాలో ఏమిటి?"

"అదే! ఈ హోటలు దాదాపుగా మనదే అన్నమాట. ఏం కావాలో చెప్పండి. లోపల చెప్పి మీ కోసం అది స్పెషల్‌గా చేయించుకుని వస్తాను" అన్నాను.

"అన్నట్లు మిర్చి బజ్జి యిక్కడ చాలా బాగుంటుంది. తింటారా జానకీ"

దానికి యిద్దరూ ఒప్పుకున్నారు.

కిచన్ వేపు నడిచాను. అక్కడ క్లీనర్ కుర్రాడు పన్నెండేళ్ళవాడు కనిపించాడు. వాడిని పిలిచి "ఒరేయి నీకు గ్లాసులు. ప్లేట్లు కాళ్ళతో తియ్యటం వచ్చా?" అని అడిగాను.వాడు రాదన్నాడు. "అయితే జాగ్రత్త నేను ఆ ఫ్యామిలీ రూంలో నా ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ వుంటాను. మేనేజరు వస్తుంటే నాకు ముందుగా కబురందించకపోతే నీ చేతులు విరగ్గొడతాను. నీకు కాళ్ళతో పని చెయ్యటం రాదు కదా నీకు ఎక్కడా పని దొరకదు" అని బెదిరించాను. తరువాత రెండుప్లేట్లలో మిరపకాయ బజ్జీలు తీసుకుని వెళ్ళాను.

"అదేమిటి? మీరే తీసుకువస్తున్నారు?" అంది జానకి ఆశ్చర్యపోతూ.

"చెప్పానుగా. ఈ హోటల్ మా గాఢ మిత్రుడిది. వాడిని చాలా రోజుల తర్వాత కలుసుకున్నప్పుడు నన్ను కూర్చోపెట్టి తనేస్వయంగా సర్వ్ చేశాడు— యిలాగే! నేనూ అదే ఆచారాన్ని అనుసరిస్తున్నాను" అన్నాను.

ఇంతలో "చేయి చేయి కలిసింది...." అని మా క్లీనర్ పాడటం వినిపించింది. అది మా కోడ్ – అంటే మా మేనేజర్ వస్తున్నాడన్నమాట.

అందుకనే వాళ్లు యింకా తినటం మొదలుపెట్టకపోయినా "కాఫీనా. టీనా. కూల్‌డ్రింక్సా?" అని అడిగాను. అదే సమయానికి తొంగిచూసిన మేనేజర్ మళ్ళీ తృప్తిపడి వెళ్ళిపోయాడు.

"ఈయన ఎవరూ? మాటి మాటికీ యిట్లా తొంగి చూసి పోతున్నాడు?" అడిగింది జానకి ఫ్రెండ్.

"ఆయన హోటల్ మేనేజరు. పెళ్ళాం గత పదిన్నర నెలలనుండి కడుపుతో వుండి గంట క్రితమే హాస్పిటల్‌లో చేరింది. దాంతో ఆయన అట్లా పచార్లు చేస్తున్నాడన్న మాట" అన్నాను. నేను చెప్పింది నాకే నమ్మబుద్ధి కాలేదు. కాని,ఆ అమ్మాయి నమ్మినట్లే కనబడింది.

"మీరు కూడా తీసుకోండి" అంది జానకి ఒక బజ్జీ కొరుకుతూ నేను నుంచునే ఒక బజ్జీ తీసుకుని తినటం మొదలుపెట్టాను.

"ఈ బజ్జీలు....ఎక్....చాలా....ఎక్ ....కారం....ఎక్... గా వున్నా .. ఎక్.... యి!" అంది జానకి ఫ్రెండ్ ఎక్కిళ్ళు రాగా.



"ఎక్ ....ఆ వు....ఎక్ ... సు" అంది జానకి యథాశక్తి.

అప్పుడు తెలిసింది. నేను చేసిన పొరపాటు. ప్రొఫెషనల్ సర్వర్ అయితే ముందు మంచినీళ్ళు యిచ్చిగాని యింకో మాట కూడా వినడు. నేను జానకిని చూసిన కంగారులో మంచినీళ్ళ గ్లాసులు ఒయట పెట్టి వచ్చేశానాయె.

"ఇదేం ....హోటల్ ....ఎక్ ....బాబూ ....ఒ....ఎక్ ....క్క సర్వ ....ఎక్ .... రు కూడా....ఎక్ ....రావటం....ఎక్ ....లేదు" అంది జానకి ఫ్రెండ్. ఆ సమయానికి ఎక్కిళ్లు అమీబా లాగా ద్విథా, శతవిధా విచ్ఛిత్తి అయిపోగా.

"ఎక్ ....నేనే....ఎక్ ..రావద్దు...ఎక్.. న్నాను" అన్నాను నేను. నాకూ ఎక్కిళ్ళు వచ్చాయి.

"మం....ఎక్ ఎక్ .... చినీళ్లు" అంది జానకి చాలా గట్టిగా. నిజంగా అది చాలా రిమార్కబుల్ ఫీట్. అంత ఎక్కువగా ఎక్కిళ్లు వస్తున్నప్పుడు అంత గట్టిగా అరవటం ఎంతో అసాధ్యమయిన పని. జానకిని అభినందిద్దాం అనుకుంటుండగా జానకి కేకలు విని కాబోలు మేనేజరు లోపలికి వచ్చాడు. వాడి వెనకాలే "చేయి చేయి..." పాట వినిపించింది

జానకి ఫ్రెండ్‌కి ఎటికెట్ బాగా తెలుసు కాబోలు- మంచినీళ్లు లేవని బాధపడకుండా "మీ....ఎక్ ....ఆవిడ....ఎక్ ....క.... ఎక్ న్నదా?" అని అడిగింది మేనేజరుని.

వాడికి ఏం అర్థం కాలేదు. నా వంక చూశాడు. నాకు నోట మాట రాలేదు— ఎక్కిళ్ళు మాత్రం వచ్చాయి. "ఎక్.... ఎక్ ....ఎక్ ...." అన్నాను.

"'ఎక్ ....ఎక్ ....ఎక్'.... అంటే?" అడిగాడు.

"అంటే....ఎక్ .... ఎక్కి.... ఎక్ .... ళ్లు" అంది జానకి ఫ్రెండ్.

ఈ సందేహ నివృత్తులు తర్వాత ముందు మంచినీళ్ళు తెప్పించే ప్రయత్నం చేయించండి అనాలనుకుందో ఏమో "ఎక్ ....ముందు ....ఎక్ ....నీళ్ళు.... ఎక్ ....చచ్చిపో....ఎక్ ....తున్నాను ....ఎక్" అంది జానకి.

"మగపిల్ల....ఎక్ ....వాడా,ఆడ....ఎక్ పిల్లా?" అడిగింది జానకి ఫ్రెండ్.

మా 'ఎక్ భాష' వాడికేం అర్థం కావడం లేదు అని తెలిసిపోయింది— వాడి మొహం చూస్తుంటే! అయినా అర్థం చేసుకోవాలని మా ముగ్గుర్నీ అనుకరిస్తూ "ఎక్ ....ఎక్ ....ఎక్ ....ఎక్ ...." అనసాగాడు— బాతునో, హంసనో మిమిక్రీ చేస్తున్నట్లు.

చిన్న పిల్లలకి ట్యూషన్లు చెప్పే అలవాటు వుండటంతో, తెలియనివారికి ఏ విషయమైనా వివరంగా చెప్పటం అలవాటయింది. అందుకనే వాడికి 'ఎక్ భాష' ఫండమెంటల్స్ చెబుదామని "మీకు.... ఎక్ ....ఎక్ ....'క భాష' వచ్చా?" అని అడిగాను.

అప్పటికే వాడికి మతిపోయినట్లుంది. జుట్టు పీక్కున్నాడు.

"డెలివరి ....ఎక్ .... సుఖంగా.... ఎక్ ....అవ....ఎక్ ....లేదా?" జానకి ఫ్రెండ్ అడిగింది.

"నేను.... ఎక్.... భరించ.... ఎక్.... ఎక్ ....లేను....ఎక్" అంది జానకి. వయలెంట్‌గా చేతులు కదుపుతూ దాంతో బజ్జీల ప్లేట్లు కిందపడి పగిలిపోయాయి.

"ఏమిటీ 'ఎక్ ఎక్'లు?" మళ్ళీ అడిగాడు.

'క భాష'లో ప్రతి అక్షరానికి ముందు 'క' చేర్చి మాటాడుతారు. ఉదాహరణకు ఎక్కిళ్ళు అనాలంటే 'కఎకక్కికళ్ళు' అంటారు. అలాగే 'ఎక్ భాష'లో 'ఎక్' అన్నదానిని సమయానుకూలంగా మాటల మధ్యలో చొప్పిస్తారు. అన్న పాఠాన్ని చెబుదామనుకున్నాను గాని, ఎక్కిళ్లు యినుమడించేటప్పటికి నా నోటినించి వచ్చింది "ఎక్ ....ఏ ఎక్.... ఎక్కి.... ఎక్ ...." అన్న రూపం దాల్చింది.

వాడికి ఏం చెయ్యాలో తెలియక మమ్మల్ని వదిలి వెళ్ళబోయాడు.

జానకికి కోపం తారాస్థాయిలో, టాప్‌లో వున్న సినీతార స్థాయిలో వచ్చేసింది. వట్టి మాటల్, ఎక్కిళ్ళ కట్టిపెట్టి, గట్టిబజ్జీల్ చేతబట్టి వాడి నోట పెట్టింది.

అసంకల్పిత ప్రతీకారచర్యగా వాడు వాటిని నమలగా వాడికి ఎక్కిళ్లు పూనాయి. దాంతో వాడికి జ్ఞానోదయం అయింది.

"హికప్స్.... ఎక్.... ఐమీన్ .... ఎక్ .... ఎక్కిళ్లు?" అని అడిగాడు.

జానకి, జానకి ఫ్రెండ్ తల వూపారు. అది జవాబుగా తల వూపటమో లేక ఎక్కిళ్ల తీవ్రం కావటంతో తల అట్లా ఆడించారో నాకు ఎప్పటికీ తెలీదు.

అప్పుడే మా క్లీనర్ కుర్రాడు తొంగి చూశాడు. నేను రెండు చేతులతో మంచినీళ్లు అన్నట్టుగా అభినయించాను. నా చేతుల అభినయాన్ని వాడెట్లా అర్థం చేసుకున్నాడోగాని, చేతులు వెనక్కి పెట్టుకుని పారిపోయాడు. ఇక లాభం లేదని నేనే బయటకి వెళ్ళి మంచినీళ్లు తెచ్చి అందరికీ యిచ్చి నేనూ తాగాను.

## మీరు - మేము

మీరు పుట్టి పుట్టక ముందే
మీ కాళ్ళకు జోళ్ళు
మేము పుట్టి గిట్టేదాకా
మా కాళ్ళకు ముళ్ళు.

—అయ్యన్నమూర్తి



## ఉద్యోగ విజయం

"సర్వర్ రాకపోయినా అన్నీ ఈయనే తీసుకు వచ్చారు" అంది, మేనేజరుతో ఎక్కిళ్లు శాంతించాక.

"ఇది ఎన్నో కాన్పు?" జానకి ఫ్రెండ్ అడిగింది.

"నువ్వూ తిన్నావా బజ్జీ?" మేనేజరు అడిగాడు అనుమానంగా.

"ఇంత వరకూ సర్వరు ఎందుకు రాలేదు?" గద్దించింది జానకి గ్లాసుతో టేబులు మీద కొడుతూ- ఆ గ్లాసు పగిలి పోయింది.

"తల్లీ బిడ్డ క్షేమమేనా?" జానకి ఫ్రెండ్ అడిగింది.

"నువ్వు తినకూడదని తెలియదా?" అన్నాడు మేనేజరు నాతో.

"ఆయన ఎందుకు తినకూడదు?" అంది జానకి.

"బేబీ బరువెంత?" అడిగింది జానకి ఫ్రెండ్.

"మీ ఫ్రెండ్‌తో చెప్పి వీడిని వుద్యోగంలోంచి పీకెయ్యండి" అంది జానకి నాతో.

"మీ పోలికా, మీ ఆవిడ పోలికా?" జానకి ఫ్రెండ్ అడిగింది.

"వీళ్ళు నీ ఫ్రెండ్సా?" అడిగాడు మేనేజరు నన్ను — అంత పిచ్చిగా మాట్లాడే వాళ్ళు నా ఫ్రెండ్సు అయి వుండాలన్నట్లు.

"ఏ హాస్పిటల్లో కన్నది మీ ఆవిడ?" జానకి ఫ్రెండ్ అడిగింది.

"బిల్లు రాసేటప్పుడు గ్లాసు, రెండు ప్లేట్ల కరీదు కూడా చేర్చు" అన్నాడు మేనేజరు వెళ్ళబోతూ.

"ఆయన బిల్లు రాయటం ఏమిటి? మీకు మతిపోయిందా?" అంది జానకి.

"ఇంకా పిల్లవాడిని చూడలేదా? శాంతి వుందా?" అంది జానకి ఫ్రెండ్."

జయ యిక నవ్వు ఆపుకోలేకపోయింది. "ఇక చెప్పద్దు" అన్నట్లుగా చేయి వూపి పగలబడి నవ్వింది.

"నేను మీకు ముందే చెప్పాను కదా? మీరు నాకు ఎంటర్‌టైన్‌మెంట్ టాక్స్ యివ్వాలి" అన్నాడు భాస్కర్.

"ఇస్తానుగాని తరువాత ఏమయింది?"

"ఏముంది? మా మేనేజరుకి అసలు విషయం తెలిసేలోగా క్లీనర్‌ని డిస్మిస్ చేశాడు. తెలిశాక నన్ను...."

"క్లీనర్‌నా? ఎందుకు?"

"వాడు కిచన్‌వేపు వెడుతుంటే ఆ క్లీనర్ గ్లాసులు, ప్లేట్లు పగలగొడుతూ కనిపించాడుట. ఏమిటో అనిఅడిగితే కాళ్ళతో తీయటం ప్రాక్టీసు చేసున్నానుఅన్నాడుట. దాంతో అప్పటికే తిక్కతిక్కగా వున్న వాడు యింకా కసి ఎక్కిపోయాడుట. ఈలోగా అసలు విషయం తెలియని జానకి వాడి దగ్గరికి వెళ్ళి ఏమైనాసరే వాడు నాకు క్షమాపణచెప్పుకోవాలని డిమాండ్ చేసింది. బూట్లో బతికిన బొద్దింక ఉంది. లేస్ ముడి బిగుసుకుపోయి, కాలు బయటికి రాని వాడిలాగా డాన్సు చేశాడుట వాడు. ఓ నిముషం తరువాత జానకికి అంతా అవగతమైపోయింది. తనే మేనేజరుకి క్షమాపణ చెప్పుకుంది. నాతో ఒక్కమాటకూడా మాటాడలేదు. బిలు తెప్పించుకొని పే చేస్తూ ఒక పావలా టిప్ వదిలింది. అంత వరకూ టిప్స్ అన్నీ బిచ్చగాళ్ళకి వేసిన నేను ఆ పావలాని ఈ ప్రేమ బిచ్చగాడి దగ్గరే పదిలంగా దాచుకున్నాను."

"ఇంకా మీ దగ్గరేవుందా ఆ పావలా?"

"ఉంది. జానకిని ఆ తరువాత తరువాత మెల్లిగా మర్చిపోయానుగాని, ఆ పావలా కాసు చూసినప్పుడల్లా జానకి గుర్తుకు వస్తుంది." అంటూ పర్స్ తీసి అందులో చిల్లర వుంచుకునే కంపార్ట్‌మెంట్‌లో అతి భద్రంగా దాచుకున్న పావలా తీసి జయకి యిచ్చాడు.

"అలాగా?"అంది జయ ఒక నిముషం ఆలోచించి. "ఈ పావలా నేను తీసుకుంటున్నాను" అంది. తన పర్స్‌లోంచి ఇంకో పావలా తీసి భాస్కర్‌కి యిచ్చింది.

భాస్కర్ కళ్ళు చిత్రంగా మెరిశాయి. గుండె తీవ్రంగా ఎక్కిళ్ళు వచ్చిన మనిషిలా కొట్టుకుంది.

"మీకు ఎంటర్‌టెయిన్‌మెంట్ టాక్స్ కావాలన్నారు కదూ? యిస్తాను" అని అటు పోతున్న వేరుశనక్కాయలవాడిని పిలిచింది. భాస్కర్ నుంచి తీసుకున్న పావలా యిచ్చి కాయలు యిమ్మంది.

"రెండు పొట్లాలు చేయాలా?"


"అక్కర్లేదు ఒక దాంట్లో యివ్వు"

భాస్కర్ కళ్ళు మళ్ళీ చిత్రంగా మెరిశాయి. అంత ఆనందం కలగబట్టే "మీరు యింతకు మునుపు ఎవరినైనా ప్రేమించారా?" అని జయని అడుగుదామనుకుని కూడా మరిచిపోయాడు.

* * *

"చెప్పు ప్రభా! నువ్వు ఎవరినన్నా ప్రేమించావా?" మళ్ళీ అడిగింది రాజేశ్వరి.

ప్రభాకర్‌కి చెప్పక తప్పలేదు. "ఇంతకుమునుపు అంటే నా మెదడు అంత బాగా వికసించనప్పుడన్న మాట... కాలేజీలో నా జూనియర్‌తో చనువుగా వుండేవాడిని-అంటే నా క్లాస్‌మేట్ చెల్లెలు అన్న మాట. నేను చనువు అని అనుకున్నాను మొదట్లో. కాని, తను 'ప్రేమ' అనుకున్నట్లుంది. తీరా చూస్తే ఆ అమ్మాయికి పదహారేళ్లుంటాయికాబోలు అప్పుడు. ఆ తరువాత నేను అహమదాబాద్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయటానికి వెళ్ళినప్పుడు ఆ అమ్మాయి తెగవుత్తరాలు రాసుండేది. అప్పుడు తెలిసింది ఆ అమ్మాయి నన్ను ప్రేమిస్తున్నదని అఫ్‌కోర్స్ ఆ తరువాత నేనూవుత్తరాలురాయటంమొదలు పెట్టాను.




నేనూ సారాఫ్ ప్రేమించటం ప్రారంభించాననుకుంటా. తరువాత నేను స్టేట్స్ నుంచి వచ్చేటప్పటికి యిండియా మారకపోయినా మా వూరు మారిపోయింది. వాళ్ళ కుటుంబం ఎక్కడికి వెళ్ళిపోయిందో తెలియదు—నేనూ తెలుసు

కావాలని ప్రయత్నించినా ప్రయత్నించావా మన్నా అంత సమయం. [illegible] అన్నాను పూర్తి వివరాలు చెబుతూ

"ఆ అమ్మాయి రాసిన ప్రేమ లేఖలు యింకా నీదగ్గర వున్నాయా? రాజేశ్వరి అడిగింది. అదోలా — ప్రేమ లేఖలు అనే చోట కర్కశంగా ఒత్తి పలకటంతో రాజేశ్వరి గొంతు అదోలా మారింది.

ప్రభాకర్ నెర్వస్ అయిపోయాడు. అసలే రాజేశ్వరికి అనుమానం. అమాయ యెక్కువ తను పడలేరు. నలభై మధ్య వున్న యెటువంటి ఆడదానితో యెటువంటి అల్ప విషయం మాట్లాడినా రాజేశ్వరికి అనుమానంరాక తప్పదు. అటువంటప్పుడు సత్య హరిశ్చంద్రుడి కజిన్‌లాగా ప్రేమ లేఖలుగట్రా అంటూ పూర్తి నిజాలు చెప్పి పొరపాటు చేశాడు. ముందుగానే తను రాజేశ్వరికి అనుమానం కలగకుండా లేయని అబద్ధం చెప్పాల్సింది. ఇప్పుడు ఇంకొన్ని నిజాలు చెప్పలేడు. అట్లాగని అంగకుండా అబద్ధంచెప్పే అవకాశంలేదు. ఏం చెప్పాలా అని ఆలోచించసాగాడు. మాటలకోసం తడుముకున్నట్లు కనిపించ కూడదని వేరుశనక్కాయలవాడిని పిలిచి పావలా కాయలు యిమ్మన్నాడు అర్ధ రూపాయి కాసు యిచ్చి.

"ఉన్నాయా?" రాజేశ్వరి అడిగింది ఇంకోసారి

ఇప్పటినుంచి జాగ్రత్తగా వుండాలిఅని మనసులో అనుకుని "వు" అని రాజేశ్వరితో అని "చిల్లర రెండుగా యివ్వు"అని శనక్కాయలవాడితో అన్నాడు

వాడు తన దగ్గరవున్న ఒకే ఒక పావలా కాసు ప్రభాకర్‌కి యిచ్చాడు.

"అంతేకాదు. ఆ అమ్మాయి ముట్టు కొన్న వస్తువు ఒక్కటికూడా నా దగ్గరలేదు తెలుసా?" అన్నాడు ప్రభాకర్ పావలా జేబులో వేసుకుంటూ పాపం అతనికి తెలియదు తను అబద్ధం చెబుతున్నానని.

"సరే! అయితే. అనుకోకుండా నువ్వు ప్రేమించిన అమ్మాయి కనబడితే నువ్వసలు మాట్లాడించకే! నువ్వు ఆ అమ్మాయితో మాట్లాడితే - అది 'బెం ఎంత?' అని అడగటానికైనాసరే - నాకు చాలా కోపం వస్తుంది"

తల వూపాడు ప్రభాకర్.

"ఈ సారి నిన్ను తప్పకుండా డైరెక్టర్‌ని చేయాలని డాడీ అనుకుంటున్నారు" అంది రాజేశ్వరి. నువ్వు పిచ్చివేషాలు వేస్తే నీ పేరు ఆ లిస్ట్‌లో వుండదు సరికదా ఆబిట్యూరి కాలంలో వుంటుంది అని బెదిరిస్తున్నట్లు.

ఆ బెదిరింపు వల్లనే "నువ్వెవరినన్నా

## జీవన గణితం

ప్రేమించి గెలిచినవాడు [illegible] గెలిచిన గమ్యం
రెండూ [illegible]టం అనుభవమే.

ధనం, అధికారం, కీర్తి
మూడు భుజాలు
వాటి ముక్కోణం
నీ కందని ఆకారం

జీవన మొక దీర్ఘ చతురస్రం
సుఖాల పొడవు తక్కువ
కష్టాల వెడల్పెక్కువ
'సత్యం' సరళరేఖ
మీద నుంచున్న
నీ జీవిత సౌఖ్యానికి
వ్యత్యాసం తొంభై డిగ్రీలు

డేర్ ఫోర్
లైఫ్ ఒక విష(మ) వృత్తం.

— రాధామనోహరన్


ప్రేమించావా?" అని అడుగుదామను కున్నవాడు కూడా అడగలేకపోయాడు.

## 2

"మీరు యింతకు ముందు ఎవరినన్నా ప్రేమించారా" అని జయ [illegible] [illegible] భాస్కర్. [illegible] జరిగిన వారం రోజుల వరకూ చెప్పుకోదగ్గ సంఘటన జరగలేదు. ప్రభాకర్ ఆ వారం రోజులు బొంబాయిలో వుండటం. భాస్కర్ చేస్తున్న వుద్యోగం ఏడో రోజున పోవటం అందుకు కారణం. భాస్కర్ చేస్తుండే వుద్యోగం వూడటానికి కారణం బహుశా భాస్కర్‌కి తప్ప యెవరికీ తెలియదు

అతి కష్టంమీద బి. ఏ పూర్తిచేసిన భాస్కర్ ఎమ్.ఏ.లో సీట్ రాదని ప్రూవ్ చేసి అక్కయ్యపోరు పడలేక వుద్యోగాల వేటలో పడ్డాడు. మొదటి వుద్యోగం ఒక చిన్న ప్రైవేట్ కంపెనీలో ఒక చిన్న వుద్యోగం ఏ మాత్రం వైవిధ్యంలేని ఆ వుద్యోగంమీద ద్వేషం రోజు రోజుకీ అమీబాలాగా ద్విధా శతవిధా విచ్ఛిత్తి కాసాగింది ఇంతకన్నా "హంస" హోటల్లో తను చేసిన వుద్యోగం నయిరెట్లు హాయికదా అనుకున్నాడు.

అసలు భాస్కర్‌కి మామూలు వుద్యోగాలు అంటే ఇష్టం లేదు ఎందుకంటే ఎంతయినా అవి అయిదారేడెనిమిదివందల ఉద్యోగాలే కదా అదే సినిమాలో అయితే. అక్కయ్య నుంచి ఏ మాత్రం ప్రోత్సాహం లభించినా ఎంతోకొంత ఆ రంగంలో రాణించేవాడు కాని, ఆమె సినిమాల్ని పిచ్చివేషాలు వెయ్యొద్దు అని ఖండితంగా చెప్పటంతో అతనికి ఏదో ఒక వుద్యోగంలో చేరక తప్పలేదు. కాని ఆ తరువాత అతి జాగ్రత్తగా ఉద్యోగం పోగొట్టుకోవటం, అందులో తన తప్పు కించిత్ కూడా లేనట్టు కనబరచటం, ఆ



తరువాత యింకో వుద్యోగం సంపాదించటం. అదీ పోగొట్టుకోవటం అతని వుద్యోగం అయిపోయింది. తనని మామూలు వుద్యోగాలు చేయమనటం శునకపు సింహాసనాన కనకాన్ని వుంచటం వంటిదే నని అక్కయ్యకు ఈ విధంగా నయినా తెలియపరచాలని అతని ప్రయత్నం.

అతను నాలుగయిదు వుద్యోగాలు పోగొట్టుకునేదాకా అక్కయ్యకి అతనిమీద కోపం- ఉద్యోగాల్లోంచి అంత తొందరగా తీసివేయబడుతున్నందుకు రానేలేదు దానికి ఒక కారణం వుంది. అది తన ఉద్యోగం పోవటానికి అతను చెప్పే కారణం. అసలు భాస్కర్ కలం పట్టకపోవటంవల్ల తెలుగు దేశం ఒక రచయితని పోగొట్టుకుంది. ఉదాహరణకి.... అతను అయిదో ఉద్యోగం పోగొట్టుకున్న రోజున అతను హుషారుగా అక్కయ్య దగ్గరకు వెళ్ళి "అక్కయ్యా! నువ్వు చాలారోజుల నుంచి చెబుతున్నా ఏమో అనుకున్నాను గాని సిగరెట్ తాగటం మంచి అలవాటు కాదు సుమా!" అన్నాడు.

భాస్కర్ నాల్గునెలలనించీ అదే ఉద్యోగంలో వుండిపోయేటప్పటికే ఎంతో ఆశ్చర్యపోతున్న అక్కయ్య, ఈ భావ ప్రకటనతో నివ్వెరపోవాలో, విస్తుపోవాలో తెలియనిదానిలా వుండిపోయింది. కాని గత నాలుగు అనుభవాలు గుర్తుకు రావటంతో "ఏరా! ఉద్యోగంకాని పోయిందా?" అని అడిగింది.

భాస్కర్ ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా అన్నాడు: "ఇవాళ మా ఛీఫ్ అకౌంటెంట్ వాళ్ళ యింటికి పిలిచాడు— వాళ్ళ అమ్మాయి యింటర్ చదువుతున్నాదుట. ఇంగ్లీష్ ట్యూషన్ చెప్పమని. సరే వాడిని మంచి చేసుకోవటం యెందుకయినా మంచిదని సరే అన్నాను. ఇంటికి వెళ్ళగానే కాఫీ తెప్పించాడు. తరువాత సిగరెట్ ఆఫర్ చేశాడు. వద్దంటే తెగ బలవంతం పెట్టాడు. సరే తీసుకున్నాను. ఓ నిముషం సిగరెట్ తాగుతూ మాట్లాడుతున్నాం. ఆ తరువాత వాళ్ళ అమ్మాయిని పిలుస్తానని లోపలికి వెళ్ళాడు. ఇంతలో వాళ్ళ అమ్మాయి కూడా నాలుగేళ్ళుంటాయి, బొద్దుగా ముద్దుగావుంది. వచ్చింది. దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకున్నాను.

## క్రీనీడ

లేని వాడిని
ఆడించటం
ఉన్నవాడికి
క్రీడ.
అదే ప్రగతిని
కప్పేస్తున్న
నీడ!

— దామరాజు వీరభద్రరావు

అంతే ఆ అమ్మాయి చెప్పున అరిచి బ్రహ్మాండంగా ఏడవటం ప్రారంభించింది. దాంతో మా గురుడువచ్చి పరిస్థితి అవగతం చేసుకుని "నీ ఉద్యోగం ఊడింది. రేపు ఆఫీసుకు వచ్చి జీతం తీసుకుని పో! అన్నాడు."

ముద్దు పెట్టుకుంటేనే పాప ఏడ్చిందా? ఆ పాప ఏడ్చినందుకే వుద్యోగం తీసేశారా? అన్న ప్రశ్నలకు అర్జంట్ గా సమాధానాలు ఆశించటం మానవసహజం. కాని, మళ్ళీ వుద్యోగం పోయిందా, ఇట్లా అయితే యెట్లా యెట్లా ఎట్రా అంటూ చివాట్లువేసి పై ప్రశ్నలకు సమాధానాలు వెంటనే పొందలేకపోవటం జిజ్ఞాస వున్నవాడు చేసేపని కాదుకదా! అక్కయ్యకి కూడా జిజ్ఞాస వుండటంతో భాస్కర్ రెండు ప్రశ్నలకు కలిపి "ఆ పాపను ముద్దుపెట్టుకున్నప్పుడు నా నోట్లో వెలుగుతున్న సిగరెట్ వుందన్న సంగతి మరిచిపోయాను" అన్న సమాధానం యిచ్చాడు.

కాని అటువంటివాడు కూడా దాదాపుగా ఎనిమిది నెలల నుంచి ఒకే వుద్యోగంలో వుండిపోయాడు. (అంతక్రితం పదకొండు నెలలలోనే అతను అయిదు వుద్యోగాలు పోగొట్టుకున్నాడు) అతనిలోని ఈ 'స్థిరత్వాని'కీ, జయ వాళ్ళ కుటుంబం సరిగ్గా ఎనిమిది నెలల క్రితమే భాస్కర్ వాళ్ళ పక్కింట్లోకి అద్దెకు రావటానికీ ఏమన్నా సంబంధం వుందా అంటే కాదనలేం!

క్రితం అధ్యాయంలో వివరించిన సంఘటన జరిగిన వారం రోజులకు భాస్కర్ ఆరో ఉద్యోగం ఊడిపోయింది. తనలోని ఆర్టిస్టుని కొంత వరకూ తృప్తి పరచగలిగే ఉద్యోగం దాదాపుగా రావటంతో భాస్కర్ ఆ ఎనిమిది నెలల బంధాన్ని వదుల్చుకున్నాడు.

ఆ రోజు సాయంకాలం....

తన ఉద్యోగం పోయింది అన్న విషయం కొత్త ఉద్యోగంలో చేరాక చెప్పాలా లేక అప్పుడే చెప్పాలా అన్న విషయం భాస్కర్ యింకా నిశ్చయించుకోక ముందే అతను యింటిని సమీపించటంతో ఆ ఆలోచనని వాయిదా వేసుకున్నాడు.

తలుపు తట్టాడు.

సుబ్బారావు తలుపు తీశాడు. తీస్తూనే "మీ అక్కయ్య ఎమర్జెన్సీ ప్రకటించిందోయ్" అన్నాడు.


"ఎందుకూ?" బావగారిని అడిగాడు భాస్కర్.


"వచ్చింది వాడేనా? వెంటనే యిక్కడకు రమ్మనమనండి. గుసగుసలలో సమాచారాన్ని అందించే ప్రయత్నం చేయకండి" అరిచింది, యిందిర వంటింట్లో నుంచి.

"చెప్పాగా! అదిగో ప్రెస్ సెన్సారింగ్!" అన్నాడు సుబ్బారావు.

విషయం ఏమిటి అన్నట్లుగా చూశాడు భాస్కర్. పర్వాలేదని భుజం తట్టి చెప్పాడు సుబ్బారావు. దాంతో ధైర్యం పుంజుకుని వంటింట్లోకి వెళ్ళాడు భాస్కర్.

ఇందిర, జయ కలిసి చపాతీలు వత్తుతున్నారు.





"ఏమిటి అక్కయ్యా?". "హలో!" అన్నాడు వరుసగా యిందిరని జయని వుద్దేశిస్తూ.

"ఏరా మళ్ళీ యీ...." అంటున్న ఇందిర,

"నాకు రేపు యింట...." అన్న జయ ఒకరికొకరు అడ్డు వస్తున్నారని ఒకేసారి ఆగిపోయారు.

భాస్కర్ ఇందిర పక్కన కూర్చొని "అక్కయ్యా! ముందు ఛాన్సు నీదే! అడుగు." అన్నాడు.

"ఈ ఉద్యోగం కూడా పోయిందిట కదా?"

భాస్కర్ వుద్యోగం పోయినందుకు మొదటిసారిగా బాధపడ్డాడు. ఇందిర గొంతులో వినబడ్డ చిరాకు, కోపం, నిస్స హాయతల వల్ల కాదు. ఆ మాట వినగానే జయ కళ్ళల్లో కనబడ్డ ఆందోళనవల్ల.

అయినా సర్దుకున్నాడు "ధ్వని వెలుతురు కంటే తక్కువ వేగంతో ప్రయాణం చేస్తుందనటం అబద్ధం అనిపిస్తున్నది, ఈ వార్త నిన్ను చేరిన వేగం చూస్తుంటే. ఏదీ సాయంకాలం నాలుగున్నరకే కదా నా ఉద్యోగ్యం పోయింది- అప్పుడే నీకెటా తెలిసింది?"

"ఎటా పోయింది?"

భారంగా నిట్టూర్చాడు భాస్కర్. గత అయిదుసార్లు ఈ వార్త తనే బ్రేక్ చేశాడు. పైగా ఏం చెప్పాలో ముందుగానే నిర్ణయించుకున్నాడు. ఇప్పుడు జయ ఎదురుగా వుంది. అంతటి విషమ స్థితిలో కూడా భాస్కర్ అటూ యిటూ కాలేదు. చపాతి పిండి తీసుకుని నముల్తూ చెప్పసాగాడు.

"నేను ఈ ఉద్యోగంలో చేరగానే మాఆఫీస్‌లోకె భాస్కర్, వి. భాస్కర్, ఎల్. భాస్కర్ అని ముగ్గురు భాస్కర్లు ఆల్రెడీ వున్నారని, నేను ఎన్. భాస్కర్‌ని నాలుగోవాడిని అని తెలిసినప్పుడు ఓహో అనుకున్నాను. మా మేనేజింగ్ డైరెక్టర్ పెళ్ళాం పెర్రిమాసన్ నవలలు తెగ చదువుతుంది అని తెలిసినప్పుడు కూడా ఓహో అనుకున్నాను. మా ఆఫీస్‌లో నల్గురం భాస్కర్లు వుండి మా మే-డై పెళ్ళాం పెర్రిమాసన్ నవలలు చదవకపోయినా, ఆవిడ అవి చదువుతూ మా ఆఫీస్‌లో ఒకే ఒక భాస్కర్ వున్నా నా ఉద్యోగం పోయి వుండేది కాదన్న విషయం యిప్పుడు తెలిశాక, ఒక్కొక్కప్పుడు ఎంతెంత చిన్న విషయాలు కలిసి పెద్ద వాటికి దారి తీస్తాయో కదా అని అనుకుంటున్నాను"

"అవునా! కరక్టుగా చెప్పావు. నువ్వీ విషయం చెప్పేటప్పుడు నేను చపాతీలు ఒత్తటం జరగటం వల్లనే కదా నీకు ఈ దెబ్బ తగలటం" అంది యిందిర అప్పడాల కర్రతో భాస్కర్‌ని గట్టిగా నే కొడుతూ

"నెత్తిమీద కొట్టి గాంధేయుడనైన నన్ను చాలా యిరకాటంలో పెట్టావు. చెంప మీద కొడితే ఇంకో చెంప చూపగలను గాని తలమీద కొడితే ఏంచేయాలి?"

అతికష్టం మీద వస్తున్న నవ్వు ఆపుకుంది యిందిర. జయ కష్టపడ దల్చుకోలేదు. "అసలు సంగతి చెప్పకుండా ఏమిటేసోది?" అంది యిందిర.

"సరే. నల్గురు భాస్కరం వున్నాం కదా! ఈ రోజున....అటా కాదు. మొన్న మా మేనేజింగ్ డైరెక్టర్ మద్రాస్ వెళ్ళాడు. ఈ రోజు తను వచ్చేటప్పటికి ఓ ఫైలు—కాన్ఫిడెన్షియల్ మాటర్స్‌కు సంబంధించిన దన్న మాట—అప్‌టుడేట్ చేసి యింటికి తీసుకురమ్మన్నాడు. అది చాలా ముఖ్యమైన ఫైల్ అవడంతో దాన్ని ఆయన యింటికి చేర్చే బాధ్యత నాకు ఒప్పచెప్పాడు. సరే నా కర్తవ్యం నేను నెరవేర్చాను.

"వాడొచ్చి ఫైలుచూసుకుని ఎందుకనో 'ఎవరు తెచ్చారీ ఫైల్' అని అడిగాడుట పెళ్ళాం 'భాస్కర్' అని చెప్పిందిట "మా ఆఫీస్‌లోకి కళ్ళు మూసుకుని రెండు రాళ్ళు విసిర్తే ఎంతలేదన్నా ఒక్క రాయి అన్నా ఏదో ఒక భాస్కర్‌కి తగుల్తుంది. అంత మంది భాస్కర్లు వున్నారు. ఏ భాస్కర్లో వర్ణించు" అన్నాడుట. ఆ పెళ్ళాం తెలుగు రచయిత్రుల రచనలు చదువు చదివితే "ఆరడుగుల ఎత్తు, స్ఫురద్రూపి గంభీరతను సూచించే విశాలమైన నుదురు, కొంటెగా వున్న కావ్యశీస్సను చాటే నల్లటి కళ్ళు, ఎత్తైన భావాలని తెలియ చెప్పే ముక్కు, విజ్ఞానవంతుడనటానికి నిదర్శనంగా వున్న మీసకట్టు" అంటూ జవాబు యిచ్చేది. వెంటనే మా మేనేజింగ్ డైరెక్టర్ 'ఓహో! ఎన్. భాస్కరా!' అనుకునేవాడు. కాని ఆవిడ పెర్రిమాసన్ నవలలు చదవటంతో "అయిదడుగుల ఏడున్నర అంగుళాల ఎత్తు, మీడియం బిల్టు, వీటిష్ కాంప్లెక్షన్, నల్లటి జుట్టు" అని చెప్పసాగింది. వాడికి ఆ క్లూలు సరిపోలేదు ఈ లోగా ఆవిడ 'ఆగండి' అని కళ్ళు మూసుకుని "ఆ! మీ బరువు నూట పాతిక కదూ! అతను నూట ముప్పై పౌన్లు వుంటాడు" అందిట. అంతే! అసలే అనుమానస్తుడైన మే-డై వెంటనే ఫోన్ చేసి నన్ను ఫైర్ చేయమన్నాడుట. అదీ కథ!"

ఇందిర చపాతీలు ఒత్తటం ఆపుచేసింది. ఒక నిముషంసేపు భాస్కర్‌ని చూస్తూ వుండిపోయింది. తరువాత అసలేం జరగనట్టు, తను ఏం విననట్టు, తన పని చేసుకో సాగింది.

"ఏమిటోయ్! మీ తమ్ముడి ఉద్యోగం పోయినందుకు సంతాపం ప్రకటిస్తున్నావా?" అంటూ సుబ్బారావు వచ్చి భాస్కర్ పక్కన కూర్చున్నాడు. తరువాత భాస్కర్ వంక తిరిగి "ఈసారి ఉద్యోగం ఎట్లా పోయింది? మీ ఆఫీసర్ నోట్లో సిగరెట్ లేకపోయినా వుందనుకుని అగ్గిపుల్ల వెలిగించి ఆయన పెదాలు కాల్చేవావా?" అన్నాడు.

"ఇన్నాళ్ళూ వీడిగురించి నేను అనవసరంగా బాధపడ్డాను. ఏడాదిన్నరలో ఆరు ఉద్యోగాలు పోగొట్టుకున్నా కించిత్ కూడా బాధలేకపోగా, పెర్రిమాసన్ నవలలూ గోంగూరా అని చెబుతున్నాడు బి. ఏ. అయిపోగానే నాటకాల్లోకో సినిమాల్లోకో

వెడతానన్నపుడే వదిలేయాల్సింది." అంది యిందిర.

"ఇప్పటి కయినా నీకు జ్ఞానోదయం అయింది. ఈ వంటిల్లు కట్టకముందు ఇక్కడ బోధిచెట్టు వుందేమో మన యింటాయనని అడగాలి" అన్నాడు భాస్కర్.

"ఇన్ని ఉద్యోగాలు పోగొట్టుకున్నందుకు సిగ్గుగా లేదూ?" అంది యిందిర.

"లేదు! అన్ని ఉద్యోగాలు సునాయాసంగా సంపాదించినందుకు గర్వంగా వుంది." అన్నాడు భాస్కర్. "ఆగు! అప్పడాల కర్ర ఎత్తకు....అసలు సంగతి చెప్పనీ! మా ఫ్రెంచ్ కజిన్ తెలుసు. అతని స్నేహితుడితో కలిసి అడ్వరయిజ్‌మెంట్ షార్ట్స్ కమ్మర్షియల్ అడ్వర్టయిజ్‌మెంట్స్ ప్రొడ్యూస్ చేసే కంపెనీ నడుపుతున్నారు. అన్ని విషయాలు మాట్లాడుకున్నాం. రేపు ఫార్మల్‌గా ఇంటర్వ్యూ వుంటుంది. తరువాత కాంట్రాక్ట్...."

"నిజమేనా? నమ్మమంటావా?"

"తప్పకుండా! రేపొద్దున 'రాంబా! నీ చపాతీలు యింత మృదువుగానూ, మెత్తగానూ ఎలా వున్నాయి?'- 'యిందిర మార్కు చపాతీల కర్ర మా అమ్మమ్మది, అమ్మది. ఇప్పుడు నేనూ వాడుతున్నాం. ఇదే మా కుటుంబరహస్యం!' అని రేడియోలో వినిపిస్తే అందులోని కంఠం నాదేనని కళ్లు. యిష్టం అయితే చెవులు మూసుకుని పందెం కాయవచ్చు" అన్నాడు భాస్కర్.

"పోన్లే! ఈ ఉద్యోగంలో నన్నా కుదురుగా వుండు. ఇంతకీ జీతం ఎంత?" అడిగింది యిందిర.

ఇందిర అడిగిన ప్రశ్నకు జవాబు యివ్వకుండా జయ వంక తిరిగాడు "ఇందాక మీరేదో చెప్పబోయి ఆపేశారు ఏమిటండీ అది?"

"రేపు నాకు యింటర్వ్యూ వుందండి- ఇంటర్నేషనల్ హెవీ యింజనీరింగ్ కంపెనీలో-పర్సనల్ మేనేజర్‌కి పి.ఏ. పోస్ట్ అన్నమాట." అంది జయ.

*　　　*　　　*

ఆ మర్నాడు....

హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలలోని నిరాశా నిస్పృహలు అంతా ఇంటర్నేషనల్ హెవీ యింజనీరింగ్ కంపెనీ పర్సనల్ మేనేజర్ కాబిన్‌లో వున్న రోజు అది.

జంట నగరాలలోని చిరాకు అంతా అదే కాబిన్‌లో వున్న రోజు అది.

నిరాశ నిస్పృహలు, చిరాకు ఒకదాని తరువాత ఒకటి పర్సనల్ మేనేజర్ ప్రభాకర్‌లో ప్రవేశిస్తున్నాయి.

"నువ్వు యిదివరకు ఎవరినన్నా ప్రేమించావా?" అన్న వాక్యాన్ని పెద్ద పెద్ద అక్షరాలతో రాసి, దాని వంకే చూస్తూ వుండిపోయాడు కొంచెం సేపు. తర్వాత చిరాకుతో ఆ కాయితాన్ని చింపి చెత్త బుట్టలో పారేశాడు. ఆ కార్యక్రమం చాలా సేపటి నుండి జరుగుతున్నదని చెత్త బుట్టలో సగం వున్న కాయితం వుండలు, చాలా చిరాకుతో ఆ కార్యక్రమం నిర్వహించబడుతున్నదని చెత్త బుట్టలో పడకుండా నేలమీద పడివున్న కాయితం వుండలు చెబుతున్నాయి.

ఆ ప్రశ్న నారం రోజుల పాతదే అయినా ఎప్పటికప్పుడు కొత్తగా చురకలు వేస్తున్నది. రాజేశ్వరి ఆ ప్రశ్న అడిగినప్పుడు 'లేదు' అని చెప్పి వుంటే ఎంత బాగుండేది, అన్న ఆలోచన వచ్చినప్పుడల్లా ప్రభాకర్ తనని తాను తిట్టుకుంటున్నాడు.

ప్రభాకర్ స్టేట్స్‌లో మేనేజ్‌మెంట్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చదివి వచ్చేముందు తనకు మంచి ఉద్యోగం వస్తుందని అనుకున్నాడు గాని, నాలుగేళ్ళలోనే తను యింతటి హోదాలోకి వచ్చేయగలనని ఎంతమాత్రం వూహించలేదు. అతను ఆ కంపెనీలో చేరేటప్పటికి, ఆ కంపెనీ టెక్నికల్ డైరెక్టర్‌గా వున్న రాజేశ్వరి నాన్నకి అతను ఎంతగానో నచ్చాడు. — ఎంతయినా ప్రభాకర్ ఎలిజిబుల్ బాచిలర్! రాజేశ్వరిని చూశాక ప్రభాకర్ తను అంత అదృష్టవంతుడా అని ఆశ్చర్యపోయాడు- రాజేశ్వరి అందం, ఆమె తన వెంట తీసుకువచ్చే ఆస్తి, ఆమె మూలంగా ప్రొఫెషనల్‌గా తనకు కలిగే లాభం, యివన్నీ కలిసి అతన్ని ఆశ్చర్యపడేట్లు చేశాయి. రాజేశ్వరికి అసూయ, అనుమానం, అపార్థం తొందరగా చేసుకునే అలవాటు వున్నాయి. మొదట్లో రాజేశ్వరి కనపరిచే అనుమానం గట్రా అతనికి ఎంజాయబుల్‌గానే వుండేవి. కాని ఈ మధ్యనే వాటిని అతను భరించలేకపోతున్నాడు. దాంతో యిద్దరికీ శృతిమించని పోట్లాటలు జరుగుతున్నాయి— అవి శృతిమించకపోవటానికి ప్రభాకర్‌లోని సర్దుకుపోయే గుణం చాలా వరకు కారణం.

తృప్తి తీరా తిట్టుకున్నాక టైం చూసుకున్నాడు-పది గంటలు. ఇక ఈ విషయం గురించి ఆలోచించటం ఆపుచేయాలి అనుకున్నాడు. అపాయింట్‌మెంట్స్ చూసుకున్నాడు. పదిన్నరకి యింటర్వ్యూలు. రెండు గంటలకి మంత్రి మీటింగ్.

పాడ్‌లో చివరగా వున్న కాయితాన్ని చింపి వుండ చుట్టి చెత్త బుట్టలో వేయబోయి, చెల్లాచెదరుగా పడివున్న కాయితం వుండలని చూసి ఆగిపోయాడు బెల్ నొక్కబోయాడు. ఈలోగా తలుపు తెరుచుకుని ప్యూన్ వచ్చాడు.

"గుడ్ మార్నింగ్ సార్!" అన్నాడు. అని జిమ్మీ కార్టర్‌లా నవ్వాడు టెంపరరీ వర్కర్‌గా వున్నప్పుడు నికిటా కృశ్చెవ్‌లాగా నవ్వేవాడు. పర్మనెంట్ అయిపోయాక స్టైలు మార్చాడు.

ఆ నవ్వు అంటే గిట్టని ప్రభాకర్ యింకా చిరాకుతో "తలుపుకొట్టి రమ్మనమని చెప్పలేదు?" అన్నాడు.

వాడు యిదరు జిమ్మీకార్టర్‌ల నవ్వు నవ్వేసి, హౌసెకీపింగ్ మొదలుపెట్టాడు. టేబుల్ గ్లాస్‌టాప్ తుడిచాడు. కాలెండర్‌లో క్రితం రోజు తేదీ చింపాడు. బుట్ట చుట్టూవున్న కాయితం వుండలు బుట్టలో పారేశాడు అంతా అయిపోయాక ప్రభాకర్ వంక చూశాడు.

"కాఫీ తీసుకురా," అన్నాడు ప్రభాకర్ తల వంచుకునే.

వాడు వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

వెళ్ళిపోతున్న అమ్మాయి వంక చూసి నిట్టూర్చాడు ప్రభాకర్. ఇంకా నలుగురు

---

## కొన ఊపిరి

రూపాయి బిళ్ళ
తిరిగి తిరిగి చవితి చంద్రుడైంది.
అంకెల్తో గారడీ చేస్తారు
గాడిద కొడుకులు!

సంచి పటుకొని బయల్దేరిన
ఇలాలి కళ్ళల్లో
కొండలు
ధరల కొండలు!!

జీతాలు పెరగ్గానే
రూపాయి తరుగుతుంది.
ఎలక్షన్లు రాగానే
రూపాయి చస్తుంది.

రాసే కవిత్వంలో
"ఆత్మ" చస్తుంది
ఎముకలు మిగుల్తాయి.

—ఎస్. గోపి

వున్నారు ఈ నలుగురూ కాక....

"మే ఐ కమిన్ సర్!"

తల ఎత్తి తలుపు వంక చూసి తల వూపాడు. లిస్ట్ చూశాడు. పేరు లలిత. బి. ఏ. టైప్ షార్ట్‌హాండ్....

"కూర్చోండి!" అన్నాడు.

ఆ అమ్మాయి వినయంగా కూర్చుంది.

"మొదటి యింటర్వ్యూనా?"

"అవును"

"టెస్ట్సు ఎల్లా చేశారు?"

"బాగానే చేశాను."

"సెలక్ట్ అవుతారన్న నమ్మకం వుందా?"

లలిత జవాబు కోసం తడబడింది. ఆ అమ్మాయిని ఈజ్ చేద్దామని "సినిమాలు చూస్తుంటారా?" అని అడిగాడు.

తల వూపింది.

"ఏం చూశారు ఈ మధ్య?"

"ప్రేమించి చూడు!"

ప్రభాకర్ అప్రయత్నంగా చెత్తబుట్ట వంక చూశాడు. ప్రశ్నకోసం తడబడటం అతని వంతు అయింది. ఏం అడగాలో తోచక "యిక మీరు వెళ్ళవచ్చు!" అన్నాడు.

ఆ అమ్మాయి మెల్లగా లేచింది. ఇంటర్వ్యూ అంటే యిదేనా అన్నట్లు ప్రభాకర్ వంక చూసింది.

"థాంక్యూ ఫర్ హావింగ్ కమ్" అన్నాడు

ఆ అమ్మాయి ఏదో గొణిగింది.

"చూడండి! ఇప్పుడు....మిస్ జయని ....మిస్ జయని....మిస్ జయాని.... రమ్మనమని చెప్పండి" అన్నాడు గుటకలు మింగుతూ. క్రిటికల్ కండిషన్‌లో వున్న పేషెంట్, తనని హాస్పిటల్‌కి తీసుకువెడుతున్న ఆంబులెన్స్ ప్రమాదానికి గురి అయితే అచ్చు ప్రభాకర్ లాగానే వుంటాడు. పొద్దుటి నుండి తన మనసును కలచివేసున్న ఇంటర్వ్యూ అప్పుడైనా మరిచిపోదాం అనుకుంటే ఈ లలిత వచ్చి 'ప్రేమించి చూడు' అంది. ఇప్పుడు లిస్ట్‌లో తరువాతి పేరు జయ—తను ప్రేమించిన జయ పేరూ జయే!

లలితకు ఆ వుద్యోగం రాదు అన్న విషయం తెలిసిపోయినట్టుంది. "ముగ్గుర్నీ పంపించమంటారా?" అడిగింది.

"ముగుర్నా?"

"అవును. మిస్ జయ్, మిస్ జయ, మిస్ జయాలని."

".... మిస్ జయని" సాధ్యమైనంత గంభీరంగా అన్నాడు ప్రభాకర్. వచ్చేది తన జయ.... ఛ! తన జయ ఏమిటి?.... తను ప్రేమించిన జయ కాకూడదు" అనుకున్నాడు— రివాల్వింగ్ ఛైర్‌లో నూట ఎనభై డిగ్రీలు తిరుగుతూ.

తలుపు తెరుచుకున్న శబ్దం వినిపించింది. "మే ఐ కమిన్ సర్?" అని వినిపించిన గొంతు జయ గొంతులా అనిపించకపోయేటప్పటికి ప్రభాకర్‌లో కొంత ధైర్యం వచ్చింది. 'అయినా జయఅంటూ ఇంకా ఎవరూ వుండరా.

"కూర్చోండి!" అంటూ అటు తిరిగాడు.

రాజేశ్వరి! ప్రభాకర్ తనపి. ఏ. కోసం ఆశవాళ్ళని యింటర్వ్యూ చేస్తున్నట్లు తెలియదు. తెలిసి వుంటే ప్రభాకర్‌కి తెలియకుండా అతని కాబిన్‌లో టేప్ రికార్డర్ అమర్చి వుండేది అప్పుడూ టేప్ రికార్డర్- ప్రభాకర్ కూర్చోండి అని అన్నాక-రెండు నిముషాల నిశ్శబ్దాన్ని రికార్డ్ చేసి వుండేది. అంతేకాదు. ఆ తర్వాత ఈ క్రింది గందరగోళపు వాక్యాన్ని కూడా రికార్డ్ చేసి వుండేది

"నుగావ్వాప్ ప్రజభాయ కనుర్‌న్వా నానుకొవ్వుపు ద్యోలా గంవుయిద్యోచ్చే గందికోను నవ్వం నచేవ్వా వాతో అవా ఆననంలు దంవిగా నుప్పుం యిఁంచిది."

## ఊహ

ఒక్కొక్కసారి మనం ఊహా మహారణ్యంలోకి
పట్టుబట్టి ప్రశ్నల బాణాలు బట్టి
జవాబులనే జంతువులను వేటాడబోతే
అంతు తెలీని ఆ అడవిలో అలాగే చిక్కుకు పోతాం

మన ఊహాధర్మం విడి మనదు నిద్రలో వినా
మాటల చెట్లే మొలవని మౌనపు మైదానంలో
ఆలోచనా సొరంగాలు నా లోచనాలు మూసి
వెన్నెలలా నిశ్శబ్దపు వెల్లువలా నిర్మలత
విరియాలని నిశ్చయించి విశ్రాంతిగ కూర్చున్నా-

తామరతంపరగా తాళవృంతంలా
కుప్పలు తిప్పలుగా ఉప్పతిల్లే ఊహలు
భారత కథోపాఖ్యాల్లా- బావా మరదలి సరసాల్లా
అరటి మొలకల్లా కంద పిలకలా
ఉల్కల్లా, యౌవని శరీరాన పుల్కల్లా, కాల్‌గల్ కులుకుల్లా
ప్రత్యూహకు— అపోహల్లా వెనవేల ఉపోహాలు
ఐడియాల రోడ్లు కలిసే ఆబిడ్ సెంటర్ మనస్సు
కొల్లలుగా బస్సులు తిరిగే కోటీ మన ప్రతి ఊహా!

ప్రతిరాజు చరిత్రా చరిత్రలో ప్రఖ్యాతిని పొందనట్లు
ప్రతి పాంథుడు బాటకొక ప్రత్యేకత నివ్వనట్లు
ప్రతి ఊహా మనసుకుగల ప్రాశస్త్యం చూపదు - ఐతే
1. * పల్లి ఒకటుంటే పదింటిని పండించ వచ్చే మోగాని
2. * గల్లీలు పదుంటేతప్ప కన్‌స్ట్రక్షన్ కాదొక రోడ్డు

ఎదహోమాగ్ని కుండంలో ఎగదొయ్యి వెయ్యి ఊహాసమిధల్ని
పదిలంగా పేల్చి విజ్ఞానహవిస్సు వదలంగా చీల్చి అజ్ఞాన తమస్సు.

* 1. వేరుశనగగాయ * 2. గొంది

—మాముసూరు నరసింహారావు

# ఉద్యోగ విజయం

తనకి ఎంతో బాగా తెలిసిన ప్రభాకర్‌ని పర్సనల్ మేనేజర్‌గా చూసిన ఆనందంతో జయ "నువ్వా ప్రభాకర్! నాకు వుద్యోగం యిచ్చేది నువ్వంటే నాకు ఎంతో ఆనందంగా వుంది" అనటం, తను ఏ జయ కాకూడదు అనుకున్నాడో ఆ జయే రావటంతో షాక్ తిన్న ప్రభాకర్ ఆత్రుతతో "గాడ్! జయా! నువ్వా నువ్వు యిట్లా వుద్యోగం కోసం వచ్చావా? అసలు ఏమయింది?" అనటం, ఎవరి ఆదుర్దాలో వారు యింకొకరు ఏం మాట్లాడుతున్నారో గమనించక పోవటంతో ఆ రెండు వాక్యాలూ కలసి పెద్ద గందరగోళపు వాక్యంగా తయారయింది.

"ప్రభాకర్! నాకు ఈ ఉద్యోగం ఎంతో అవసరం!" అంది జయ కూర్చుంటూ.

"ఏమయింది జయా? దాదాపు ఏడు సంవత్సరాలయ్యింది మనం ఒకరిని ఒకరు చూసుకుని. ఏమయింది?" అన్నాడు ప్రభాకర్. అతను రాజేశ్వరిని పూర్తిగా మరిచిపోయాడు ఆ క్షణాన.

"నువ్వు అహమదాబాద్‌లో చదువుతున్నప్పుడే నాన్నగారికి వ్యాపారంలో కాస్త నష్టం వచ్చింది. ఆ తర్వాత నువ్వు స్టేట్స్‌కి వెళ్ళిన కొత్తల్లో కాబోలు ఆ నష్టం బాగా పెద్దదై, వ్యాపారాన్ని నాన్నగారి ఆరోగ్యాన్ని మింగేసింది. ఆ బాధతోనే నాన్నగారు పోయారు. ఆ తర్వాత అన్నకి హైదరబాద్‌లో వుద్యోగం రావటంతో అంతా యిక్కడికి వచ్చేశాం. ఒక్కడి జీతం మీద కుటుంబం నడవాలి. ఆర్థిక పరిస్థితులు అంత బాగుండలేదు. నేనూ సంపాదించటం మొదలుపెడితే కొంత నిలదొక్కుకోగలం."

"జయా! ఇట్స్ వెరీ ట్రాజిక్! నాన్నగారు పోయారన్న విషయం నాకు తెలియదు. అన్నయ్య ఎట్లా వున్నాడు? ఎక్కడ వుద్యోగం చేస్తున్నాడు? నీకు ఈ ఉద్యోగం తప్పకుండా యిచ్చి...."

టెలిఫోన్ మోగింది. ప్రభాకర్ మధ్యలో ఆపి ఫోన్ తీశాడు.

"హలో! ప్రభాకర్ హియర్!"

"ప్రభా! నేను రాజేశ్వరిని. ఆ రోజు రాత్రి కొంత రూడ్‌గా ప్రవర్తించి నిన్ను నొప్పించాను కదూ? అందుకనేనా టౌంటే నుంచి వచ్చిన వెంటనే నన్ను కలవనిది?"

ప్రభాకర్‌కి తన పరిస్థితి గుర్తుకు వచ్చింది. జయకి తను పర్సనల్ అసిస్టెంట్ ఉద్యోగం యిచ్చానని రాజేశ్వరికి తెలిస్తే ఏమీ అనుకోకపోవచ్చు- ఈ జయకి ఒక కన్ను మెల వుండి, మొహం మీద స్ఫోటకం మచ్చలు వుండి, ఒక కాలు కుంటి అయితే! ఇంత అందమైన జయకు తను ఉద్యోగం యిస్తే తనకూ, రాజేశ్వరికి మధ్య కొంత ఫ్రిక్షన్ రావచ్చు. ఈ జయే తను ప్రేమించి, ప్రేమించబడి వుత్తరాలు రాసి-రాయించుకున్న అమ్మాయి అని రాజేశ్వరికి తెలిస్తే ఒక పెద్ద విస్ఫోటకం పుట్టటం గ్యారంటీ. కాని ఇంతకు మునుపే జయకు ఆశ కల్పించి.......

"ఏం ప్రభా! మాట్లాడటం లేదు? కోపం వచ్చిందా?"

"లేదు లేదు! ఇంటర్వ్యూ చేస్తున్నాను- నా పి. ఏ. పోస్ట్‌కి అన్నమాట. ఆ హడావిడిలో...."

"అందరూ ఆడవాళ్ళేనా ఎవరన్నా మగవాళ్ళు వున్నారా?"

ఊహించిన ప్రశ్నే అయినా ప్రభాకర్ తత్తరపడ్డాడు. సమాధానం తెలిసినా "ఆగు లిస్ట్ చూసి చెబుతాను. ఎందుకంటే అప్లికేషన్స్ స్క్రీన్ చేసింది నేను కాదు." అన్నాడు. ఆ తరువాత లిస్ట్ చూడటానికి ఆగినట్లు ఒక నిముషం ఆగి "లేదు అసలు అడ్వర్టైజ్‌మెంట్‌లోనే అది స్పెసిఫై చేసినట్లున్నారు—అంతా ఆడవాళ్ళే!" అన్నాడు.

రాజేశ్వరి భారంగా వూపిరి వదిలింది. అది అంత మంచి సమయం కాదనుకుంది కాబోలు "నిన్ను డిస్టర్బ్ చేస్తున్నట్లున్నాను. ఇక వుంటాను. అన్నట్లు లిబర్టీలో మూవీకి బుక్ చేశాను. సాయంకాలం మా యింటికి రా. కలిసి పోదాం!" అంది.

"ఓకే!" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"జయా! నీకు ఏ విధ...." ప్రభాకర్ మాట పూర్తి కాలేదు. కార్టర్ తలుపు తీసుకుని వచ్చాడు. ట్రేడ్‌మార్క్ నవ్వు నవ్వి "మీ పర్సనల్ మెయిల్ సార్!" అంటూ మూడు వుత్తరాలు టేబుల్ మీద వుంచాడు.


"ఎన్నిసార్లు తలుపుకొట్టి రమ్మనమని చెప్పాను నీకు?" చిరాగ్గా అన్నాడు ప్రభాకర్

మళ్ళీ నవ్వబోయి ఆగిపోయాడు తల గోక్కుని "ఎన్నిసార్లో గుర్తులేదు సార్!" అన్నాడు.

"ఏడుసార్లు. ఇప్పటికయినా గుర్తుంచుకో!" అన్నాడు ప్రభాకర్ పళ్ళు బిగబెట్టి. ఇంకో ఆరు నెలలలో రిటైరయిపోతాడు వాడు. దాదాపు నలభై ఏళ్ళు అదే కంపెనీలో పని చేయటంతో సొంత కంపెనీ అన్నట్లు ప్రవర్తిస్తాడు. దానికి తోడు ముసలితనం వల్ల వచ్చే చాదస్తం వల్ల ఎంత కోపం తెప్పించినా వాడి అమాయకత్వం చూసి గట్టిగా తిట్టలేకపోతున్నాడు ప్రభాకర్.

కార్టర్ తల వూపాడు. వెళ్ళబోతుంటే "రెండు కాఫీ పట్రా" అన్నాడు ప్రభాకర్. తల వూపి వెళ్ళిపోయాడు.

"చూడు జయా! నీకు ఈ ఉద్యోగం వచ్చినట్లే అనుకో. కాని కొన్ని కారణాల వల్ల- ఆ కారణాలు ఏమిటో నన్ను అడగకు. అవి చెప్పటం నాకు యిష్టం లేదు- కొన్ని కారణాల వల్ల మన యిద్దరికీ పరిచయం వున్నట్లు ఎవరికీ తెలియకూడదు. అందరి దృష్టిలో నేను నిన్ను, నువ్వు నన్ను మొదట చూడటం ఇదుగో యిప్పుడే జరిగింది. అర్థమయిందా?"



తల వూపింది జయ.

"నాకా ఫెలోషిప్ రాకుండా వుంటే. నేను స్టేట్స్‌కి వెళ్ళకుండా వుండి వుంటే నేను నీతోపాటు నీ కష్టాలు పంచుకోవడానికి,సుఖాలు పంచి యివ్వడానికి సిద్ధంగా వుండేవాడిని— ఎంతో హాయిగా! కాని యిప్పుడు,నీకే కాదు చాలా మందికి అందనంత ఎతులో వున్నాను— సరిగ్గా గాలి అందక ఉక్కిరి బిక్కిరి అవుతూ" ఈ మాటలు ప్రభాకర్ బయటకి అనలేదు— తనలో తాను అనుకున్నాడు.

ఏదుసార్లు తలుపు చప్పుడయింది.



తరువాత తలుపు తీసుకుని కార్దర్ వచ్చాడు ట్రేలో- ట్రేలో కాఫీ పాట్‌తో. కాఫీ రెండు కప్పుల్లో పోసి యిచ్చి వెళ్ళి పోయాడు.

తమ పరిచయాన్ని రహస్యంగా వుంచమనటంలో వున్న రహస్యం ఏమిటా అన్న ఆలోచన జయ రాజేశ్వరితో పోట్లాటకు యిది దారి తీయదు కదా అన్న అనుమానంతో ప్రభాకర్,కాఫీ తాగటం పూర్తి చేశాడు.

"జయా! ఇక నువ్వు వెడితే బాగుంటుంది. ఇప్పటికే చాలా సేపయింది." అన్నాడు ప్రభాకర్. "అన్నట్లు ఒక రెండు నెలలు నేను యిక్కడ వున్నట్లు మీ అన్నయ్యకి కూడా చెప్పకు—ఆశ్చర్యపోకు, నేను, మీ అన్నయ్యా గాఢ మిత్రులమే! కాని.... నేను సరిగ్గా నీకు అసలు విషయం చెప్పలేను....నీకు ఈ ఉద్యోగం నా మూలంగా వచ్చిందని యింకెవ్వరికీ. నేను నీ బాసనని మీ అన్నయ్యకు కొంత కాలం తెలియకూడదు. సరేనా?"

జయ తలవూపి "థాంక్యూ వెరీమచ్ ప్రభా!" అంది.

"చూడండి మిస్ జయా! మిస్ జయంతిని రమ్మనమని చెబుతారా?" అన్నాడు ప్రభాకర్ జయకుర్చీలోంచి లేవటంచూసి.

* * *

సరిగ్గా అదే సమయానికి భాస్కర్ ఏదో ఉద్యోగం సంపాదించుకున్నాడు. చాలా లాంఛనప్రాయంగా అతని యింటర్వ్యూ జరుగుతున్నప్పుడు టూరిస్ట్ కార్పొరేషన్ వారు ఆ అడ్వర్టైజింగ్ సర్వీసెస్ వారిని కలిశారు— హైదరాబాద్ నుంచి

తిరుపతికి నాన్‌స్టాప్ లగ్జరీ సర్వీస్ ప్రవేశ పెడుతున్న సందర్భంలో ఆ విషయమై రేడియో అడ్వర్టైజింగ్ కోసమని. అదివరకే వారు ఇంగ్లీష్‌లో కాయిన్ చేసి పత్రికలలో ప్రచారం చేసేసిన స్లోగన్‌నే తెలుగులోకి అనువదిస్తే చాలు అన్నారు. శ్రోతగా వింటున్న భాస్కర్ "హైదరాబాద్ నుండితిరుపతి....'అంటే హైదరాబాద్ .... కర్నూలు.... ఎట్‌సెట్రా.... ఎట్‌సెట్రా.... తిరుపతి కాదు– 'హైదరాబాద్ నుండి తిరుపతి' అంటే హైదరాబాద్ .... తిరుపతి. అంతే! అందుకే...." అన్నది ఎట్లా వుంటుంది అని అడిగాడు అది అతనికి ఉద్యోగం యివ్వబోతున్న వారికే కాక టూరిస్ట్ కార్పొరేషన్ వారికి కూడా ఎంతగా నచ్చిందంటే అదే యింగ్లీషులో కూడా కావాలన్నారు. దాంతో భాస్కర్‌కి ఆ ఉద్యోగం అనుకున్నదానికంటే వంద రూపాయల ఎక్కువ జీతంతో దొరికింది. కొన్ని షార్ట్స్‌కి స్క్రిప్ట్ రాయటం. కొన్నింటిలో కనబడటం. ఆకాశవాణిలో ప్రచారం చేయటానికి స్క్రిప్ట్స్ తయారు చేయడం, చదవడం అతని ఉద్యోగం. ఇన్నాళ్లకయినా తనకు ఎంతో కొంత నచ్చిన ఉద్యోగం దొరికినందుకు ఉబ్బొంగిపోయాడు భాస్కర్.

ఆ ఆనందంతోటే ఆ సాయం కాలం జయతో కలిసి సెలబ్రేట్ చేసుకున్నాడు పార్టీ అయిపోయాక యిద్దరూ టాంక్ బండ్ వేపు నడిచారు. దాదాపు వారం రోజుల క్రితం యిద్దరూ కూర్చున్న స్థలం లోనే కూర్చున్నారు.

కొంతసేపు యిద్దరూ మౌనంగా వుండి పోయారు.

"మీరు అదివరకు ఎవరినన్నా ప్రేమించారా? అని మొన్న అడిగాను గుర్తుందా?" ఉన్నట్టుండి అడిగింది జయ

"గుర్తుంది" అన్నాడు భాస్కర్.

"మరి మీరు నన్ను అదే ప్రశ్న ఎందుకు అడగలేదు." నవ్వుతూ అడిగింది జయ.

"అడుగుదామనుకున్నాను కాని....సరే! యిప్పుడు అడుగుతున్నాను. మీరు యిది వరకు ఎవరినన్నా ప్రేమించారా?"

"చెబుతాను గాని మీరు ఆశ్చర్యపోకూడదు ఆశ్చర్యపోతే మీరు మిమిక్రీ చేసి నన్ను ఎంటర్‌టైన్ చేయాలి" అంది జయ. "అంతేకాదు. ఈ విషయం చాలా రహస్యంగా వుంచాలి. ముఖ్యంగా మా అన్నయ్యకు గాని, మా యింటో గాని ఈ విషయం అసలు తెలియనివ్వకూడదు."

"సరే"

"నేను అదివరకు ప్రభాకర్ అని ఒకతన్ని ప్రేమించాను ఆ రోజుల్లో నేను

## భూతలమేం కుంటిది!

ఆకాశంలాంటి ఆశయాలు
స్థాపిద్దా మనుకునే మనిషిని
స మా జ ం
ఛాందసాల గోతుల్లో పాతేస్తుంటే
'ఆశయాలు ఆకాశంలాంటివే కావి
అనవరతం భూతలమే కుంటిది'
అ ను కొం టూ
మేఘాల రాపిడిలోంచి
సమాజ సముద్రంలోకి
రాలిందో చినుకు!

—పెమ్మరాజు గోపాలకృష్ణ

యింటర్ చదువుకున్నాను అతను అన్నయ్య ఫ్రెండ్. మా వూళ్ళో మా పక్కింట్లో వున్న తను ఎస్.ఎస్.గ్రాడ్యుయేషన్‌కని కంటికి దూరం అయినప్పుడు నాకు మొదటిసారి అనిపించింది— అతన్ని ప్రేమించానా అని సరే ఆ రోజుల్లో ఆ వయసులో అలా అనిపించింది. వెంటనే అతనికి వుత్తరం రాశాను. వుత్తరం అంటే వుత్తరం కాదు. ప్రేమలేఖ అన్నమాట. ఆశ్చర్యం! అతనూ అలాగే ఫీల్ అయినట్లున్నాడు. అతనూ వుత్తరం రాశాడు అలా యిద్దరం వుత్తరం రాసుకున్నాం ఉన్నట్లుండి అతను యింతె అంతై యింకెంతో అయి అయిదేళ్ళ తరువాత ఇంటర్నేషనల్ హెవీ యింజనీరింగ్ కంపెనిలో పర్సనల్ మేనేజరు – నెలకు నాలుగు వేల జీతం ప్లస్ పెర్క్స్‌తో పని చేస్తున్నాడు పొదున యింటర్వ్యూలలో వుద్యోగం యిస్తారా. యివ్వరా అని నిలదీశాను అంతే! యిచ్చేసాను అన్నాడు రెండు మూడు రోజుల్లో ఆర్డర్స్ రావాలి. మనిషి మందువించి చాలా మంచివాడు! స్టేట్స్ నుంచి వచ్చినా కూడా. అంత మంచి వుద్యోగంలో వున్నా మనిషేం మారలేదు–ఇంకా స్మార్ట్‌గా తయారవటం తప్ప మనిషిని చూస్తే."

ఆ మర్నాడు భాస్కర్‌కి ఎవరన్నా కాగితం, పెన్ను యిచ్చి "జయ ప్రభాకర్‌ని పొగిడిన విసంబెట్టిని పది వాక్యములలో వ్రాయుము' అన్న ప్రశ్న యిస్తే. అతను నిస్పందేహంగా ఆ పరీక్షలో తప్పేవాడు. అతని మెదడు పని చెయ్యటం మానేసింది తన హృదయం పనయితే జయ దగ్గర వుంచనుకున్నాడో విదివాపస్‌వచ్చి–బాధతో మూల్గుతున్నట్లు అనిపించింది. నాలుగు వేల జీతం కాక యితర పెర్క్స్ కూడా వున్న వాడి పి ఏ గా పనిచేస్తా. అతనితో అదివరకే ప్రేమలేఖల పరిచయం వున్న అమ్మాయి "సుఖమయ మరియు సౌఖ్యపు క్షవరమునకు ప్రసిద్ధి చెందిన మిశ్రపు అంచుగల అజంతా బ్లేడ్ నే వాడండి" అని అరిచే వాడిని ప్రేమిస్తుందని అనుకోవటం. ఆ బ్లేడ్ నిజంగానే సుఖమయ మరియు సౌఖ్యపు క్షవరం యిస్తుందనుకోవటం లాంటిదే అనుకున్నాడు భాస్కర్. 'జయకి తన మీద ప్రేమ వుందా, లేదా?'

* * *

'ఎందుకంత నాకోసం ఫిలర్ కాపీ శ్రమ తీసుకుని ఇప్పుడు తయారు చేశావు?'

బుర్ర గోక్కున్నాడు భాస్కర్ రెండో సారి చదివితే గాని అర్థం కాలేదు. ఇంగ్లీష్ నుండి అనువాదం అంత ఛండాలంగా వుంటేగాని అది తెలుగు అడ్వర్టైజ్‌మెంట్ అవదు కాబోలు అనుకుని పేజీ తిప్పాడు.

'తొక్క ఒలిచిన ఆనందం'

జుట్టు పీక్కున్నాడు ఈసారి. ఆ బిస్కట్ తింటే (అన్‌పీల్ ది డిలైట్ కి బహుశా అది అనువాదం) ఆనందం వస్తుందో రాదో తెలియదుగాని అది రాసిన వాడి తోలు వలిస్తే తప్పక ఆనందం వస్తుందనిపించింది.

విసుగ్గా పత్రిక టేబుల్‌పై పడేసి లేచాడు భాస్కర్—ఏం చెయ్యాలో తెలీక.

వారం రోజుల క్రితం జయ 'ప్రభాకరాష్టకం' చదివిన దగ్గర్నుండి భాస్కర్ మతి మతిలో లేదు. జయమాటలు ప్రవర్తన చూస్తుంటే తనని ప్రేమిస్తున్నదేమో అనిపిస్తున్నది కాని అదంతా భ్రమ అయి వుండాలి ఏం అర్థంకాక ఏ పనీ చేయబుద్ధికాక పత్రిక తిప్పితే యిటువంటి కాపీరైటింగ్ జోక్స్ కనబడి అసలే వేడెక్కిన బుర్రని యింకా వేడెక్కించాయి.

'ఏం చెయాలి యిప్పుడు?' –ఓ నిముషం ఆటూ యిటూ పచార్లు చేశాడు. 'బావగారి సలహా అడిగితే? బాగుంటుంది. అసలు మొన్ననే అడగాల్సింది.'

జేబులో అర్ధరూపాయి బిళ్ళ వుందని దృఢపర్చుకుని పబ్లిక్ కాల్ ఆఫీస్‌కి వెళ్ళాడు.

ఒక రెండు నిముషాల తరువాత అటు పక్కనుంచి సుబ్బారావు పలికాడు

"హలో బావగారా? నేను భాస్కర్‌ని.

బిజీగా వున్నారా!"

"లేదు! ఏమిటి విశేషం ఫోన్ చేశావు?"

"ఓ పెద్ద సమస్య వచ్చి పడిందండి!"

"సమస్యా? నీకా!"

"నాకు కాదనుకోండి. మా ఫ్రెండ్ దగ్గరికి వాడి ఫ్రెండ్ వచ్చి తన దగ్గరకు తన ఫ్రెండ్ వచ్చి వాడి ఫ్రెండ్‌కి పెద్ద సమస్య వచ్చిందని అన్నాడుట. ఆ లైనులో చివరి ఫ్రెండ్ వున్నాడు చూశారా వాడి దగ్గరకు వాడి స్నేహితుడి దోస్త్‌కు వున్న సమస్య వచ్చి చెరింగన్న మాట. అటా ఒరిజినల్‌గా దోస్త్‌కు వున్న సమస్య స్నేహితుడి ద్వారా ఆ ఫ్రెండ్‌ల నిచ్చెన ఎక్కి అంచెల వారీగా నన్ను చేరింది– తీర్చేవారు లేకపోగా, నాకూ దాని పరిష్కారం తెలియక మీ...." డైరెక్ట్‌గా చెప్పటానికి మరీ ఎక్కువగా మొహమాటపడ్డాడు భాస్కర్.

"ఆగు! మీ ఫ్రెండ్ టుది పరగ్రాఫ్ సిక్స్. ఫైవ్ మొదలయిన వారంతా వారి వారి ఫ్రెండ్స్‌నో స్నేహితులనో ఆ సమస్యా పరిష్కారం గురించి అడిగారు కదా! మరి నువ్వు కూడా ఎవరినన్నా నీ ఫ్రెండ్‌ను అడగక ఈ బావగారిని అడుగుతున్నావేమిటి?"

నేనూ మా ఫ్రెండ్స్‌ని ఎవరినన్నా అడిగేవాడినే నండి. కాని నాకు వున్న ఫ్రెండ్స్ అంతా—యిందాక చెప్పాను చూశారా....ఫ్రెండ్ ఫ్రెండ్....అలా— ఆ లిస్ట్‌లో వుండిపోయారు. దాంతో యిబ్బందిలో పడిపోయి ఏం చెయ్యాలో తెలియక...."

సుబ్బారావు నవ్వాడు. "చూస్తుంటే ఇదేదో నీ ప్రేమ వ్యవహారం లాగా వుంది. నువ్వు ప్రస్తావించిన విధం చూస్తుంటే నీ హృదయ రాణి లేక హృదయ చోరిణి జయ అనిపిస్తున్నది. అవునా?"

భాస్కర్‌కి ఒప్పుకోక తప్పలేదు. తన పూర్వ ప్రేమకథతో మొదలుపెట్టి జయ పూర్వ ప్రేమకథతో కలుపుకుని లేటెస్ట్ డెవలప్‌మెంట్స్‌తో సహా అంతా చెప్పాడు—చాలా క్లుప్తంగా.

"నా బాధ అది కాదు! నాతో మాటాడే టప్పుడు ఇంకో నిముషంలో నాతో డ్యూయట్ పాడేస్తుందేమో అనిపిస్తుంది కాని మొన్న ప్రభాకర్‌ని పొగిడిన విధం చూస్తుంటే కొన్ని సినిమాల్లో నవలలో అంత వరకూ డ్యూయెట్ పాడిన హీరోయిన్ "అవును రఘూ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను-కాని ఒక చెల్లిగా మాత్రమే!" అని ప్లేట్ మార్చినట్టు మారుస్తుందేమో అన్న భయం పుట్టింది. అంతే కాదండి ప్రభాకర్ తనకి రాసిన ప్రేమలేఖలు చూపించింది- ఎంత బాగా రాశాడను కున్నారు: ఎంత పదిలంగా దాచుకుందను కున్నారు!"

"అయితే కొంచెం కాంప్లికేటెడ్ కేస్ అంటావు" అన్నాడు సుబ్బారావు. "మిమ్మల్ని చాలా రోజులుగా గమనిస్తున్నాను. నా గెస్ ఏమిటంటే-నీ సంగతి తెలియదు గాని జయ నిన్ను ప్రేమిస్తుందనే కాని ఈ ప్రభాకర్ ఫాక్టర్ మూలంగా కొంత మార్పు వచ్చి వుండవచ్చు అందు కనే...." కొంత సేపు ఆలోచించాక మళ్ళీ అన్నాడు. "ధైర్యే సాహసే జయం. అన్నారు అందుకని నువ్వే అడుగు"

"నేనా? కష్టం బావగారు! ఇన్నాళ్ళూ నా హృదయం జయ దగ్గర వుంచను కున్నాను. అది ఈ మధ్యనే రెఫ్యూజ్డ్ అన్న స్టాంప్ వేసుకు వెనక్కి వచ్చినట్లుంది. ఇప్పుడు జయ 'లేదు నిన్ను ప్రేమించటం లేదు' అని అంటుందేమో- అంటే నా హృదయం పగిలిపోతుందేమో అన్న భయంతో వున్నాను. గాజు పగిలినా ఫర్వాలేదు– స్వస్తిక్ మార్క్ అథెసివ్‌తో అతికించుకోవచ్చు గాజు కొయ్య, లెదరు, ప్లాస్టిక్ మున్నగునవి అంటించుటకు దివ్యమైనది స్వస్తిక్ మార్క్ అథెసివ్. పాతిక గ్రాములూ ఆరు రూపాయలు. పన్నులు అదనం – కాని హృదయం పగిలితే!" అన్నాడు భాస్కర్. పైగా ఇదే మొదటిసారి కదా! కొంచెం భయంగా వుంది"

"అయితే మీ అక్కయ్య చేత అడిగించు."

"భలేవారండి! ఫ్యూన్ ఉద్యోగానికి యింటర్వ్యూ రానివాడిని ఆఫీసర్ పోస్ట్‌కి అప్లై చేయమన్నట్లు వుంది. అక్కయ్యతో అసలు ఈ విషయం మాట్లాడగలనా?"

"అక్కడే నీ ప్రజ్ఞ చూపించాలి!" సుబ్బారావు వివరించాడు.

"చాలా బావుందండి మీ అయిడియా! మరి ఈ రోజే...."

"'దేవదాసుకు లేచిందే తాగుడు' అన్నట్టు అంత తొందర పనికిరాదు. జయని ఒక రెండ్రోజులు జాగత్తగా అబ్జర్వ్ చెయ్యి తరువాత ప్రైచెయ్యచ్చు. అన్నట్టు జయ ఆర్డర్స్ వచ్చాయా?"

"వచ్చాయండి! బహుశా రేపు జాయిన్ అవుతుందనుకుంటాను."

"అయితే ఎల్లుండి ముహూర్తం!"

"థాంక్స్ బావగారు! చాలా మంచి అయిడియా యిచ్చారు. వుంటాను" ఫోన్ పెట్టేశాడు భాస్కర్.

* * *

గడియారం పన్నెండు కొట్టింది.

టైప్ చెయ్యటం ఆపు చేసింది జయ. వేళ్ళు విరుచుకుని కుర్చీలో వెనక్కివాలింది. ఇంటర్నేషనల్ హెవీ యింజనీరింగ్ కంపెనీలో ఆ క్రితం రోజు చేరింది.


ఫోన్ మ్రోగింది జయ ఫోన్ ఎత్తింది. "గుడ్ మార్నింగ్ దిసీజ్...."

"ఎవరూ? జయేనా?" ఇందిర గొంతు వినిపించింది అటునించి.

"అవునండి! ఏమిటీ ఇలా ఫోన్ చేశారు?" అంది జయ ఆశ్చర్యంగా.

"ఏమీ లేదు, నీతో రెండు రోజులుగా ఒక విషయం ప్రస్తావిద్దామనుకుంటున్నాను....అన్నట్లు మనం యిట్లా మాట్లాడుకోవటం .... ఏం ఫర్వాలేదు కదా? ఎవరూ మన సంభాషణ వినరు కదా?"

"ఎవరూ లేరు యిక్కడ. మనం నిరభ్యంతరంగా మాట్లాడుకోవచ్చు." జయ ఆశ్చర్యం యింకా పెరిగింది- తనతో



## దీపావళి హాస్యనవల

యిందిర అంత రహస్యంగా మాట్లాడే విషయం ఏమిటో!

"చూడు జయా! నువ్వు మరోలా అనుకోకు. మొన్న మా తమ్ముడు చెప్పాడు. వాడు నిన్ను ఎంతో గాఢంగా, తీవ్రంగా ప్రేమిస్తున్నాడట. కాని నీతో ఈ విషయం సూటిగా చెప్పటానికి ధైర్యంలేకో, సిగ్గుపడిపోయో చెప్పలేకపోతున్నాడట. వాడిని ఆ స్థితిలో చూసి సరేలే నేను కనుక్కుంటానని...."

జయ చేతిలోంచి రిసీవర్ అప్రయత్నంగా చెవికి దూరంగా జారిపోయింది. రిసీవర్లోంచి యింకా అస్పష్టంగా మాటలు వినిపిస్తున్నాయిగాని, జయ యిప్పుడు వున్న స్థితిలో లౌడ్ స్పీకర్లోంచి మాట్లాడినా ఆమెకి అర్థం కాదు. భాస్కర్ కొంత మొహమాటస్తుడు అని తనకు తెలుసు గాని యింత పిరికివాడు అని తను అనుకోలేదు. తను ప్రేమించిన అమ్మాయిని "నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మరి నువ్వో?" అని అడగలేకపోతే పోన్లే, పాపం అని క్షమించవచ్చు గాని ప్రియురాలికి అక్కతో రాయబారం పంపుతున్న భాస్కర్‌ను చూసి జాలిపడాలా, సిగ్గుపడాలా?"

ఆ మధ్యాహ్నం అంతా అదే ఆలోచనతో గడిపింది జయ.

ఒక గంట క్రితం ఆమె చెవులబడ్డ విషయం ఆమెలో ఎంత కల్లోలం రేపిందో యీ కొద్ది సేపట్లో ఆమె కంటో పడేది ప్రభాకర్‌లో అంత కంటే ఎక్కువగా కల్లోలం లేవుతుందని ఆమెకు తెలియదు.

లెటర్ డిక్టేట్ చేయటానికి జయను పిలిచాడు. ప్రభాకర్, చెబుతూ చెబుతూ "జస్ట్ వన్ మినిట్ పాత ఫైల్ చూసి కంటిన్యూ చేస్తాను" అంటూ కుర్చీ వెనక్కి తోసుకుని ఫైల్స్ రాక్ నుండి ఒక పాత ఫైల్ తీశాడు. అది నిజంగానే పాతగా కనిపిస్తున్నది. బాగా దుమ్ము కొట్టుకు పోయి. టేబుల్ మీద దుమ్ము పోయేటట్లు కొట్టి ఫైల్‌లో తనకు కావల్సిన విషయం రిఫర్ చేసి చెప్పబోతూ హఠాత్తుగా తల ఎత్తి జయ వంక చూశాడు.

జయ ఏడుస్తున్నది. కళ్లు రెండూ ఎర్రగా వున్నాయి. కళ్ళ నుండి నీళ్ళు ధారగా కారుతున్నాయి.

"ఏమయింది జయా? ఎందుకు ఏడుస్తున్నావు?" ప్రభాకర్ తనకంగారులో తను "మిస్ జయా!" అని పిలవటం లేదన్న విషయం మరిచిపోయాడు.

"ఇది ఏడుపు కాదు ప్రభా!"

"ఓహో! అయితే నేను చెప్పనా? అవి ఆనందబాష్పాలు. అవునా?" అన్నాడు— రాజేశ్వరి బలవంతం మీద ఆంధ్రుల ఆరాధ్య రచయిత్రి రాసిన నవల ఆధారంగా తీసిన సినిమాని ఆ క్రితం రోజే చూసిన ప్రభాకర్. వెంటనే లాజిక్ గురుకు రాగా "ఇప్పుడు యింత ఆనంద పడాల్సిన అవసరం ఏమిటి?" అని అడిగాడు.

"ఆ ఫైలు నుండి ఎగిరి వచ్చిన దుమ్ము నా రెండు కళ్ళ నిండా పడ్డది."

"థౌజండ్ అపాలజీస్! ఒక నిముషం" అంటూ లేచి వెళ్ళి జయ కళ్ళల్లో పడ్డ దుమ్మును తీయడానికై వంగి ఆమె తలను తన చేతుల్లోకి తీసుకున్నాడు.


సెన్సారువాళ్ళు సినిమాలో ముద్దు చూపిస్తే తస్మాత్ జాగ్రత్త అని అంటున్న రోజుల్లో హీరో హీరోయిన్ ముద్దు పెట్టుకుంటున్నట్లు చూపించటానికి హీరోయిన్ జడలోని పూలకు క్లోజప్ యివ్వటం, హీరో తల పూలకు, జడకు అవతల వున్న హీరోయిన్ తల భాగానికి వెళ్ళి కనబడక పోవటం, ఆ తరువాత హీరోయిన్ పెదాలు తుడుచుకోవటం చూపించేవారు. అది ముద్దుకు సింబల్ అని యావరేజ్ సినిమా గోయర్‌కి అర్థం అయి పోయేటట్లు.


కార్టర్ యావరేజ్ సినిమా గోయర్. అతను అలవాటు ప్రకారం తలుపు తట్టకుండా లోపలికి వచ్చేటప్పటికి ప్రభాకర్ చేతిలోని జయ తల అతన్ని ఆకర్షించింది. ఆ తలకు అటు పక్క ప్రభాకర్ తల వుందని, ఆ రెండూ చాలా దగ్గర్లో వున్నాయని తెలుస్తూనే వుంది. దాంతో అతని లోని యావరేజ్ సినిమా గోయర్ తల ఎత్తాడు. ఆ వెంటనే అటెండర్ వ్యక్తిత్వం తల ఎత్తటంతో తలుపు తెరుచుకుని బయటికి వెళ్ళి తలుపుకొట్టి లోపలకువెళ్ళాడు.

కార్టర్ లోపలికి వెళ్ళేటప్పటికి ప్రభాకర్ జయకు అడుగు దూరంలో నిలబడి వున్నాడు. జయ చీర చెంగు మొహాన్ని చేరబోయింది— అది చూసి పెదాలుతుడుచుకుంటున్నది అని యావరేజ్ సినిమా గోయర్ అనుకున్నాడు. కాని ఆ చీర చెంగు కళ్ళను చేరుకుంది. అది అర్థంకాక పోయినా "వాష్ బేసిన్‌లో కడుక్కోండి. పర్వాలేదు" అని ప్రభాకర్ జయతో అనటం అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు కార్టర్.

జయలేచి పార్టిషన్ అవతలకివెళ్ళింది. వాష్ బేసిన్‌లో కళ్ళు కడుక్కుంటుంటే ప్రభాకర్ కార్టర్‌ని ఎక్కడికో వెళ్ళమన టం. వాడు వెడుతున్నానని చెప్పటం ఒక నిముషం తరువాత పెద్ద శబ్దంతో తలుపు తెరుచుకోవటం 'హాయ్! ప్రభా!' అనిఒక ఆడ గొంతు అనడం వినిపించాయి దానికి సమాధానంగా ప్రభాకర్ గొంతు నుండి ఒక విధమైన చప్పుడు— మెశ చుట్టూ ఉరి బిగుసుకుంటే వచ్చే చప్పుడు లాంటిది రావటం విని ఏమిటా అనుకుంటూ రుమాలుతో మొహం తుడుచుకుని జుట్టు సవరించుకుని జయ పార్టిషన్ యివతలకి వచ్చింది.

"రాత్రి మూవీ స్ప్లెండిడ్‌గా వుంది.






కదూ!" అంటున్నది రాజేశ్వరి మెరుస్తున్న కళ్ళతో.

ప్రభాకర్ మాట్లాడలేదు. తల వూపుతూ మాట్లాడబోయిన రాజేశ్వరి ఆగిపోయింది. మెరుస్తున్న కళ్ళు తీక్షణంగా మారి తన వెనకాల ఒక చోట దృష్టిని కేంద్రీకరించాయి అని గమనించిన ప్రభాకర్ జయ బయటకి వచ్చింది అని అర్థం చేసుకున్నాడు.

ఉచ్ఛ్వాసం రోగి తుమ్మినట్లు కొంచెం పెపు శబ్దం చేశాక ప్రభాకర్ గొంతు మామూలుగా పని చేయసాగింది.

"ఈవిడ నా పి. ఎ. మిస్ జయ." అన్నాడు. జయను రాజేశ్వరికి యింట్రడ్యూస్ చేస్తూ. జయ బ్యూటీ కాంపిటీషన్‌లో పార్టిసిపేట్ చేస్తున్నట్లు,తను జడ్జి అయినట్లు రాజేశ్వరి జయను చూడ సాగింది. రాజేశ్వరిని తనకు పరిచయం చేస్తాడేమో అని జయ చూడ సాగింది.

రెండు నిముషాలు గడిచాయి. ఈ రెండు నిముషాలలోనూ ప్రభాకర్ 'జమ్మత దున్న కయ' 'జదు కమ్మ యన్ను' 'కజ దుయ మ్మన్ను' అంటూ రెండు మూడు సార్లు అని, జయని అవలోకించటం తాత్కాలికంగా ఆపుచేసి రాజేశ్వరి తన వంక సాలోచనగా చూసేటప్పటికి 'దుమ్మ జయ కన్ను' అని విజయవంతంగా అన్నాడు. అని జయ వంక తిరిగి "మిస్ జయ! "ఐ షల్ కాల్ యు బాక్ అగైన్. ఓకే!" అన్నాడు. "అన్నట్టు ఆ అడ్వర్టైజ్‌మెంట్ అన్ని పేపర్లకి పంపారా?"

పెన్సిల్, బుక్ తీసుకుని రాబోతూ "పంపాను" అంది జయ. అని రాజేశ్వరి వంక ఒకసారి చూసి బయటకు వచ్చింది.

ముందుగా రాజేశ్వరి మాట్లాడింది. "నా కంట్లో దుమ్మ...."

"ఏమిటీ? నీ కంటో కూడా దుమ్మ పడిందా? టూ బాడ్. యిందాక ఆ పూర్ గర్ల్ జయ కంట్లో కూడా...."

"నా కంట్లో దుమ్మ కొట్టలేవు ప్రభాకర్! ఈ అమ్మాయి.... పేరేమిటి? ....జయ కదూ.... యిప్పుడు ఎందుకొ అక్కడ నుండి...."

"ప్లీజ్! రాజు! నిగ్నటి సినిమాలో లాగా అపార్థం చేసుకుంటున్నావు. అసలు జరిగినదేమిటంటే...." అంటూ అసలు విషయం చెప్పాడు- దుమ్మ ఫైల్ చూపించాడు. "అయినా ఆ అమ్మాయి నువ్వు అసూయపడేటంత ఏం బాగుంది?" అని కూడా అన్నాడు

"ప్రభా! నన్ను నువ్వు పిచ్చిది, అనుమానాలు ఎక్కువ అనుకుంటున్నావు కదూ? యిన్నాళ్ళూ నీకు అసలు విషయం చెప్పలేదు. నేను అప్పటికి నెలల పిల్లనిట. డాడీ తన పి. ఏ. వలలో పడిపోయారట. అసలు యింటికి వచ్చేవారే కాదుట. దాన్ని రెండో పెళ్ళి చేసుకోవటానికి కూడా సిద్ధపడ్డారుట. దాదాపు సంవత్సరం అమ్మ ఈ నరకాన్ని అనుభవించింది. ఆ తరువాత అప్పటికే ఆరోగ్యం చెడిపోవడంతో చనిపోయింది. దాంతో డాడీ తన పి.ఏ ని వదిలి తాగుడు అలవాటు చేసుకున్నారు. మా అమ్మ నా ఊహలో ఎలా కనిపిస్తుందో తెలుసా? నెలల పిల్లగా ఉన్న నన్ను ఒళ్ళో వేసుకుని ఏడుస్తూ డాడీ కోసం ఎదురు చూస్తున్నట్టు...." ఉన్నట్టుండి రాజేశ్వరి ఏడవసాగింది.

"నా సంగతి నీకు తెలుసుగా! అనవసరంగా ఏవేవో ఊహించుకోకు. రికవర్ బేబీ! రికవర్!" అంటూ ప్రభాకర్ రాజేశ్వరి కన్నీళ్ళు తుడవ సాగాడు.

ప్రభాకర్ లాంటి ఎగ్జిక్యూటివ్‌ల రూంలో వుండే కుర్చీలు సింహాసనాల్లాగా వుండి అందులో కూర్చున్నవారి తల తప్ప ఇంకా ఏం కనిపించదు- వెనక నుండి చూసేవారికి. అటువంటి కుర్చీలు కూర్చునేవారికి మిక్కిలి సౌకర్యంగా వుంటాయని మాత్రమే ప్రభాకర్ అనుకున్నాడు కాని వాటి వలన గొడవలు వస్తాయని అతను వూహించలేదు.

ప్రభాకర్ పురమాయించిన పని పూర్తి చేసుకు వచ్చిన కార్టర్ తలుపు తీసేటప్పటికి యిందాకటి లాగానే పూల తల, తల అవతల కనబడని ప్రభాకర్ తల కనబడేటప్పటికి మళ్ళీ యిందాకటిసీన్ కంటిన్యూ అవుతోందనుకుని యజమాని మీద ప్రేమతో, "క్షమించాలి! రాజేశ్వరిగారు వచ్చారు" అన్నాడు-రాజేశ్వరి,ప్రభాకర్‌ల ప్రేమ, రాజేశ్వరి తత్త్వం తెలిసి వుండటంతో. అంత చనువు తీసుకునే సాన్నిహిత్యం లేకపోయినా ముసలితనం వల్ల వచ్చే అదో రకమైన చొరవతో ఆ మాట అన్నాడు.

రాజేశ్వరి ప్రభాకర్‌లు ఒక్కసారిగా అతని వంక తిరిగారు. అతను అన్నదానికి అర్థం వారికి అర్థంకాలేదు. తలుపు కొట్టి ఎందుకు రాలేదు అన్న కోపం బదులు, ఏం మాట్లాడుతున్నావు ? అన్న చిరాకుతో కూడిన సందేహం ప్రభాకర్ మొహంలో చోటు చేసుకుంది.

కార్టర్‌కు తన తప్పు తెలిసింది. తను పొరపాటు ఎందుకుపడ్డాడో వివరించాల్సిన ఆవశ్యకత కూడా తెల్సింది. "క్షమించాలి! జయగారు అనుకున్నాను" అన్నాడు అని తలుపు తీసుకుని వెళ్ళిపోయాడు.

## 3

పరీక్ష అంత బాగా రాయనివాడు. అంతగా నమ్మకం లేని వాడి చేత పైరవీ చేయించుకున్నాక పరీక్షా ఫలితాల కోసం ఎదురు చూసినటు జయ రాక కోసం ఎదురు చూడసాగాడు భాస్కర్. పరీక్షా ఫలితాలు వచ్చే సమయానికి తల్లిదండ్రులు లేకపోతే వుండే సంతోషం లాంటిది. ఇందిరా, సుబ్బారావులు మ్యాట్నీకి వెళ్ళటంతో అంత నెర్వస్‌నెస్‌లోనూ కంటి తడుపులా కనబడసాగింది. 'మధ్యాహ్నం ఇండైరెక్ట్‌గా తన విషయం జయకు తెలిసింది. కాని జయ జవాబు తనకు తెలియ లేదు. జయ వెంటనే జవాబు యివ్వక పోవటం మౌనం అనంగీకారం అవటం మూలంగానేనా?'

పచార్లు చేస్తూనే టైం చూసుకున్నాడు— అయిదున్నర. ఈ పాటికి జయ వస్తూ వుండాలి అని అనుకున్నాడు.

రెండు నిముషాల తరువాత మలుపు

తిరిగి వస్తూ కనబడింది జయ ఇంట్లోకి వెళ్ళిపోదామనుకుని ఎందుకనో వరండా లోనే వుండిపోయాడు. జయ మామూలుగా తన యింటికి వెళ్ళబోతూ భాస్కర్‌ని చూసి గేట్ దగ్గరే నిలబడి "ఎవరన్నా వున్నారా?" అని అడిగింది.

"లేదు. సినిమాకి వెళ్ళారు. నేను ఒక్కడ్నే వున్నాను. లోపలికి రండి" అన్నాడు భాస్కర్.

జయ వరండాలోకి వచ్చింది. "లోపల కూర్చుందాం" అన్నాడు భాస్కర్ లోపలికి వెళ్ళబోతూ.

"మర్యాదలు తర్వాత సార్! మీతో ఒక విషయం-చాలా ముఖ్యమైన విషయం అత్యవసరంగా మాట్లాడాలి. మధ్యాహ్నం ఇందిర గారు నాకు ఫోన్ చేశారు...."

"అలాగా!" అన్నాడు భాస్కర్. తన గుండెలో చెలరేగుతున్న అలజడి మొహంలో కనబడకుండా జాగ్రత్త పడలేక తల తిప్పుకున్నాడు.

"ఫోన్ చేసి నాతో ఒక విషయం—ఏ విషయమో తెలుసా?— మాట్లాడారు. మీరు నన్ను ప్రేమిస్తున్నారట— ఎంతో ఎంతో ఘాటుగాట. అది నాతో ఎలా చెప్పాలా అని మీరు బాధపడుతుంటే ఆవిడ నేను రాయబారం చేస్తాను అని నాకు ఫోన్ చేసి నువ్వు మావాడిని ప్రేమిస్తున్నావా అని అడిగారు. తలచుకుంటేనే నాకు కొంత జుగుప్స...."

"అయితే మీరు ఏమిటంటారు?"

"ఇది చాలా ఘోరం అంటాను. నాకు తెలుగులో సమానార్థకాలు ఎక్కువగా తెలియవుగాని, తెలిసుంటే ఎంత లేదన్నా ఓ పదన్నా వాడి వుండేదాన్ని అంటాను. మీరు నన్ను ప్రేమిస్తున్నారు. కాదనను. తప్పు పట్టను. నాతో ఆ విషయం చెప్పలేక పోయారు- ఇదీ కాదనను- కొంతవరకు తప్పు పట్టుతాను. పిరికితనమనీ అదో రకమైన ఇది అనీ అర్థం చేసుకుంటాను. కాని యిదేమిటి? మీ అక్కగారితో సందేశం పంపటం? ఇంకో మార్గం లేదా? నా మనసంతా విరిచేసింది. ఈ ఒక్క సంఘటన మీమీద...." తన మాటల్లో వినిపిస్తున్న తీవ్రతకి తనకే ఆశ్చర్యం వేసింది జయకు అంత కోపంగా మాట్లాడాలనుకోలేదు తను. కాని....

మెల్లిగా జయ వంక తిరిగాడు.

జయ మాటల మధ్య ఆగిపోయింది అతని వంకే, అతని మొహంలోకే చూస్తూ వుండిపోయింది. భాస్కర్ తన నోట మాడులో కాలో, పద్నాల్గు భువన భాండాలో చూపించినా అంత ఆశ్చర్య పోయేది కాదు. కాని తను అంతగా దులి

# మార్పు

నిన్నటి నా ప్రియురాలు,
నేడు నా యిల్లాలు,
ఈడొచ్చిన పల్లెటూళ్ళు
ఈనాడు జిల్లాలు

# నిజాలు

సూర్యుడు తూర్పున వుదయిస్తాడు,
పడమరన అస్తమిస్తాడు!
నాయకుడు ఎన్నికల్లో కనిపిస్తాడు.
గెలిచి ఆ తర్వాత నిష్క్రమిస్తాడు!

# నినాదాలు

'ఇంటింటికి ఒక (బే) దీపం'
ఏం చేయడం 'పవరు' కొరత-పాపం
'పల్లె పల్లెకొక బస్సు'
బస్తీ సర్వీసులన్నీ 'తుస్సు'

# ప్రగతి

మా వూళ్ళో వెలిసింది రేషన్ షాప్
మా వూళ్ళో తెరిచారు బ్రాందీ షాప్
మా వూళ్ళో కట్టారు అందమైన లాడ్జీలు,
మా వూళ్ళో పెట్టారు డాక్టర్లు ప్రాక్టీస్,
మా వూళ్ళో కానొందట త్వరలో పోలీసు స్టేషన్!
'ఇటీజ్ రియల్లీ ప్రోగ్రెస్ ఆఫ్ మై నేషన్.'

—నెల్లుట్ల వేంకటేశ్వరరావు

---

పేసున్నా భాస్కర్ అంత ప్రసన్నంగా, చిరునవ్వుల ఫౌంటెన్ లా వుండిపోయే టప్పటికి జయ ఆశ్చర్య పోయింది

"ప్లీజ్! నా మాట వినండి అది తప్పే! ఒప్పుకుంటాను ఐ ప్లీడ్ గిల్టీ కాని దీనికి సమాధానం—అదే అక్కయ్య అడిగిన ప్రశ్నకు మీ సమాధానం—ఏమిటి? ఆ ప్రశ్న అక్కయ అడిగిందని మరిచిపోయి నేను అడిగా ననుకుని జవాబు చెప్పండి."

జయ ఒక్క నిముషం మాట్లాడలేదు. తరువాత అంది. "ఇందిర గారు ఫోన్ చెయ్యటం అన్నది నాకు మింగుడు పడటం లేదు. మీ ప్రశ్నకు సమాధానం గొంతులోనుండి రానీకుండా అది అడ్డు పడుతున్నది." ఆ మెలో రెండు నిముషాల క్రితం వున్న కోపం యిప్పుడు లేదు

"సరే అయితే! పొద్దున మీకు ఫోన్ చేసింది అక్కయ్య కాదు నేనే" పొద్దుటి నుండి ప్రాక్టీస్ చేసుకున్న డైలాగ్ కాబట్టి సునాయాసంగా అనుకున్న విధంగా పలకగలిగాడు

"మీరా! ఎలా సాధ్యం?"

"అవును నేనే మిమిక్రీ చేసి...."

జయ ఆశ్చర్యంగా భాస్కర్ వంక చూసింది. భాస్కర్ అంతరిక్షం నుంచి వచ్చిన మొదటి ప్రాణి అయివున్నా జయ మొహంలో అంత ఆశ్చర్యం కనబడి వుండదు. "మీరా? ఓ గాడ్! వాట్ ఏ పర్ఫార్మెన్స్!"

భాస్కర్ కాళ్ళు అతను అనుభవిస్తున్న ఆనందాన్ని భరించలేక అన్నట్లు సన్నగా వణికాయి "కూర్చుందాం" అని మాత్రం క్లుప్తంగా అని లోపలికి వెళ్ళాడు జయ అతన్ని అనుసరించి అతని పక్కనే కూర్చుంది.

"నిజం మాస్టార్, ఇదిసుటుకు ఫెంటాసిక్ పర్ఫార్మెన్స్. ఇప్పటికీ నమ్మలేక పోతున్నాను—నాకు ఫోన్ చేసింది ఇందిర గారు కాదంటే...."

"థాంక్యూ!"

"ఇన్నాళ్లూ మీకు మామూలు వుద్యోగాలు సరిపోవు అంటే ఏమో అనుకున్నాను కాని, నిజంగా మీరా వుద్యోగాలు చేయటం మీలో వున్న యింతటి కళను మరిచిపోవటమే. స్ప్లెండిడ్ .... ఫాలెస్" అంది జయ ఫోన్‌లో జరిగిన సంభాషణ నెమరు వేసుకుంటూ.

"థాంక్యూ! థాంక్యూ! కాని అసలు విషయం...."

"అసలు విషయమా? ఓహో! నా సమాధానమా?" అంది జయ ఒక నిముషం ఆలోచించి అంది "నేనే చాలాసార్లు మీకు ఈ విషయం చెప్పాలనుకున్నాను కాని మిమ్మల్ని నొప్పించకుండా ఈ విషయం చెప్పటం కుదరదేమో అన్న ఆలోచనతో...."

"నన్ను నొప్పించటమా?" కళాత్మకంగా వున్న పౌరాణిక సినిమాని తదేకంగా చూస్తున్న ప్రేక్షకుడు రాముడి చేతిమీద టీకా గుర్తులు చూసి ఉలిక్కిపడినట్లు ఉలిక్కిపడ్డాడు భాస్కర్ "ఇంతవరకూ జయ నుండి నెగెటివ్ ఆన్సర్ వస్తుందని

# ఉద్యోగ విజయం

ఊహించలేదు తను.' "అంటే....మీరు.... నన్ను...."

జయ ఏం సమాధానం ఇచ్చేదో గాని. అదే సమయాన ఇందిర వచ్చింది. భాస్కర్ ఇందిర మొహం చూడలేకో, తన మొహం చూపలేకో తల తిప్పుకున్నాడు.

"ఏమిటి? యిద్దరూ సీరియస్‌గా వున్నారు?" అంది ఇందిర.

భాస్కర్ ఏం మాట్లాడలేదు. జయ ఏదో అనబోయింది. ఈలోగా ఇందిర అంది. "ఆగండి! మంచినీళ్ళు తాగి ఒక్క నిముషంలో వస్తాను." ఇందిర కిచన్ వేపు నడిచింది.

"నిముషం లోపు రారు కదా?" అంది జయ

"ఊహుఁ! రాలేను" ఇందిర వెళ్ళిపోయింది.

జయ భాస్కర్ వంక తిరిగింది. ఆమె కళ్ళు చిత్రంగా మెరుస్తున్నాయి. "భాస్కర్! ఐ టూ లవ్ యూ" అంది. అతని జుట్టు పట్టుకుని తల వంచి నుదుటి మీద సుతారంగా ముద్దు పెట్టుకుంటూ. భాస్కర్ తీయగా జయకు సరెండర్ అయిపోయాడు. నిముషం టైం లిమిట్ గుర్తుకు వచ్చి జయ చిలిపిగా అంది "నొప్పించానా లేదా?" అని అతని జుట్టు పీకి వదిలింది.

* * *

"....అదీ జయా! ఆ రోజు ప్రభాకర్ గురించి నువ్వు చేసిన వర్ణనతో నాకు పూర్తిగా మతిపోయింది. దాంతో నాకు పెద్ద అనుమానం వచ్చింది. అందుకనే ఈ డొంక తిరుగుడు అప్రోచ్ అనుసరించాల్సి వచ్చింది." అన్నాడు భాస్కర్.

"పైగా ప్రభాకర్ గురించి చెప్పేముందు నువ్వు చెప్పే దానికి నేను ఆశ్చర్యపోతే మిమిక్రీ చేసి నిన్ను ఎంటర్టయిన్ చేయాలని అన్నావుకదా!"

అదంతా బావగారి సలహా మహత్యమే అన్న విషయం చెప్పకూడదని అతను అప్పుడే నిశ్చయించుకున్నాడు.

"ఆ రోజుకి నాకు ప్రభాకర్ గురించి పూర్తి వివరాలు తెలియవు. తెలిసుంటే అవీ నీకు చెప్పేదాన్ని. దాంతో నీకు ఏమాత్రం అనుమానం వచ్చేది కాదు." అంది జయ ప్రభాకర్, రాజేశ్వరులగురించి తనకు తెలిసిన కథ చెప్పి. "ఆ రోజున నీకో విషయం చెప్పాను గుర్తుందా?- నేను చెప్పింది రహస్యంగా వుంచాలని. ప్రభాకర్ మా యిద్దరి మధ్య వున్న పూర్వ పరిచయాన్ని రహస్యంగా వుంచమన్నాడు. తనకి ఎంతో బాగా దోస్త్ అయిన మా అన్నయ్యతో కూడా తను యిదే వూళ్లో వున్నట్లు నాకు తెలిసినట్లు చెప్పొద్దన్నాడు. ఆ రోజున నాకు వీటన్నిటి వెనకాలవున్న విషయం అవగతం కాలేదు. ఇప్పుడు అనిపిస్తున్నది-యిదంతాఅందరూ చెప్పినట్లు రాజేశ్వరికి అనుమానం. అసూయ. తొందరపాటు ఎక్కువగా వుండటంవల్లనే కాబోలు."

"అయితే ప్రభాకర్ నాకు పోటీకి రాడన్నమాట."

"నువ్వు రమ్మన్నా రాడు. మరిచిపోయాను. మా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో వేకన్సీస్ గురించి యివాళే ఒక ఎడ్ పేపర్లకి పంపాం. నువ్వు అప్లై చెయ్యి ప్రభాకర్‌ని నేను రిక్వెస్ట్ చేస్తాను. నీకు తప్పకుండా వస్తుందనే అనుకుంటున్నాను."

"ఒక గంట క్రితం అనుకుంటాను. మీరు మామూలు వుద్యోగాలు చేయటం మిలో వున్న కళకు సమాధి కట్టటం అని నువ్వన్నట్లు నేను నిజంగా విన్నానా లేక నా భ్రమా?" అన్నాడు భాస్కర్ నవ్వుతూ. పైగా యిప్పుడు నేను చేస్తున్న ఉద్యోగం నాకు ఎంతో నచ్చింది. రోజూ లక్షల మందికి పరిచయం అవుతున్నాం అంటేనే అదో రకమయిన థ్రిల్. అవునా?"

"అవుననకో!"

"నేను ఈ ఉద్యోగంలో చేరకమునుపు పొట్టేలు మార్కు సున్నం ఎడ్ రేడియోలో వచ్చినప్పుడల్లా నా బి పి పెరిగిపోతుండేది- ఆ ఎడ్ గుర్తుందా?"

లేదన్నట్లు తల వూపింది జయ.

"అయితే వినిపిస్తాను" గొంతు సవరించుకున్నాడు.

"ఏమండీ!"

"ఏమిటే!"

"మగ పెళ్ళివారు తాంబూలం మళ్ళీ తిప్పి పంపారండి."

"ఎందుకూ?"

"పొట్టేలుమార్కు సున్నం లేనిదే వారు తాంబూలం వేసుకోరట."

"అవును మరీ! రుచికి, సునాసనకు, ఘాటుకు మేలైంది పొట్టేలు మార్కు సున్నం—వెంటనే పంపేఏర్పాటు చెయ్యి."

"ఇదీ వాళ్ల బాధ! పెళ్ళివారు తాంబూలం తిప్పి పంపినందుకు ఏమాత్రం బాధ పడడుకదా ఆ పెళ్ళికూతురి తండ్రి. పై పెచ్చు తన్మయత్వంతో దాన్ని పొగుడుతూ కూర్చుంటాడు ప్రచారం చేసుకునే విధానాల్లో చాలావరకు యిటువంటి నెగటివ్ అప్రోచెస్ వుంటాయి. 'మళ్ళీ తిప్పి పంపటం' అంటే ఏమిటో ఎవరికీ తెలియదు. మొన్న మా దగ్గరకు గుర్రం మార్కు సున్నంవాళ్ళు వచ్చారు. వెంటనే వాళ్ళకు....

"ఏమండీ?"

"ఏమిటే?"


"మగ పెళ్ళివారుతాంబూలం మళ్ళీపంపమంటున్నారండీ."

"మళ్ళీనా? యిందాక పంపాం కదా?"

"వారికి ఆ గుర్రం మార్కు సున్నం ఎంతో నచ్చిందిట "

"అవును మరీ....

అన్నది యిచా. సు. వాళ్ళు దాన్ని ఆనందంగా యాక్సెప్ట్ చేశారు. ఇప్పుడు



## దీపావళి ప్రత్యేకనవల

పొట్టేలు మార్కు ఎడ్ వింటుంటే బి. పి పెరగటం లేదు. జాలి వేస్తున్నది." అన్నాడు భాస్కర్. "మీ కంపెనీలో వేకన్సీల గురించి వినసంత వరకూ నా మనసులో ఏముందో తెలుసా? సినిమా ఛాన్సు వస్తే తప్ప ఈ ఉద్యోగాన్ని వదులుకో కూడదని. ఈ ఉద్యోగంలో యిలాంటి థ్రిల్స్ వున్నాయి మరి."

"కాదనను. కాని ఒక్క విషయం. మా కంపెనీ ఆర్టిస్టులకు. స్పోర్ట్స్‌మెన్‌కు అన్ని విధాలా ప్రోత్సాహమిస్తుంది దానికి తోడు మనిద్దరం ఒకేచోట పని చేయటం కంటే పెద్ద థ్రిల్ ఏంవుంటుంది? పైగా యిప్పటి నీవుద్యోగంలో భద్రత వుందా?" జయ అడిగింది.

"అఫ్‌కోర్స్! నువ్వన్నది నిజం. మీ కంపెనీలో ఉద్యోగం రావటం కోసం తప్పకుండా ప్రయత్నించాలి" అన్నాడు భాస్కర్. "అయినా ప్రభాకర్ నువ్వు చెబితే వింటాడా?"

అదే ప్రశ్న కొంత సేపటినుండి జయ మనసులో మెదులుతున్నది. ఆ ప్రశ్నకు తను మనసులోనే చెప్పుకున్న జవాబుని అప్రయత్నంగా బయటికి చెప్పేసింది. "ఒకవేళ వినకపోతే వినేటట్లు చేయాలి— చెయ్యొచ్చు కూడా."

"అంటే?"

"ప్రభాకర్ నాకు రాసిన వుత్తరాలు మొన్న చూపించాను గుర్తుందా? వాటిని. రాజేశ్వరి అడ్రెస్ రాసిన కవర్‌ను ప్రభాకర్‌కి చూపించి అవిరెండూకలిస్తే ఏమవుతుంది అని అడిగితే పెద్ద పేలుడు సంభవిస్తుందని అంటాడని నా నమ్మకం. మరి దాన్ని అవాయిడ్ చేయాలంటే ...." అంది జయ అదోరకమయిన ఉత్సాహంతో. కొంత అల్లరిగా.

"బ్లాక్ మెయిలింగా? నాకు యిష్టంలేదు. నేనింత వరకూ ఆరడజను పైగా వుద్యోగాలు సంపాదించాను. ఒక్కసారీ రికమండేషనే ఉపయోగించుకో లేదు. అటువంటప్పుడు ఏకంగా బ్లాక్‌మెయిలింగా? నేను ఒప్పుకోను" దృఢంగా చెప్పాడు భాస్కర్.

"నన్ను తప్పుగా అర్థం చేసుకున్నావు. ఒకవేళ ప్రభాకర్ మొండిగా ప్రవర్తిస్తేనే ఆ తురుపు ముక్క ఉపయోగించేది—అదయినా అతన్ని కన్విన్స్ చేయలేకపోతేనే నేననుకోవటం మనకా అవసరం రాదనే అతను తప్పకుండా సాయం చేస్తాడు"

"సరే! ఉద్యోగానికయితే అప్లై చేస్తాను గాని అడ్డదారులు వద్దు. ఓకే?"

ఆలోచిస్తూ తల వూపింది జయ. కాని జయకు కొంచెం అనుమానంగా వుంది— ప్రభాకర్ తనకు సాయం చేస్తాడా అని తనకు ఉద్యోగం ఇచ్చేటప్పుడు ఏవో షరతులు పెట్టాడు. అతన్ని బెదిరించాల్సి రావచ్చు. కాని భాస్కర్ అటువంటివి కుదరదంటున్నాడు. ఏం చెయ్యాలి?

* * *

మీ ముప్పై ఒక్క ఏళ్ళ జీవితంలో మీరు నేర్చుకున్న పెద్ద గుణపాఠం ఏమిటి? అని ఎవరన్నా ప్రభాకర్‌ని అడిగితే 'ఎవరి కంట్లోనయినా నలుసు పడితే తీయకూడదన్నది' అని తడుముకోకుండా అనే స్థితిలో వున్నాడు అతను ఇన్ జనరల్. ఇకపోతే ఇన్ పర్టిక్యులర్, జయ కంట్లో చిన్న నలుసు కాకుండా పెద్ద బండరాయి పడ్డా ఏం పట్టించుకోకూడదు అన్న నిర్ణయానికి వచ్చాడు అతను ఆ పరిస్థితిల

ప్రభాకర్ అడ్వెంచరర్ కాదు. క్రితం రోజు కారర్ 'క్షమించాలి జయగారు అనుకున్నాను' అని అన్నాక మొదలయిన తుఫాన్, ప్రళయంలో. ఎంతో కష్టపడి రాజేశ్వరికి కొన్ని నిజాలు, మరికొన్ని అబద్ధాలు కలేసి చెప్పి జరిగిన దాంట్లో అంతగా అనుమానించ తగ్గది, అపార్థం చేసుకో తగ్గది ఏమీ లేదని కన్విన్స్ చేయగలిగాడు. కాని దానికి ప్రభాకర్ చాలా పెద్ద పరిహారం చెల్లించాల్సి వచ్చింది—మొన్న రాజేశ్వరితో చూసిన సినిమాకే మళ్ళీ యిద్దరూ ఆ సాయంకాలం వెళ్ళాలన్న మాట. సాధారణంగా అడ్వెంచరర్స్ ఒక ప్రమాదాన్ని విజయవంతంగా ఎదుర్కొ-

## కల్లోలిత కవిత

పిచ్చివాళ్ళ చేతి రాళ్ళవకు
పిచ్చివాళ్ళకి రాజకీయాలివ్వకు

* * *

కొత్త మేడలు
కట్టడానికి
చెట్లు కూల్చేశారు

మొదట గొడ్డళ్ళతో తుంటెని తెగ్గొట్టేశారు
దెబ్బదెబ్బకు చితుకులుగా కూలిపోతూ
కొమ్మలు రెమ్మలు చివురుటాకులు
ఒణికిపోతూ

హాహాకారం చేస్తూ
చెట్లు ఫెళ్ళున నేలకొరిగినై
పిట్ట లెగిరిపోయినై
పాట లెగిరిపోయినై
చల్లటి చెట్ల నీడలో
పటపగలే చీకట్లో కలిసిపోయినై

నీడల్లో ఆగి సేదదీరిన
అసంఖ్యాక పాద ముద్రలు
ఇసకలో యింకిపోయినై

హరితాన్ని హత్య చేశారు
మలయ మారుతాన్ని దూరంగా తరిమేశారు
అంగాల్ని విడివిడిగా రంపాలతో కోసి
లారీల కెత్తేశారు
శవ ఖండాల్ని అమ్ముకున్నారు.

కనబడని రకం మరకలు
కాంట్రాక్టర ముడుపుల్తో కడిగేసుకున్నారు.

కొత్త మేడలు
కట్టడానికి
చెట్లు కూల్చేశారు

* * *

చెట్ల జ్ఞాపకాల సమాధులోంచి
ఆకాశ భవనాలకు పునాదులు వేశారు
భద్రంగా బసాలకెత్తిన
బలహీనుల ఎముకల పొడి
సిమెంటుగా వాడి గోడలు లేపారు

సిమెంటు గోడల నీడల
చలువగదుల పైకప్పుల
ఇనప శూలాలకు తగుల్కొని వేలాడే
రాక్షస తూనీగలు పంకాల కింద
మెత్తటి కుర్చీలు అమర్చారు
మనిషి మాంసమంతటి మెత్తని కుర్చీలు
వారం వర్జ్యం చూసి
ప్రవేశించాయి గోముఖ వ్యాఘ్రాలు

సిమెంటు అరణ్యంలోని
సిమెంటు భవంతులోని
సిమెంటు చలువగదుల్లోని
మెత్తటి కుర్చీలకోసం
పోట్లాడుకుంటాయి కాటాడుకుంటాయి
కొత్తరకం అడివి జంతువులు
కుర్చీల కోసం
ప్రజాసేవ పేరిట
ఇనపగోళ్ళతో గొంతులు నులుము
కుంటాయి
ఉక్కుడెక్కల్తో ఒళ్ళంతా కుమ్మ
కుంటాయి

కుర్చీలో చేరి
రక్తపుకూడుతో విందారగిస్తాయి

చెట్లు కూల్చిన చేతుల నోళ్ళు
మొక్కలునాటమని హితోపదేశంచేస్తాయి.

* * *

గోడలెగ తపస్సుచేసే బల్లి
ఎగరలేని పురుగుని భక్షిస్తుంది.
మురికివాడల్లోని గుడిసెల్ని
బుల్‌డోజరు భక్షిస్తుంది
చితికిన గుడిసెల పేగుల్లోంచి
సిమెంటు గోడలు లేసాయి
సిమెంటు శీతలగదుల్లోకి
విధిగా వారం వర్జ్యం చూసి
ఇనప బీరువాలు ప్రవేశిస్తాయి
ఇనప బీరువాల్లోంచి
అధికార రాజకీయాలకి
ఎరువు సరఫరా అవుతుంది
ఇనుప బీరువాల్లోంచి
జాతీయ వారాపత్రికలు వెలువడతాయి
అబద్ధాలు జాతీయం చేస్తాయి
ఇనుప బీరువాల్లోంచి
రేడియోలు టెలివిజను
ప్రగతి కూతలు నక్కలా కూస్తాయి
ఇనప బీరువాల చుటూ
గ్రహాలు నృత్యం చేస్తాయి.
ఇనప బీరువాల చుట్టూ
భూమి గుండ్రంగా తిరుగుతుంది
ఇనప బీరువా గర్భాలు
నల్లధనం శిశువుల్ని ప్రసవిస్తాయి
నల్లధనం ప్రసవించే కొత్తరకం
వింత అవయవాల సంతతి
నల్ల రూపాయ బిళ్ళలు కళ్లుగా పెట్టుకుని
చూసాయి
లోకాన్ని ఆత్మల మార్కెట్టుగా
మనుషుల్ని వస్తువులుగా మార్చేసి
కొనడం అమ్మడం చేసాయి
నల్లరూపాయి బిళ్ళల్ని పైకెగరేసి
సూర్యుడు చంద్రుడు వెలుగు కంతల్ని
పూడ్చేసి

నల సంస్కృతీ కిరణాల్ని
లోకంపై వెదజలుతాయి
గ్రహణం విడిపోకుండా
అమ్ముడుపోయిన ఆత్మల్ని కాపలా
వుంచుతాయి

నల్ల కళ్ళ చూపుల్ని
నల్ల మెదళ్ళ వూహల్ని
నల్ల కిరాల కిరాతకాల్ని
నల్ల ధన సంస్కృతిని
నల్ల రాజకీయాల్ని
ఇనపబోషీలు ఇనపబూట్లు
సదా రక్షిస్తుంటాయి.

ఇనప శాసనాల బోనుల్లో
తిరగబడే ఆత్మల్ని బంధిస్తాయి
స్వేచ్ఛకోరే ఊపిరిపై
కర్ఫ్యూ విధిస్తాయి
కలిసి కదిలే
కల్లోలితం ప్రకటిస్తాయి

దెయ్యపువ్యాళ్ల సైరన్ల కూతల్తో
జీవం ప్రవహించే వీధుల్ని
మరుభూములుగా మారుస్తాయి
బయొనెటతో
బతుకుల్ని పొడిచి భయపెడతాయి
లొంగకపోతే
సంఘర్షణ పేరిట
చేటకు కటి కాల్చేస్తాయి
చెట్లు కూల్చిన చేతులనోళ్ళ
మొక్కలు నాటమని సందేశాలిసాయి.

*　　*　　*

పిచ్చెక్కినవాళ్ళ చేతికి రాళ్ళివ్వకు
పిచ్చెక్కిన వాళ్ళకి రాజకీయా లివ్వకు

—నగ్నముని

న్నాక, అలా ఎదుర్కోవటంలో తాము చూపించిన తెగువ, సమయస్ఫూర్తికి తమను తాము మెచ్చుకుంటారు. కాని ప్రభాకర్ మాత్రం ఈ ప్రమాదం జరగటానికి నేనే కారణం కదా, అని విచారించ సాగాడు. జయని చూసి జాలి పడి ఉద్యోగం యివ్వకపోతే యిది జరిగేది కాదు కదా. అసలు జయను ప్రేమించి వుండి వుండక పోతే బాగుండేది కదా.... యీ విధంగా జరుగుతున్నది అతని ఆలోచనా విధానం.

ఆ సమయానికి జయ కొన్ని టైప్‌డ్ పేపర్లతో లోపలికి రాకపోతే 'జయ పుట్టిన వూళ్ళోనే నేను పుట్టక పోతే బాగుండేది కదా, అని పశ్చాతాపపడుతుండేవాడు.

ఆ పేపర్లమీద అతని సంతకాలు తీసుకున్నాక వెళ్ళబోతూ ఆగింది జయ.

ప్రభాకర్‌కి అర్థం అయిపోయింది జయకి ఏదో పని వుందని. అయినా ఏం మాట్లాడలేదు. ఒక నిముషం యిదరూ నిశ్శబ్దంగా గడిపారు. జయ కూర్చుంది. ఆమె మొహంలో దాదాపు పావుగంట మాట్లాడబోతున్నాను అన్న భావం కనబడేటప్పటికి అతను అదిరిపడాడు. వెంటనే అతను యింకోసారి అదిరిపడాల్సివచ్చింది —ఎందుకంటేజయ "ప్రభా!" అని సంబోధించింది అప్పటికే ప్రభాకర్ "చూడండి "మిస్ జయ." అని హింట్ యివ్వబోయాడు. కాని లాభం లేకపోయింది.

"ప్రభా!" నిన్నమన డిపార్ట్‌మెంట్‌లో వేకన్సీస్‌గురించి అడ్వర్టైజ్‌మెంట్‌పంపాం కదా! యిన్నాళ్ళు నేను నీకో విషయం చెప్పలేదు. నేనూ, భాస్కర్ అనే అతనూ ప్రేమించుకుంటున్నాం. అతను గ్రాడ్యుయేట్. దాదాపు రెండు సంవత్సరాల అనుభవం వుంది. ఈ మధ్యనే ఒక అడ్వర్టైజింగ్ ఏజెన్సీలో చేరాడు. మరిచిపోయాను. అతను చాలా మంచి మిమిక్. అతనికి మన కంపెనీలో ఉద్యోగం వస్తే అతను సెటిల్ అయిపోయినట్టే...."

"చూడండి మిస్ జయా...."

"....మేమిద్దరం పెళ్ళి చేసుకోవటానికి ఏ విధమయిన అడ్డంకులూ వుండవు."

"మిస్ జయా!"

"అతనికి నా రికమండేషన్ అక్కర్లేదనుకో...."

"అది కాదు మిస్ జయా!"

"....ఈ మధ్య ఉద్యోగాలు దొరకటం ఎంత కష్టం అయిపోయిందో తెలుసు కదా. అతనికి ఏ విధమయిన రికమండేషను యిష్టంలేదు. ఏదో నా ఆతృత కొద్దీ...."

"మిస్ జయా!" ఉట్టి మాటలతో జయని ఆకర్షించలేనని తెలుసుకుని లేచాడు. ఇంకో రోజున, ఇంకో సమయాన జయ ఈ విషయం అడిగితే బహుశా అతను ఒప్పుకునేవాడేమో. జయ కంట్లో పడ్డ నలుసు సృష్టించిన అలజడి అంతా యింతా కాదు. పైగా అది జరిగి యింకా ఇరవైనాలుగు గంటలు కూడా కాలేదు జయకి ఉద్యోగం యివ్వటమే పొరపాటేమో అనుకుంటున్నాడు ప్రభాకర్— రాజేశ్వరి విషయం తెలుసు కాబట్టి. ఇప్పుడు జయ కుటుంబానికి మొత్తం ఇక్కడ ఉద్యోగాలు యివ్వటం మొదలుపెడితే ఒక్కొక్కరి కంట్లో ఎన్ని నలుసులు పడతాయో తాను ఎన్ని ప్రళయాలు ఎదుర్కోవాల్సి వస్తుందో.. లాభం లేదు.

"చూడండి మిస్ జయ! మీ మనసులో వున్నది మీరు చెప్పదల్చుకునేది. డైరెక్ట్‌గా పూర్తిగా చెప్పకపోయినా మీ మనసులో వున్నదేదో నేను వూహించుకున్నాను. ఇంతకీ మీరు చెప్పదల్చుకున్నది నేను వూహించిందేనా?"

జయ చాలా టెంప్ట్ అయ్యింది—"మీరేం వూహించుకున్నారో అన్నదానిమీద చిన్న గెస్ చేసి ఒకటై వుంటుందనుకుంటున్నాను మీరు వూహించినది నేను అనుకుంటున్నదేనా?" అని అందామని. కాని అవసరం తనది. అందుకనే అతని డొంకతిరుగుడు ప్రశ్నకు సూటిగా "భాస్కర్‌కి. అదే నా ఫ్రెండ్‌కి యిక్కడ వుద్యోగం యివ్వాలి" అంది.

ప్రభాకర్ ఒక సారి గ్లాస్ టాప్ టేబుల్ వంక చూశాడు. "డోన్ట్ లూజ్ యువర్ టెంపర్ — నోబడి నీడ్స్ యిట్ హియర్" అన్న మేక్సిం వంక ఒక నిముషం సేపు చూసి తమాయించుకున్నాడు. "జయా!

డిసీజ్ టూ మచ్! ముందు నీకు వుద్యోగం కావాలన్నావు. సరే మీ పరిస్థితి చూసి యిచ్చాను. ఇప్పుడు మీ బాయ్ ఫ్రెండ్‌కి కావాలంటున్నావు. మీ పెళ్ళయ్యాక మీ అబ్బాయికి కావాలంటావు కాబోలు. ఒక్కసారి నీకోసం.... ఒక్క నీకోసమే.... అదీ నేను నీకు అన్యాయం చేయకపోయినా చేశానేమో అన్న భావంతో నీకన్నా బెటర్ కాండిడేట్స్ వున్నా నీకు వుద్యోగం యిచ్చాను. నే నెటువంటి పరిస్థితుల్లో వున్నానో నీకు తెలియదు. నేను నీకు చెప్పలేను. దయచేసి నా నుండి యింకే ఫేవర్స్ ఆశించకు...."

"అది కాదు ప్రభా!"

ప్రభాకర్ సర్దుకున్నాడు. తను మెత్తగా చెప్పి లాభం లేదు. "మిస్ జయా! అతనికి సరి అయిన క్వాలిఫికేషన్స్ వుండి. యింటర్వ్యూ బాగా చేస్తే అతను సెలక్ట్ అవుతాడు. రికమండేషన్స్, నెపోటిజం యిక పనికిరావు."

ప్రభాకర్ చాలా చిత్రంగా మాట్లాడుతున్నట్లు తోచింది జయకి. నిన్నటివిషయం ఆమెకు నలుసంత కూడా తెలియదు. తెలిసుంటే ప్రభాకర్ ప్రవర్తనని కొంతవరకన్నా అర్థం చేసుకోగల్గేది. "ఎమర్జన్సీలో మాట్లాడినట్లు రూల్సు, డిసిప్లిన్ అంటావేవిటి? అయినా నలుగురయిదుగుర్ని తీసుకుంటున్నప్పుడు ఒక్కడి కోసం టాటాఫ్‌దివే పెళ్ళలేవా?— అసలా పరిస్థితే తల ఎత్తదు. అతను తప్పకుండా స్కోర్ చేయగలడు. నేనడిగింది నీ యస్యూరెన్స్ మాత్రమే. దానికే అంతగా...."

"అతని తరపున మీ వాదన చాలా బాగుందని ఒప్పుకుంటున్నాముగాని, మీరేం చెప్పినా నేనా గ్యారంటీ యివ్వను. ఇప్పుడు నాకు కొన్ని అవసరమైన పనులు...."

జయకు కోపం ముంచుకువచ్చింది. ఆ కోపంలో "నేనేం చెప్పదలుచుకోలేదు. చెప్పనక్కరలేదు," అని బయటికి వెళ్ళి వెంటనే తిరిగి వచ్చింది. వచ్చినవెంటనే అతనిమీదకు తను తీసుకువచ్చిన కాయితం విసిరింది- అదే కోపంలో.


ప్రభాకర్ ఆశ్చర్యపోతూ ఆ కాయితం తీసుకుని చదవసాగాడు. ఎక్కడో చూసినట్లు, ఎలాగో పరిచయం అయినట్లు అనిపించింది.

ప్రియాతి ప్రియమైన ప్రియా!

నిన్న పొద్దున యిక్కడికి చేరాను.

అవునూ! నేను అక్కడ ఎన్ని రోజులు వున్నాను? యిక్కడికీ వచ్చి 'ఓ నాలుగు రోజులపాటే కదా నేను వూరువెళ్ళి వచ్చింది. క్లాసులేం పోయివుండవు' అని అనుకున్నాను. తీరా చూస్తే చాలా క్లాసులు పోయినట్లనిపించి మా వాళ్ళని అడిగితే 'నువ్వు యిరవై రోజులు రాలేదు కదా' అన్నారు. ఏమిటో ఈ మాయ అర్థం కావటంలేదు.... ....

ప్రభాకర్ చదవటం ఆపుచేశాడు. జయ వంక చూస్తూ కూర్చున్నాడు. "ఇంకా.... ఇంకా నీ దగ్గర యీ వుత్తరం వుందా?" అని అడిగాడు. జయ జవాబు యివ్వలేదు. తను రాసిన వుత్తరం జయ దాచుకుంది అన్న అదోరకమైన గర్వం అతన్ని కొంతసేపు మాట్లాడనివ్వలేదు. ఇంతటి వాదోపవాదాల మధ్య వున్నట్లుండి ఆ వుత్తరం చూపించటం ఎందుకు అన్న




ప్రశ్న తలెత్తేటప్పటికి ఆ గర్వం ఎగిరిపోయింది.

"చూడు ప్రభా! బీ ఎ గుడ్ బాయ్! నేను చెప్పినట్లు ఈ వుద్యోగం భాస్కర్‌కి యిస్తానని హామీ ఇస్తే ఏ గొడవా వుండదు. లేకపోతే మిస్ రాజేశ్వరికి ఈ వుత్తరం అందితే నన్నేం అన్నా లాభం లేదు." అంది జయ.

జయకి తనవిషయం తెలిసిపోయిందన్న లజ్జ, తనని బెదిరిస్తున్నదన్న కోపం కలిసి అతన్ని మళ్ళీ తాత్కాలికంగా మూగవాడ్ని చేశాయి. తేరుకున్నాక అడిగాడు "ఏమిటిది జయా?"

"వెరీ సింపుల్ సార్! భాస్కర్‌కి వుద్యోగం యిస్తే...."

"నేను దాని గురించి మాట్లాడడం లేదు. యిల్లా బెదిరించడం బాగుందా అని అడుగుతున్నాను."

"ఎవ్రిథింగ్ ఈజ్ ఫెయిర్ యిన్ లవ్ అండ్ వార్. మనది ఒకప్పటి లవ్- యిప్పటి వార్. సో లెట్స్ ప్లే ది గేమ్!" అంది జయ నవ్వుతూ.

"తప్పకుండా!" అన్నాడు ప్రభాకర్. వెంటనే ఆ వుత్తరాన్ని నలిపి చెత్తబుట్టలో పారేశాడు. "ఇందాక సరిగ్గా వినలేదు. యింతకీ నీ డిమాండ్స్ ఏమిటి?" అన్నాడు తమాషాగా నవ్వుతూ.

జయ మొహం ఒక్క క్షణం మాడిపోయింది. వెంటనే నవ్వేస్తూ అంది- "నాకు గుర్తున్నంత వరకూ నువ్వు నాకు ముప్పై ఆరు, నేను నీకు ముప్పై ఎనిమిది వుత్తరాలు రాసుకున్నాం. ముప్పై ఆరులో ఒకటి పోతే ముప్పై అయిదు కదూ?"

ప్రభాకర్ ఒక్క నిముషం తీవ్రంగా ఆలోచించాడు. టైం చూసుకుని "యింకో అరగంటలో నాకు కొన్ని మీటింగ్స్ వున్నాయికదూ?" అని ఆమె సమాధానం కోసం ఎదురు చూడకుండా "కొంతసేపు నాకు టైం కావాలి. మనం మాట్లాడుకుంటున్న విషయానికి యింకా టైం వుంది కదా ఆలొచిద్దాం" అన్నాడు.

"ప్లీజ్ ఎక్స్యూజ్ మి ఫర్ హావింగ్ బీన్ రూడ్. బట్ ఐ కుడ్‌నాట్ హెల్ప్ యిట్," అంది జయ తలుపు వరకూ వెళ్ళాక. అని తలుపు తీసుకుని వెళ్ళింది.

కాని ఆమె మూలంగా కలిగిన అలజడి మాత్రం ప్రభాకర్ మెదడును వదలలేదు. ప్రభాకర్ రైటింగ్ పాడ్ తీసుకుని పిచ్చిగీతలు గీయటం మొదలుపెట్టాడు. 'ఇన్నాళ్లూ తను రాజేశ్వరికే అణిగి మణిగి వుండాల్సివచ్చింది. యిప్పుడు జయకి కూడా.... తనలో ఏం లోపం వుందని

యీ అబలలు తనని యిల్లా కంట్రోల్ చేయగల్గుతున్నారు?' ఉన్నట్టుండి అప్రయత్నంగా 'నువ్వు ఎవరినన్నా ప్రేమించావా?' అని రాసి దాని వంకే చూడసాగాడు. ఒకటి... రెండు.... మూడు నిముషాలు గడిచాయి. ఒక్కసారిగా ఎందుకో అతనికి నవ్వు వచ్చింది ఒక నిముషం సేపు హాయిగా నవ్వుకున్నాడు అంత వరకూ పరిస్థితి ఎదుర్కొవడంలో తన విధానం యెంత తప్పో అతనికి తెలియవచ్చింది "యు నీడ్ ఛేంజ్ యువర్ అప్రోచ్ బడ్డీ" అనుకుని రాజేశ్వరికి ఫోన్ చేశాడు.

"హలో రాజూ! టికెట్స్ బుక్ చేశావా?"

"ఓ! సాయంకాలం అయిదుగంటలకల్లా యింటికి వచ్చేయ్! అటునించి సినిమాకి పోదాం!"

"ఓకే! కాని ఆ యిన్‌ఫర్నల్ మూవీకి మటుకు కాదు స్పేర్లింగ్‌లో మంచి మూవీ వుంది దానికి."

"బట్ యూ పామిస్డ్...."

"నో బేబి ఒకసారి ఆ సినిమా చూశాను అంటేనే ఒళ్ళు కంపరమెత్తుతున్నది. రెండోసారి భరించలేను"

"కాని ప్రభా!" రాజేశ్వరికి కలిగిన ఆశ్చర్యంలో వందోవంతు మాత్రమే ఆమె గొంతు పలక గలిగింది.... "నేను టికెట్స్ బుక్ చేశానుకదా యెల్లా?"

"సింపుల్ మైడియర్ వాట్సన్! కాన్సెల్ దెమ్!" అన్నాడు ప్రభాకర్ నవ్వేస్తూ. "సో మనం స్పేర్లింగ్‌కే పోతున్నాం! ఇప్పుడు నాకు పనివుంది. వుంటాను. బై!" ఫోన్ పెట్టేశాడు.

ప్రభాకర్‌కి చెప్పలేనంత ఆనందంగా వుంది. కొంచెంసేపు జయ బెదిరింపును ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచించాడు. తరువాత చెత్తబుట్టలోంచి జయకు తను రాసిన ప్రేమలేఖ తీసి మడతలు సరిచేసి జేబులో పెట్టుకున్నాడు. ఇంటర్‌కమ్‌లో జయను పిలిచాడు.

"హలో వాట్ డూ యూ వాంట్ సర్"

"చూడండి మిస్ జయా! ఇంవాకటి మీ ప్రపోజల్ ఓకే చేస్తున్నాను. స్టాంప్ పేపర్ మీద సంతకం పెట్టమంటే...."

"ఇట్స్ వెరీ కైండ్ ఆఫ్‌యూ. అటువంటివేం అవసరం లేదు" జయకి సంతోషంతో మాటలు రాలేదు.

ప్రభాకర్ ఫోన్ పెట్టేసి "ఐ విల్ బీ? ప్లేయింగ్ ది గేమ్ మేడమ్ అండ్ హౌ" అనుకున్నాడు.

రెండేళ్ళ క్రితం లక్షాధికారి ఈ నాడు భిక్షగాడు కావచ్చు. నిన్నటి వరకూ జైల్లో వున్నవాడు ఈ రోజు మినిస్టర్ కావచ్చు. అరగంట క్రితం వరకూ అడ్వెంచరర్ కాని ప్రభాకర్ యిప్పుడు అడ్వెంచరర్

* * *

నిజం చెప్పలేనప్పుడు అబద్ధం చెప్పచ్చు. అబద్ధం చెప్పటం రానివారికి నిజం చెప్పక తప్పదు. అబద్ధం చెప్పటం రాకా, నిజం చెప్పలేక వుండే పరిస్థితిలో గత్యంతరం దొరకాలంటే చాలా కష్టపడాల్సివస్తుంది. ఎంతో కష్టంమీద జయకి తను ఏం చేయాలో తెలిసివచ్చింది.

తను ప్రభాకర్‌ని బెదిరించినట్లు భాస్కర్‌కి చెప్పాలనుకోవడం చాలా పొరపాటు అని జయకి తెలుసు. అలాగని బెదిరించలేదని అబద్ధం చెప్పలేదు అబద్ధం చెప్పటం యిష్టంలేక కాదు- అది బయటపడిపోయే అబద్ధం. అందుకని మరి అటు నిజం, యిటు అబద్ధం చెప్పలేనప్పుడు ప్రస్తుతం ఏం చెప్పకుండా వుండటం మంచిది అన్న నిర్ణయానికి వచ్చింది.

ఒక వారంరోజులపాటు అసలా ప్రసక్తే ఎత్తలేదు జయ. భాస్కరూ దానిగురించి అడగలేదు. ఎనిమిదోరోజున భాస్కర్ అడిగేవాడేగాని అతను ఏదో తన ఫర్మ్ పనిమీద మద్రాస్ వెళ్ళాల్సి రావటంతో ఆ హడావుడిలో వుండిపోయాడు. మళ్ళీ అతను వచ్చేటప్పటికి ఇంకో పదిరోజులు గడిచాయి. మద్రాస్ నుండి వచ్చాక భాస్కర్ ఆదోలా వుండిపోయేటప్పటికి జయ వర్యాలేదు. ఆ విషయం గురించి మాట్లాడటం లేదు అనుకుంది. ఇంకో రెండు రోజులు అయిపోయేటప్పటికి జయ తన మొదటి జీతం అందుకుంది-పైగా అదే రోజున ఇంటర్వ్యూ కాల్ లెటర్స్ పంపటంతో, ఆ విషయం ఏదో విధంగా భాస్కర్‌కు చెప్పాలి అనుకుంది.

జయ వెళ్ళేటప్పటికి భాస్కర్ ఆదోలా వున్నాడు.

"ఇంట్లో ఎవ్వరూ లేరా?"

లేరన్నట్టు తల వూపాడు.

"ఇవాళ మొదటి జీతం అందుకున్నాను" అంది జయ.

"అలాగా!"

తన మాటల్లో కనబడ్డ సంతోషం అతన్లో ప్రతిఫలించక పోయేటప్పటికి జయ నొచ్చుకుంది.

"ఏమిటి అలా వున్నావు?" అడిగింది. "ఏమున్నా డ్రామా రిహార్సలా?"

చివుక్కున తల ఎత్తాడు భాస్కర్. ఒక్క నిముషం ఆగి అన్నాడు "నా పాత వుద్యోగాలా కాకుండా ఈ ఉద్యోగాన్ని ఎంతో అభిమానించాను. కాని లాభం లేక


శ్రీ బాలాజీ ఎలక్ట్రికల్స్
వెంకటేశ్వర టాకీస్ ఎదుట
ఏలూరు-1

ఫోన్: 1075
ర్యాలి. గణేశ్. ఓరియంట్.
పోలార్, ఎయిర్‌మార్షల్, ఖైతాన్
టేబిల్ & సీలింగ్ ఫ్యానులు
ర్యాలి గ్రైండర్లు కమ్ మిక్సర్లు
మోహిని గ్రైండర్లు
నాణ్యత.... నమ్మకత కల
ఐరన్ బాక్సులు, ట్యూబ్‌లైట్లు
టేబిల్ లైట్లు, ఫ్యాన్సీ లైట్లు
'ANCHOR' వారి ఎలక్ట్రిక్ సామాన్లు
KIEERTONE వారి గృహోపకరణాలు
మీకు నచ్చే ధరలకు లభిస్తాయి
గుత్తా సుబ్బారావు & బ్రదర్స్
DEALERS FOR
NELCO CALCULATORS

## ఉద్యోగ విజయం

పోయింది. ఈ ఉద్యోగం పోయింది"

"పోయిందా? ఎందుకు?"

"ఇంకా ఈ విషయం అక్కయ్యకు తెలియదు. కొన్ని రోజులపాటు చెప్పదలుచుకోలేదు అంతవరకూ ఈ విషయం రహస్యంగా వుంచాలి"

"తప్పకుండా! కాని...."

"మొన్న మా ఫర్మ్ పనిమీద మద్రాస్ వెళ్ళానని చెప్పాను గుర్తుందా? అప్పుడు వెళ్ళింది నా పనిమీదే! అంటే ఆ చిత్ర వారు కొత్తనటులు కావాలంటే అప్లై చేశాను పిలిచారు-స్క్రీన్ టెస్టులుగట్రా వుంటాయి. ఓ వారంరోజులు వుండాల్సి వస్తుంది అని రాశారు. మా వాళ్ళని అడిగితే చేరిన కొత్తలు. పైగా వర్క్‌లోడ్ చాలా వుంది వీల్లేదన్నారు. చెప్పకుండా వెళ్ళిపోయాను. అక్కడ నుండి వచ్చేసేటప్పటికి తీసేశామన్నారు. ఆ పదిహేను రోజుల జీతం యిచ్చారు. నాకు ఎంతో నచ్చిన వుద్యోగాన్ని ఎంతో తక్కువ వ్యవధిలోనే పోగొట్టుకున్నాను."

"మంచి వుద్యోగం అన్నావు. నీకు నచ్చింది అన్నావు. మరి దాని మీద కూడా శ్రద్ధలేకుండా..."

"అదే నాలో వున్న బలహీనత- సినిమాల్లో చేరాలనే బలహీనత. Life will be still better if you donot repent for what you have done అన్నది నమ్ముతాను గాని ఈ సారి చేసిన పనికి చాలా బాధపడుతున్నాను. ఇక సినిమాల గురించి ఆలోచించనేమోకూడా. ఇప్పుడు వుద్యోగం ఎక్కడదొరుకుతుందా అని ఆలోచిస్తున్నాను ఇంతవరకూ అరడజను పైగా వుద్యోగాలు సునాయాసంగా సంపాదించాను కాని ఈ సారి ప్రయత్నిద్దామన్నా అదోరకమయిన నిరుత్సాహం."

జయ వేగంగా ఆలోచించసాగింది. ఇప్పుడు ప్రభాకర్‌కు, తనకు మధ్య జరిగిన పోరాటం వివరాలు చెప్పటం భాస్కర్‌ని యింకా నిరుత్సాహ పరచటమే. ఇంటర్వ్యూ రోజున అతనికి పూర్తి విషయం చెప్పచ్చు. ఈ రోజుకి తీయని అబద్ధం చెప్పచ్చు "మరిచిపోయాను ఇవాళే అందరికీ ఇంటర్వ్యూ కాల్ లెటర్స్ పంపాను. సోమవారం.... అదే ఏడో తారీఖున ... ఇంటర్వ్యూ. నేను నీ విషయం ప్రభాకర్‌ని అడిగాను నేను నా ఫ్రెండ్‌కి వుద్యోగం కావాలి అని అడిగేటప్పటికి అంత కిన్నానా అని అన్నాడు కాబట్టి నీకు వుద్యోగం గ్యారంటీ." అంతవరకూ, ప్రభాకర్‌ని తను బెదిరించటం తొందరపాటుతో చేసిన పని అని అనుకుంటున్న జయ తన అభిప్రాయాన్ని మార్చుకుంది.

"థాంక్స్! ఈ మాట కొంత వూరట కలిగిస్తున్నది. నిజంగా యిక సినిమాల గురించి ఆలోచించను సినీ ప్రొఫెషన్‌లో అన్‌సర్టైనిటీ వుంటని తెలుసుగాని దానిమీది వ్యామోహం యింతఅన్‌సర్టైనిటీని నా జీవితంలో నింపాక యిక దాని గురించి అనుకునేది కూడాలేదు" దృఢంగా అన్నాడు భాస్కర్.

"నిజంగా?"

"నిజంగానే!"

"ఇప్పుడు నాకెంత సంతోషంగావుందో తెలుసా? నీకీ వుద్యోగం వచ్చాక మన పెళ్ళి గురించి...."

ఎప్పుడో రావాల్సినసందేహం అప్పుడు వచ్చింది భాస్కర్‌కి. "ప్రభాకర్ అంత సులభంగా నీ మాట విన్నాడా? అసలు జరిగినదేమిటో చెప్పు."

జయకి ఏం చెప్పాలో తోచలేదు- పైగా యిబ్బందిగా కూడా తోచింది. ఒక నిముషం ఆలోచించి "చెప్పు అంటే గుర్తుకు వచ్చింది. నేను అర్జంట్‌గా చెప్పులు కొనుక్కోవాలి. అలా బజారుకి వెడుతూ చెప్పుకుందాం" అంది.

## కవిత్వం

బత్తాయిపండు కొరికి తినడం
సరైన పద్ధతి కాదు.

సన్నగా గుండ్రంగా బంతిలా
కవిత్వాన్ని ఏ మూల మొదలెట్టాలో
భూప్రదక్షిణం చేసినా తెలియదు.


గుట్టు చెప్పకుండా మూతి బిగించుకుని
ఆకుపచ్చ మచ్చల పసుపుపచ్చ
వాసనతో
పండినఅడవిలా ఆకర్షిస్తుంది బత్తాయి.

తెలిసింది! మెల్లగా బుగ్గ గిల్లి
అరణ్యాల అందాల చీరల్ని ఒలిచి
(చూపు మరీ వాడిగా వుండకూడదు.
వెన్నెల తిన్నెలమీద నక్షత్రాల
నక్షత్రాలు
ఎగరుగా విషాదాన్ని ప్రసవిస్తాయి)
అనునయంగా బుజ్జగించి
అంతర అవరోధాలుకూడా
తొలగించాలి.

అస్పష్ట కవిత్వపు అందాలన్నీ
ఒయ్యారంగా ఒళ్ళు విరుచుకుని
తొక్క తీసిన బత్తాయిలో తొనల్లా
పానుపుప్లేటుమీద పరచుకుంటాయి.

గోళ్ళూ పళ్ళూ తీసి ప్రక్కనపెట్టి
పెదవులతో మృదువుగా
రసాస్వాదన చెయ్యాలి.

—కె. గోదావరిశర్మ



"సరే."

ఇద్దరూ బజారుకి బయలుదేరారు తనకి, ప్రభాకర్‌కి మధ్య జరగని సంభాషణ జరిగినట్లు జయ చెబుతుంటే భాస్కర్ చాలా శ్రద్ధగా విన్నాడు.

"ఆ షాప్‌లోకి వెడదామా? నేను ఆ డిప మోకోర్స్‌లో చేరటానికి డబ్బులు పోగుచేసేలా జుల్లా అక్కడ కొంతకాలం పనిచేశాను."

"షూ షాప్‌లోనా? థియేటర్‌లోనో హోటల్‌లోనో అని చెప్పావుకదా!" అంది జయ.

"నేను చెప్పేది పూర్తిగా నమ్మకూడదు. కొంత నిజం ప్లస్ కొంత నిరపరాధ, అంత మైన ఎంటర్‌టైనింగ్ బట్టం. కాబట్టి అఫ్ కోర్స్. రెండ్రోజులవింకీ నిజమునే చెప్పుచుంటని అనుకో!"

భాస్కర్ మాటలు నమ్మలేదు జయ. కాని షాప్‌లోకి వెళ్ళాక అందులోని వాడు అతన్ని పలకరించిన తీరు, అతనే చాకచక్యంగా రెండు మూడు చెప్పుల జతలను చూపటం చూశాక నమ్మక తప్పలేదు.

"ఇవి ఎట్లా వున్నాయి?" అన్నాడు భాస్కర్ ఒక జత చూపించి.

"బాగున్నాయిగాని నాకు పెద్దవి అవుతాయేమో!"

"ఎవీ చూసాను" అంటూ జయ వారిస్తున్నా వినిపించుకోకుండా ఆమె కాలికి తొడిగి చూశాడు. జయ అన్నట్లే పెద్దవి అయ్యాయి. "అయితే యింతకన్నా చిన్న నెంబర్ తెస్తాను" అంటూ వెనక్కి తిరిగాడు. అదే చెప్పుల్లో చిన్న నెంబర్ దొరికేటప్పటికి కొంత టైం పట్టింది — అది ఎక్కడో పైన వుండటంతో నిచ్చెన ఎక్కి తీయాల్సివచ్చింది.

ఆ జత తీసుకుని ప్రొఫెషనల్ లాగా రెంటినీ టకటకమని కొడుతూ జయ కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చి బల్ల లాక్కుని కూర్చుని జయ కాళ్ళ వంక చూశాడు.

ఆశ్చర్యం! అవి జయ కాళ్ళు కావు. తల ఎత్తి చూశాడు.

ఇంకా ఆశ్చర్యం అక్కడ కూర్చున్నది జయ కాదు.

జయ ఏమయింది అని భాస్కర్ అయోమయంగా చూస్తుంటే జయ కాళ్ళు కాని కాళ్ళ తాలూకు ఓనర్ అంది "ఇంకా యిదే వుద్యోగంలో వున్నావా భాస్కర్?" అని.

ఆ మాటలు, ఆ మాటలు అన్న తీరు, బాగా పరిచయమైనట్లు అనిపించి ఆమె వంక చూశాడు భాస్కర్. ఆమె జానకి. ఏ జానకి నయితే మొదటిసారిగా ప్రేమించి, ఆమెతో స్నేహం నిలుపుకోవ

టానికి ఎన్ని తిప్పలు పడ్డాడో ఆ జానకే!

"హలో! ఎన్ని రోజుల తరువాత!" అన్నాడు.

"ఏం చేస్తున్నావు యిప్పుడు?" అంది జానకి. "మనం ఆఖరిసారిగా కలుసుకున్నది యిక్కడే కదూ!"

"రేడియోలో నా గొంతు మారుమ్రోగిపోతున్నది, వినలేదా? ఇప్పుడు నా గర్ల్ ఫ్రెండ్‌కి చెప్పులు కావాలంటే.... ఎంతయినా పాత పరిచయం కదా అని."

"అసలు నేను గుర్తున్నానా?"

"లేక. అసలు గుర్తులేవు. అన్నట్లు నీ అడ్రెస్ చెప్పు, ఇంకో రెండు మూడు నెలలో నా పెళ్ళి వుండచ్చు. శుభలేఖ పంపాలి కదా! అవునూ ఈ వూర్లోనే వుంటున్నావా?"

"మా వారు ఆడిటింగ్ కోసమని యిక్కడికి వచ్చారు. నేనూ ఆయనతోపాటు యిక్కడికి వచ్చాను. అసలు మేం బొంబాయిలో వుంటున్నాం ..." జానకి యింకా ఏదో చెప్పబోయింది. యింతలో అంత దూరంలో వున్న చెప్పుల పర్యవేక్షణలో వున్న జంటలోని అమ్మాయి "హలో జానూ!" అని పిలవటంతో "హలో రాజూ." అని విష్ చేసి భాస్కర్ వంక తిరిగి "హోటల్ అశోకాలో రూంనెంబర్ 343. ఓ సారి కలవటానికి ప్రయత్నించు. తీరిగ్గా మాట్లాడుకుందాం" అంటూ అటు వెళ్ళింది.

జానకి వచ్చేయగానే రాజేశ్వరి ప్రభాకర్‌ని జానకికి పరిచయం చేసింది. "జానకి అని నాతో యమ్మెస్సీ ఫస్టియియర్ చదివింది. తరువాత పెళ్ళి చేసుకుంది." అంది ప్రభాకర్‌తో. అని జానకితో "మీ హోటల్

నింపే వస్తున్నాం. నువ్వు లేకపోయే టప్పటికి యిలా వచ్చాం" అంది.

"నీ రీసెర్చ్ ఎలా వుంది?" జానకి అడిగింది.

ఇద్దరూ మాటల్లో మునిగిపోయారు.

రాజేశ్వరి చీరల షాపుకి వెడదామనుకున్నది యిటు తీసుకువచ్చి తప్పు చేశానా అని ప్రభాకర్ అనుకున్నాడు.


ఇకపోతే అక్కడ భాస్కర్ చెప్పులు బాక్స్‌లో పెట్టేసి అంతరి దగ్గర శలవు తీసుకుని బయటకు వచ్చాడు- జయగాని బయటకు వచ్చిందా అనుకుంటూ.

అతను అనుకున్నది నిజమే! షాప్ బయట దాదాపు దుకుక్కున్నట్లు వుంది జయ.

జయ అంత హఠాత్తుగా బయటికి రావడానికి కారణం — బలమైనదే — వుంది. చెప్పుల కోసం భాస్కర్ అటు తిరిగేటప్పటికి, ప్రభాకర్ రాజేశ్వరి షాప్‌లోకి వస్తూ కనబడ్డారు జయకి. తను అక్కడ వుండటం ప్రభాకర్‌కి యిబ్బందిగానూ, రాజేశ్వరికి అనుమానాస్పదంగానూ వుంటుందని అనిపించింది. ఎంతయినా ప్రభాకర్ తమకు సాయం చేయబోతున్నాడు కదా — అందుకని గప్‌చిప్‌గా బయటకు వచ్చింది.

"సారీ భాస్కర్! నాది చిన్నపని...."

"ఇన్నాళ్ళూ నాకు మాజిక్ చేయటం యింత తేలిక అని తెలియదు. జయన్ని కుర్చీలో కూర్చోబెట్టి వెనక్కి తిరిగి చెప్పులలో మూడు సార్లు శబ్దం చేసి, మళ్ళీ యిటు తిరిగితే జయలు జానకులు అయిపోతారు తెలుసా!"



"దానికి అంటే?" అంది జయ. ఆలో చించి "పావలాకాసా" అని అడిగింది.

"అవును"

"అయితే నాకు చూపించవా?"

"తను వుంటున్న హోటల్‌కు రమ్మన్నమంది. ఓ రోజు కలిసివెడదాం. సరేనా?"

"నీ మాజీ ప్రేయసే కాదు నా మాజీ ప్రియుడు కూడా ఈ షాపులో వున్నాడు"

"నాకు చూపించవా?" భాస్కర్ అడిగాడు

"తనని సోమవారం నాడు కలవమని అడుగుతూ నీకు రాసిన పుత్తరాన్ని యివాళే పంపాను సోమవారం కలుద్దుగాని సరేనా?" అంది జయ.

## 4

సోమవారం....

"సో యిదన్నమాట మీ ఆఫీస్!" అన్నాడు భాస్కర్ జయకూర్చున్న కాబిన్ పరీక్షగా చూశాక. "బావుంది మరి నా సీట్ ఎక్కడ వుంటుంది?"

జయ మాట్లాడలేదు. చిన్నగా నవ్వింది. ప్రభాకర్‌ని తను బ్లాక్ మెయిల్ చేశానన్న విషయం భాస్కర్‌కి ఇంకా తెలియదు. ఇంటర్వ్యూలో ఈ విషయం తెలిసే అవకాశం వుంది కాబట్టి, ముందుగానే చెబితే ఎలా వుంటుందా అని ఆలోచించింది

"ఎప్పుడు మొదలవుతాయీ యింటర్వ్యూలు?"

"ఇప్పుడే ప్రభాకర్ ఫోన్ చేశాడు. తను యింకో అరగంటలో వస్తానన్నాడు. ఎంతసేపైనా ఇంకో గంటకి మొదలవ్వొచ్చు మీ యింటర్వ్యూలు అన్నట్లు మరిచిపోయాను. మీకు కాఫీ అరేంజి చెయ్యాలి" క్యాంటీన్‌కి ఫోన్ చేసింది.

"ఇక నేను వస్తాను. ఎక్కువ సేపు వుంటే బాగుండదు. వీలయితే పావుగంటలో వస్తాను." అన్నాడు భాస్కర్.

జయ తల వూపింది

పావు గంటలో వస్తానన్న భాస్కర్, అరగంటలో వస్తానన్న ప్రభాకర్ తమ తమ వాగ్దానాలని నిలబెట్టుకోలేకపోయారు. ఇంటర్వ్యూల కోసం వచ్చిన వాళ్ళని కాంతవర్చాలని యింకో రెండుసార్లు కాఫీ పంపించే ఏర్పాటు చేసింది జయ.

దాదాపు పన్నెండు అవుతుండగా వచ్చాడు భాస్కర్.

"మీ అంత డిసిప్లిన్‌డ్ లాట్‌ని నేనెక్కడా చూడలేదు. రెండు గంటల నించి అలా కూర్చోపెట్టినా...."

"ఆప్! అసలు సంగతి తెలిస్తే నువ్వు ఆశ్చర్యపోతావు. ఇప్పుడు వచ్చిన వాళ్లలో ఆయిదుగురు అనుభవశాలురు వున్నారు. —అనుభవశాలురు అంటే ఉద్యోగ రీత్యా కాదు. నిరుద్యోగ రీత్యా. యింటర్వ్యూల రీత్యా అన్నమాట. అయిదుగురు కలిసి అప్లై చేసారు— కలిసి యింటర్వ్యూలకు వెడతారు. అయిదారుసార్లు వెళ్ళి వచ్చాక మీ సంగతి పూర్తిగా అవగతమయిపోయిందట — ఎనిమిదింటికి రమ్మనమని పన్నెండు గంటల వరకు సంగతేం పట్టించుకోరని. దాంతో వాళ్ళు ఎక్కడికి వెళ్ళినా నాలుగు సెట్ల పేకలు పట్టుకు వసారు ఓ రెండింటితో వాళ్ళలో వాళ్ళు ఆడుకుంటారు— మిగతా రెండు ఎవరన్నా యింటరెస్ట్ చూపిస్తే వాళ్ళకి యిస్తారు. దాంతో అంతా హాయిగా పేకాడుతూ కూర్చుంటారు. ఇవాళ నేనూ ఆడాను. లక్ బావుంది. పది రూపాయలు వచ్చాయి." అన్నాడు జేబులోంచి పది రూపాయల నోట్ తీసి చూపిస్తూ.




వనితా జ్యోతి

చిత్రం : పావని కిరణ్, తెనాలి

జయ అది అంతగా పట్టించుకోలేదు. "భాస్కర్! నువ్వు నన్ను క్షమించాలి. నీకు అసలు విషయం చెప్పలేదు. కూర్చో చెప్తాను! మొన్న ప్రభాకర్‌ని నీ విషయం మామూలుగా అడిగాను. అతనెందుకో కుదరగంటే కుదరదన్నాడు దాంతో నాకు కోపం వచ్చింది. వెంటనే అతను నాకు రాసిన పుత్తరాలు రాజేశ్వరికి చూపిస్తానని....ఆగు నేను చెప్పేది పూర్తిగా విను ....బెదిరించాను. దాంతో అతను మెత్తబడ్డాడు. తప్పకుండా సాయం చేస్తానన్నాడు. అసలు ఆ రోజు ప్రభాకర్‌ని బెదిరించాలన్న అభిప్రాయం నాకు లేదు. ఏదో అనుకోకుండా.... నీకు యిష్టంలేదని తెలిసినా.... మరీ తప్పని పరిస్థితి... అర్థం చేసుకుంటా వనుకున్నాను.... తప్పంటావా?"

"చూడు జయా! నాకు రికమండేషను అంటేనే యిష్టంలేదని ముందే చెప్పాను. బ్లాక్‌మెయిలింగ్ అనేది యిష్టం లేకపోగా అసహ్యం అని చెప్పాను. నాకు ఈజీగానీ అన్నా యిష్టం లేదని...."

"అది కాదు భాస్కర్. ఈ ఉద్యోగం



# ఉద్యోగ విజయం

నీకెంత అవసరమో ఆలోచించు. ఈ ఒక్క సారికి రాజీపడలేవా?"

"ఒక్కసారి లేదు- వెయ్యిసార్లు లేదు. నా ఆదర్శాలు నావి. ఇలా బ్లాక్ మెయిలింగ్‌తో వుద్యోగం సంపాదించుకోవటం కన్నా హీనం యింకోటి వుండదు. ఇది చూడు...." అంటూ పది రూపాయల నోట్ చూపిస్తూ "ఇది ఈజీమనీ ఏదో తోచక ఆడాను గాని డబ్బు సంపాదించాలన్న ఉబలాటం లేదు" అంటూ పది రూపాయల నోట్‌ని మధ్యకు చింపాడు- కరక్ట్‌గా మధ్యకు.

జయ గుటకలు మింగింది. "సారీ భాస్కర్! నిన్ను సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాను. కాని యిప్పుడు ప్రభాకర్‌కి నేనేం చెప్పాలి? బెదిరింపూ లేదూ ఏమీ లేదు ఛూచ్! నీ యిష్టం. నీకు తీసుకోవాలంటే భాస్కర్‌ని తీసుకో అని చెప్పనా? చెబితే బాగుంటుందా?"

"అవును. అదికూడా ఆలోచించాల్సిన సంగతే!" అన్నాడు భాస్కర్. "సెలఫెన్ టేప్ వుందా?"

"ఎందుకు?" అంది జయ యిస్తూ.

"ప్రభాకర్‌కి ఈ విషయం నేనే చెప్తాను. జయ యెందుకో తొందరపడింది. యేమీ అనుకోవద్దని. సరేనా?" అన్నాడు భాస్కర్ టేప్‌తో జాగ్రత్తగా నోట్ అతికిస్తూ.

జయలో ఆశ మళ్ళీ చిగిర్చింది. "మన కన్నా పెద్దవాళ్ళే, ఎంతో నీతిమంతులమని చెప్పుకునేవారే యిటువంటివి తప్పు కాదంటారే అటువంటిది యెంతో అవసరంలో వున్న మనం...."

పది రూపాయల నోట్ మళ్ళీ చిరిగిపోయింది. "చూడమ్మాయి! ఉద్యోగ విషయంలో నా ప్రిన్స్‌పుల్స్ నావి" అన్నాడు.

ఫోన్ మ్రోగింది. జయ అటు తిరిగి ఫోన్ ఎత్తింది.

"హలో! ప్రభాకర్ హియర్. సారీ మిస్ జయా! కారు ట్రబుల్ యిచ్చింది. ఇంకో పావుగంటలో వస్తాను. ఓకే?"

"ఓకే బాస్!" అంటూ ఫోన్ పెట్టేసి భాస్కర్ వంక తిరిగింది. అతను టేప్‌తో చిరిగిన నోట్‌ను మళ్ళీ అతికిస్తున్నాడు.

* * *

"ప్లీజ్ టేక్ యువర్ సీట్ మిస్టర్ భాస్కర్!" అన్నాడు ప్రభాకర్. భాస్కర్ వంక పరీక్షగా చూసి "పర్వాలేదు జయకు మంచి జోడీ" అనుకున్నాడు.

"థ్యాంక్స్" అంటూ కూర్చున్నాడు భాస్కర్.

ప్రభాకర్ ఏదో మాట్లాడబోయాడు. అతనికా అవకాశం యివ్వకుండా అన్నాడు భాస్కర్ "క్షమించాలి! మీరు యింటర్వ్యూ మొదలు పెట్టబోయే ముందు నాదొక చిన్న క్లారిఫికేషన్. జయ నాకు బాగా తెలుసు. ఈ ఉద్యోగం గురించి ప్రకటన వచ్చినప్పుడు తనకి మీతో వున్న పూర్వ పరిచయం వుపయోగించి నాకు ఈ ఉద్యోగం వచ్చేలా చేస్తానంది. అసలు నాకు సిఫార్సులు అంటే యిష్టంలేదు. యింతవరకూ ఎప్పుడూ వుపయోగించుకోలేదు. కాని జయతోపాటు ఒకే ఆఫీస్‌లో ఒకే సెక్షన్‌లో పనిచేసే అవకాశం వస్తుంటే, నా యూజువల్ పాత్ నుండి కొంత డీవియేట్ అయ్యి మీ చెవిన చిన్నమాట వెయ్యటానికి ఒప్పుకున్నాను. నాకు యిప్పుడే తెలిసింది. జయ ఆవేశంలో ఆ రోజున.... ఆ సంగతి గురించి మాట్లాడకపోవటమే మంచిదనుకుంటాను. కాబట్టి మీరు జయ బెదిరింపు గురించి ఏం పట్టించుకోనక్కర్లేదు. నా తరఫున, జయ తరఫున క్షమాపణలు చెబుతున్నాను. ఈ ఉద్యోగం నాకు వచ్చినా రాకపోయినా మీకు జరిగే యిబ్బంది ఏం వుండదని హామీ యిస్తున్నాను. ఐ హోప్ ఐ మేడ్ మై పాయింట్ క్లియర్. ఇక మీరు ఇంటర్వ్యూ ప్రారంభించవచ్చును."

భాస్కర్ మాట్లాడినంతసేపూ అతని వంకే చూసిన ప్రభాకర్, భాస్కర్ మాట్లాడటం అయిపోయాక కూడా ఓ అర నిముషంసేపు అలాగే చూస్తూ వుండిపోయాడు. భాస్కర్ మాటలు పైకి ఎంత నిజాయితీగా కనబడ్డా, కొంచెం లోతుగా ఆలోచిస్తే, తమ ప్లాన్‌ని తెలివిగా కెమఫ్లజ్ చేసే ప్రయత్నంగా కనబడింది. తనని బెదిరించమని జయకి ప్రోత్సాహం ఈ భాస్కరే యిచ్చి వుండచ్చు. ఇప్పుడు పెద్ద నీతి పరుడిలాగా లెక్చర్ యిచ్చాడేమో-తననుండి మంచి యింప్రెషన్ కొట్టేయటానికి. అందుకనే భాస్కర్ మాటలు నమ్మాలో లేదో ప్రభాకర్‌కి అర్థం కాలేదు. "అయినా అతని మాటలు నమ్మినా నమ్మకపోయినా తనకు నష్టం లేదు ఎలాగో సాయంకాలం సత్యపరీక్ష పెట్టబోతున్నాను కదా" అనుకున్నాడు. "ఈ సందర్భంలో మిమ్మల్ని విడిగా కలిసి మాట్లాడాలి. సాయంకాలం ఆరు గంటలకు....సమయం నేను చెప్పాను కాబట్టి స్థలం మీరు చెప్పండి" అన్నాడు ప్రభాకర్.


"హోటల్ అశోకా" అన్నాడు చటుక్కున భాస్కర్.

"సాయంకాలం ఆరు గంటలకు హోటల్ అశోకాలో. ఓకే!" అన్నాడు ప్రభాకర్. "నవ్ టు స్టార్ట్ అవర్ యింటర్వ్యూ మిస్టర్ భాస్కర్! యువార్ వర్కింగ్ విత్...."

* * *

సరిగ్గా ఆరుగంటల కల్లా హోటల్ అశోకా పార్కింగ్ లాట్‌లో కార్ పార్క్ చేశాడు ప్రభాకర్. కార్ దిగి హోటల్ వేపు నడుస్తుంటే భాస్కర్ కనబడ్డాడు.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.



"మీరు యింటర్వ్యూ బాగా చేశారు" అన్నాడు ప్రభాకర్ కూర్చున్నాక.

"థాంక్స్!" అన్నాడు భాస్కర్ అతనికి తెలుసు ఈ విషయం చెప్పటానికి మాత్రమే తనని కలుసుకోమని ప్రభాకర్ అడిగి వుండడు. ఇంకా ఏం చెప్తాడా అని ఎదురు చూడ సాగాడు.

"నేను ఎవరి మీదో చాడీలు చెప్పాలని యిక్కడికి రాలేదు. మీరు యింటర్వ్యూ ముందు మాట్లాడిన తీరులో నిజాయితీ కనబడింది. అందుకనే మీరు నాకు సాయం చెయ్యగలరేమో అని అడుగుదామని మిమ్మల్ని యిక్కడికి రమ్మన్నాను." అన్నాడు ప్రభాకర్. అతను మధ్యలో ఆపేవాడు కాదు కాని సర్వర్ రావటంతో రెండు కాఫీ అని చెప్పి మళ్ళీ మొదలుపెట్టబోయాడు.

"సాయమా? నేనా?" అన్నాడు భాస్కర్.

తల వూపాడు ప్రభాకర్. జేబులోంచి ఒక కాయితం తీసి భాస్కర్‌కి అందించాడు. భాస్కర్ ఆ కాయితాన్ని విప్పి చదివాడు.

ప్రియాతి ప్రియమైన ప్రియా!
నిన్ను చూద్దామని యిక్కడికి చేరాను.
అప్పుడూ నేను అక్కడే ఎన్నిరోజులు...

భాస్కర్ చదవటం ఆపుచేశాడు. అతనికి ఏం చెప్పాలో తెలియలేదు. "జయ ఈ ఉత్తరం నాకు చూపించింది" అన్నాడు మాట పెగుల్చుకుని.

"సరే! నాకు ఈ ఉత్తరం చూపించి నన్ను బ్లాక్ మెయిల్ చేసింది—సారీ! అది పూర్తిగా బ్లాక్ మెయిల్ కాదు. చిన్న పేచీ. తను చెప్పినట్లు నేను వినకపోతే ఈ ఉత్తరాన్ని నా ఫియాన్సీకి చూపిస్తానని బెదిరించింది."

"నేను చెప్పాను కదా ఆ బెదిరింపు పట్టించుకోవాల్సిన అవసరం లేదని—ఈ పెన్ జయ తరఫున...."

"కాని యిక్కడో పేచీ వుంది. జయ నన్ను బెదిరించింది. ఏమనో తెలుసా? ఆమెని పెళ్ళి చేసుకోవాలని. లేకపోతే ఈ ఉత్తరాల ద్వారా నా పరువు తీస్తానంది. అసలు పూర్వ పరిచయాన్ని దృష్టిలో వుంచుకునే తనకన్నా క్వాలిఫైడ్, ఎక్స్‌పీరియన్స్‌డ్ అయిన వాళ్ళని పక్కనబెట్టి తనకు ఉద్యోగం యిచ్చానుట. ఇప్పటికీ మా మధ్య ప్రేమ వుందిట—అఫైర్ జరుగుతున్నదిట. ఇంతా అయిపోయాక తనని పెళ్ళి చేసుకోకపోవటం చాలా ఘోరంట. అందరికీ యిదే చెబుతుందిట. ఆమె చెప్పిన దానికి కాదంటే నా పరువు పోతుంది. అవునంటే... అసలు ఎలా అవును అనగలను? అటువంటిది మీతో స్నేహంగా వుంది. మీతో ఈ ఉద్యోగం కోసమే నన్ను బెదిరించినట్లు ఎందుకు చెప్పిందో నాకు అర్థం కావటంలేదు మీరేమన్నా చెప్పగలరా?" అన్నాడు భాస్కర్.

సర్వర్ కాఫీలు పెట్టి వెళ్ళిపోయాడు ఇద్దరూ మౌనంగా తాగసాగారు

భాస్కర్‌కి అంతా అయోమయంగా వుంది. మంచి ఉద్యోగం వున్న ప్రభాకర్ మీద జయ మనసుపడి వుండచ్చు ఎంతయినా యిదివరకే పూర్వపరిచయం వుంది కదా! కాని జయకి డబుల్ గేం ఆడాల్సిన అవసరం ఏమిటి? తనతో ఎంతో సన్నిహితంగా, తీయగా తిరిగిన జయ యిటువంటిది... ఒకవేళ ఇదంతా ప్రభాకర్ కల్పన అయితే! అప్పుడు నిజమయినా కాకపోయినా ఈ ఊహ బాగుంది. తనతో ప్రభాకర్ చెప్పాల్సింది ఈ ఒక్క విషయం మాత్రమే అయితే, నిస్సందేహంగా అతను ఏదో తన ఊహకు అందని ప్రయోజనాన్ని ఆశించి ఈ కట్టుకథలు చెబుతూ వుండి వుండవచ్చు

"ఇదేనా మీరు నాతో మాట్లాడాల్సిన విషయం?" భాస్కర్ అడిగాడు.

"మీరు పొరపాటుపడారు నా ముఖ్యోద్దేశం మీనుంచి సహాయం ఆశించడమే నేను యింకా పూర్తి విషయం చెప్పలేదు జయ దగ్గర నేను రాసిన ఉత్తరాలు యింకా పాతిక పైగా వున్నాయి. అవి జయ దగ్గర వున్నంతకాలం జయ నన్ను బెదిరిస్తూనే వుంటుంది. కొన్నేళ్ళ క్రితం మా యిద్దరి మధ్య పరిచయం లేకపోలేదు. ఆ పరిచయం

# విజిగీష


హిమ బిందువు సోయగాలు
హృదినంతా నింపుకున్న నే నెవరను
కున్నావు?
వారుణీ తరుణి యెదలోని
మృదు మధుర విరాళిని నేను.

అభేద్యమైన ప్రకృతి అణువణువునూ
మనోజ్ఞ భావదర్పణాలుగా సృజియించే
కవి వాని కనులలో
విద్రుతమౌ శరదృతువు నేను

ఎలమి పవమానుని గళిత దరహాస
కుసుమ శరవృష్టి నేను
ఇంతకీ నే నెవరో తెలుసా!
మనోజ్ఞ భావనా లాహిరీ లహరులలో
ఊయలలూగు కలికి రాయంచనౌ
'విజిగీష' నేను.

—పుట్టపర్తి అనూరాధ

ఎలా మొదలయిందో అలాగే ఆగిపోయింది. అటువంటిది కొంత వరకూ సాయంచేయాలని జాలితో ఉద్యోగం యిచ్చాను. అప్పటి నుండి ఆవిడని "మిస్ జయ" అని మాత్రమే పిలుస్తున్నా. నా పెళ్ళి యిప్పుడు దాదాపు సెటిల్ అయిపోయినట్లే. యిటువంటి పరిస్థితిలో ఆ ఉత్తరాలు జయ నుండి నాకు



# ఉద్యోగ విజయం

ఎంత తొందరగా వస్తే అంత మంచిది. ఈ విషయంలో మీ సాయం " ఎంతగా ముందు రిహార్సల్సు వేసుకున్నా మనసు నుండి రాని మాటలు లాజికల్ సీక్వెన్స్‌లో చెప్పటం చాలా కష్టమనిపించింది ప్రభాకర్‌కు.

"ఈ విషయంలో మీకు నేను సాయం చేయగలననే అనుకుంటున్నాను. అంటే మీరు చెప్పినదంతా నేను నమ్మాననికాదు. జయని నేను అనుమానించలేకపోతున్నాను. ఇపుడే జయకి నచ్చచెప్పి ఆ వుత్తరాలు మీకు అందేలా చేయగలను" అన్నాడు భాస్కర్ ఆలోచించి.

"మీరు నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేదు. పైగా నన్ను శంకిస్తున్నట్లు వున్నారు ఇప్పుడు రెండు పాజిబిలిటీస్ వున్నాయి. ఒకటి- నేను చెప్పిందంతా అబద్ధం అంటే జయకు మీరుచెప్పేం గానే వీలయితే జయ పువ్వులో పెట్టి ఆ వుత్తరాలు యిస్తుంది. రెండు-నేను చెప్పింది నిజం - జయతో మీరు యిన్ని విషయాలు చెప్పేటప్పటికి తన డబల్‌గేం బయటపడ్డది అన్న విషయం తెలిసిపోతుంది. అప్పుడావిడ నన్ను బెదిరించటం మాని బెదిరింపును కార్యాచరణలోకి పెట్టడానికి ఏమాత్రం సంకోచించదు. అప్పుడు నేనేం చెయ్యాలి ?"

"అయితే నేను చేయగలిగే సాయం యేమిటి ?"


"మీకు జయగారితో చనువు వుందికదా! ఆవిడ యింట్లోనుండి ఆ వుత్తరాలు కాజేసి నాకు యివ్వగలరా ? దీనివల్ల మీకూ ప్రయోజనం వుంది. తన తరువు ముక్కిపోయాక జయకు డబల్‌గేం ఆడే సావకాశం వుండదు. మీకు ఈ విషయం తెలియదని అనుకుంటుంది కాబట్టి మీతో సాధారణంగానే ...."

"మీ మెదడుని అంత కష్టపెట్టకండి- ఏమి జరగగలదో ఆలోచిస్తూ! జయ యిటువంటి పని చేసుందన్న అనుమానం నాకు లేకపోయినా ముందునించీ ఈ వుత్తరాలు, బెదిరింపులు అంటే నాకు యిష్టం లేకపోబట్టి ఆ వుత్తరాలు కాజేయడానికి ఒప్పుకుంటాను" అన్నాడు భాస్కర్. ప్రభాకర్, జయలలో ఎవరు అబదం చెబుతున్నారో అతనికి తెలియటంలేదు. ఎవరు అబద్ధం చెప్పినా, ప్రభాకర్ అన్నట్టు ఈ వుత్తరాలు అతన్ని చేరితేనే అందరికీ మంచిది. "జయ వాళ్ళింట్లో వుంటే నాకు వుత్తరాలు కాజెయ్యటం కష్టం అవుతుంది మరి ...."

"రేపు సాయంకాలం నాకు పని వుంది. ఎల్లుండి మా వీక్లీ ఆఫ్. పొద్దున పది గంటల నుంచి పదకొండు గంటల వరకూ జయ యింటో వుండదు ఇదే హోటల్‌లో వీలయితే యిదే రూంలో ఆవిడని ఎంగేజ్ చేస్తాను—ఆవిడతో రాజీ పడబోతున్నానని చెప్పి "

"ఆ రోజు మీ కారు వెనకడోర్ లాక్ చెయ్యకండి. మీ వుత్తరాలు దాదాపు పావు తక్కువ పదకొండు గంటలకు వెనక సీట్ మీద వుంచుతాను. సరేనా?"

"థాంక్స్ ఇంకో విషయం. ఈ ప్రయత్నాలు ఏమయినాసరే దాని ప్రభావం యింటర్వ్యూ ఫలితంమీద వుండదని హామీ



యిస్తున్నాను." అన్నాడు ప్రభాకర్. "ఇక పోదామా?" జేబులో చెయ్యి పెట్టబోతున్న భాస్కర్‌ని వారించి పర్స్‌లోంచి ఓ నోట్ తీసి వెయిటర్‌కి యిచ్చాడు.

"మిమ్మల్ని డ్రాప్ చేసాను బయటికి వచ్చాక ప్రభాకర్ అన్నాడు.

"థాంక్స్! అక్కరేదు- దగ్గరే— గా జయకి మనం యిద్దరం కలిసి కనబడటం జరిగితే బాగుండదు వుంటాను ప్రభాకర్ చెయ్యి అదోలా నొక్కి వెళ్ళిపోయాడు భాస్కర్.

వెళ్ళిపోతున్న భాస్కర్‌ను చూసి నవ్వుకున్నాడు ప్రభాకర్. ఇంత వరకూ తను బాగానే నటించాడు. భాస్కర్ తనను పూర్తిగా నమ్మకపోయినా జయని కొంత వరకూ అనుమానించాడు. ఎటుండి జయని కూడా హడలగొడితే కథ మంచి పాకాన పడుతుంది. కాని వాళ్ళిదరూ ఒకరినొకరు అనుమానించి అపార్థం చేసుకోటుకదా- ఛా! వాళ్ళిదరూ రాజేశ్వరులు కాదు కదా అంతతొందరగా అపార్థంచేసుకోవడానికి. రాజేశ్వరి గుర్తుకు వచ్చేటప్పటికి అతని మనసు అదోలా అయిపోయింది. పాపం పిచ్చిపిల! వారం రోజుల నుండి తన ప్రవర్తన చూసి కంగారుపడి [illegible]ది— రాజేశ్వరి ఏమైం అంటే తను [illegible]ంటున్నాడు-లేకపోతే రాజేశ్వరి [illegible] అని [illegible] అనా[illegible] పరి[illegible] [illegible]మంమగానే తను ఏమైం అం[illegible]డు.

[illegible] సినిమా ... పేరేమిటి.... కరి[illegible] [illegible].... దానికి రెండోసారి వెళ్ళకుండా [illegible]సిన రోజు నుండి [illegible] [illegible]పటం రాజేశ్వరి వంతు అయింది [illegible]. ప్రభాకర్ మనసు రాజేశ్వరి [illegible] నిండిపోయింది. రాజేశ్వరికి చాలా యిష్టమైన





పని చేస్తే! పోన్లేకరి వేపాకుసినిమాకుతీసుకు-వెడితే! ఫెర్నెస్‌దగ్గర నాలుగు గంటలుండి వెంటనే ఏసి రూంలోకి అడుగు పెటిన వాడిలా వణికిపోయాడు ఆ ఊహ రాగానే! రాజేశ్వరిమీద తన ప్రేమను కరివేపాకు సినిమాతో కొలవటం భావ్యంకాదు. తను భరించలేడుకూడా! మరి ఏం చెయ్యాలి? సమయానికి గుర్తుకువచ్చింది- కరివేపాకు నవల కొనివ్వమని మొన్న రాజేశ్వరి అడిగింది కదూ- ఆ పని చేయటం మూలంగా తను చిత్రహింసలకి లోనవడం అన్నది అసలు జరగనే జరగదు- ఆ నిర్ణయానికి వొచ్చాక ఇంకో నిముషం వృధా చేయకుండా బుక్‌స్టాల్‌వంకనడిచాడు ప్రభాకర్.

* * *

రెండ్రోజుల తర్వాత—

"ఏమిటి? యింత రహస్యంగా మాట్లాడాల్సిన విషయం ఏముంది?" అడిగింది జయ.

"ప్రైవేట్‌గా బిజినెస్‌లోకి దిగాలంటే నాకు ఎందుకో అదోలా వుంది. కాఫీ రానీ చెబుతాను అన్నాడు" ప్రభాకర్.

జయ ఆలోచనలో పడింది. తను భాస్కర్‌ని అడగటం మరిచిపోయింది — తన బెదిరింపు విత్‌డ్రా చేసుకున్నాం అని ప్రభాకర్‌కి చెప్పాడో లేదో-బహుశా చెప్పి వుండడు. చెప్పివుంటే ప్రభాకర్ తనతో మాట్లాడాలని రమ్మనమనడు. ఎంతయినా భాస్కర్‌కి ఉద్యోగం అంటే ఆశలేదా? వున్నట్లుండి భాస్కర్ పది రూపాయల నోట్‌ను అథెసివ్ టేప్‌తో అతికించటం గుర్తుకు వచ్చి నవ్వుకుంది.

'నన్నారోజు బెదిరించినప్పుడు నేనెంత బాధపడ్డానో నీకు తెలిసివస్తుంది జయా యిప్పుడు. ఆట ఆడమన్నావు కదా, ఎలా ఆడుతున్నానో చూడు' అనుకున్నాడు ప్రభాకర్.

కాఫీలు వచ్చాయి. ఒక గుక్క తాగి అన్నాడు ప్రభాకర్: "ఇక మొదలు పెడతాను. మనిద్దరం చాల రోజుల తరువాత కలుసుకున్నపుడు — అదే నీ యింట ర్వ్యూలో— నేను ఒకటి అనుకున్నాను-- అదే యిప్పుడు పైకి చెబుతున్నాను. 'నేనా టైంలో స్టేట్స్‌కి వెళ్ళకుండా వుంటే నీతోపాటు వుండి నీ కషాలు పంచుకుని సుఖాలు పంచి యిచ్చేవాడిని' అని అనుకున్నాను ఆ రోజున. ఎంతయినా మనిద్దరిదీ తొలి ప్రేమ—ఏ మాత్రం కల్తీ లేని స్వచ్ఛమైన ప్రేమ—అఫ్‌కోర్స్ ఆ రోజుల్లో అనుకో. దాంతరువాత యిన్నాళ్ళుగా నేను రాజేశ్వరిని ప్రేమిస్తున్నానన్న భ్రమలో వున్నాననుకుంటున్నాను. కాని నిజానికి నేను రాజేశ్వరి అంటే భయపడుతున్నాను. రాజేశ్వరి నన్ను ప్రేమిస్తున్నదేమోతెలియదు ఇక ఆమెను జీవిత భాగస్వామిగా చేసుకోగలనా అని నిన్న నాలో నేను ప్రశ్నించుకున్నాను. ఆవిడ చెప్పినట్లు బానిసలాగా ప్రవర్తిస్తే భర్తగా మెలగటంలో కష్టం లేదు. కాని చేసుకునేది కష్టాలకే అన్న జవాబు వచ్చింది. అప్పుడే నీ వుత్తరాల బెదిరింపు స్ఫురణకు వచ్చింది. వెంటనే ఈ సమస్యలకు అన్నిటికీ పరిష్కారం దొరికింది" డ్రమెటిక్ పాజ్ చేస్తూ ఆగాడు.

అతను ఆశించినట్లుగానే జయ "ఏమిటా పరిష్కారం?" అని అడిగింది.

ప్రభాకర్ మాటాడకుండా కాఫీతాగుతూ వుండిపోయాడు. హఠాత్తుగా "మనిద్దరం పెళ్ళి చేసుకున్నాం అనుకో, అసలు గొడవలే వుండవు. నీ దగ్గర వున్న ప్రేమలేఖలు రాజేశ్వరికి చూపించినా నాకేం ఫర్వాలేదు. నువ్వు నా బెటర్ హాఫ్‌గా వుంటే జీవితం హాపీగా వుంటుంది. నేను మీ కుటుంబానికి చేదోడు వాదోడుగా వుంటాను.అన్ని సమస్యలుతీరిపోయినట్టే" అన్నాడు. మారిపోతున్న జయ భావాలు చూస్తుంటే ప్రభాకర్‌కి నవ్వు వచ్చింది.

జయ అదిరిపడింది. "ఏమిటి?"అంది. తనకు తెలియకుండానే లేచి నుంచుంది.

"ముందు కూర్చో!" అన్నాడు ప్రభాకర్ "సింపుల్ జయా! మనిద్దరం పెళ్ళి...."

ఏం చెప్పాలో అర్థం కాలేదు జయకు. తెలిసీ తెలియని వయస్సులో అతన్ని ప్రేమించాననుకుంది. ఆ రోజుల్లో అతను అందకుండా వెళ్ళిపోయినా బాధపడలేదు.


## కొత్త పుస్తకములు

కొత్త మలుపు
డి. కామేశ్వరి 8-00
కోరికలే గుర్రాలైతే " 6-00
తీరం చేరిన నావ " 6-00
ప్రేమ పిపాసి
తోటకూర ఆశాలత 7-00
మమతల వంతెన " 6-50
జీవిత చక్రం
తమిరిశ జానకి 6-00
బొమ్మలు " 6-00
కథలాంటి జీవితం " 7-00
మలుపు " 8-00
రంగు మాసిన బొమ్మ
చందు సోంబాబు 6-00
సముద్ర జ్వాల " 8-00
సంసార వాహిని
ఆదిమధ్యం రమణమ్మ 7-00
స్మృతి పథంలో
పాటిబండ్ల విజయలక్ష్మి 5-00
యాత్ర చాగంటి తులసి 6-00
సంఘర్షణ
తురగా జానకిరాణి 6-00
జీవన వీణ పి. సద్మావతి 6-00
నలిగిపోయిన డైరీలో
చిరిగిపోయిన పేజి
యస్. కాశీవిశ్వనాథ్ 9-00

ప్రతులకు:

అరుణా
పబ్లిషింగ్ హౌస్,
ఏలూరు రోడ్డు,
విజయవాడ-2.

తను ఎంతో అమాయకంగా, గాఢంగా ప్రేమిస్తున్న భాస్కర్‌ని కాదని గుండా ప్రభాకర్‌ని ప్రేమించటం ముళ్ళ మొగ్గలు పెటగలదా? అసంభవం! ఇదేం కుదరదని చెప్పేసుంది. మహా అయితే భాస్కర్‌కి ఉద్యోగం రాకపోవచ్చు పోతే తన ఉద్యోగం కూడా పోవచ్చు. పోనీ! ఇంతా ఎక్కడున్నా దొరుక్కుంతా పోదు కాని ప్రభాకర్ అనుకుంటున్నది జరగనివ్వని.

"లేదు ప్రభా! ఒకప్పుడు కూడా మనిద్దరి మధ్యన వున్నది ప్రేమ కాదు ... నిదరికీ పెళ్ళా!" అంటూ తెచ్చి పెట్టుకున్న నవ్వు నవ్వింది.

"లేదు జయా! నువ్వు యిప్పుడిలా అంటున్నావుగాని బాగా ఆలోచించాక నాకు పాజిటివ్ గానే సమాధానం చెప్తావు. రేపు .... కాదు .... ఎల్లుండి ఆఫీసుకు వచ్చినప్పుడు చెప్పు." అన్నాడు ప్రభాకర్.

"ఎప్పటికయినా యిదే సమాధానం"

ప్రభాకర్ టైం చూసుకున్నాడు- పదీ యాభై అయిదు ఇక అయినా ఎక్కువసేపు డిటెన్ చెయ్యనక్కర్లేదు. ఒక్క క్షణం జయవంక తీక్షణంగా చూశాడు. "జయా! నువ్వే చెప్పావు- ప్రేమలో యుద్ధంలో ఏదీ తప్పు కాదని. నువ్వు నామీద యుద్ధానికి ప్రేమలేఖలు బయటపెడతానంటే నేను నీమీద ప్రేమతో వుత్తరాలూ బయటపెడతాను అని అంటున్నాను."

"అంటే?"

"నేను నీకు ముప్పై ఆరు వుత్తరాలు రాశాను. అన్ని వుత్తరాలు బయటపెడతాను. నన్నెందుకు పెళ్ళి చేసుకోవూ అని పది మందిలో అడుగుతాను ...."

* * *

కరెక్టుగా పది నలభై అయిదుకి భాస్కర్ న్యూస్ పేపర్‌లో చుట్టివున్న వుత్తరాల కట్టని ప్రభాకర్ కారు వెనకాల సీట్ మీద వుంచి, హోటల్ అశోకా బయటికి వచ్చాడు. ఎదురుగా వున్న యిరాని హోటల్‌కి వెళ్ళాడు — జయ వస్తే కలిసి వెళ్ళవచ్చు కదా అన్న వూహతో. కొన్ని విషయాలు తెలియకపోవటంవల్ల ఎప్పుడప్పుడు లాభాలు వున్నాయి తను అశోకా బయటికి వస్తుంటే మూడు పెన పెన పాకెట్లు పట్టుకుని లోపలికి వెళ్ళిన అమ్మాయి రాజేశ్వరి అని తెలియపోబట్టి కదా అతను అంత నిర్విచారంగా టీ తాగుతూ వుండగలిగాడు?

* * *

పదీ నలభై ఎనిమిదికి హోటల్ అశోకా బుక్‌స్టాల్ వంక నడుస్తున్న రాజేశ్వరికి ప్రభాకర్ కార్ పార్క్ చేసి వుండటం కనబడి అటు వెళ్ళింది. దగ్గరకి వెళ్ళేటప్పుటికి బ్యాక్ డోర్ వేసి వుండక పోవటం చూసి డోర్ తీసి చేతిలో వున్న పాకెట్స్ సీట్ మీద వేసి కూర్చుంది. న్యూస్ పేపర్‌లో చుటిన చిన్న పాకెట్ కనబడితే దాన్ని అందుకుంది. ఒక చేతిలో నుండి ఇంకో చేతిలోకి మార్చుకుంటూ ప్రభాకర్ యిటు ఎందుకు వచ్చాడబ్బా అనుకుంది. అప్రయత్నంగా ఆ పాకెట్ విప్పి చూసింది. ప్రభాకర్ గురించి చూసి ఏమిటా అనుకుని చదవ [illegible] యింది.

* * *

పదీ యాభై ఆరుకి ఫ్యామిలీ రూమ్స్ పక్కనించి వెడుతున్న జానకి పక్కకాబిన్ లోంచి వస్తున్న మాటలు ప్రభాకర్ విగా గుర్తించి, డోర్ మీద సున్నితంగా వేళ్ళతో కొట్టి తెరుచుకుని లోపలికి వెళ్ళింది.

అప్పటికి ప్రభాకర్ "... అంత మంది లోనూ అడుగుతాను లేకపోతే ...." అంటున్నాడు. ఆ సమయంలో ఎవరో రావటం, తన మాటలకు అంతరాయం కలగటం అతనికి చాలా ఆనందంగావుంది — ఎందుకంటే అతనికి ఏం మాటాడాలో తెలియకుండేదు జయ కంగారులోవుంది తన బెదిరింపునుసీరియస్‌గా తీసుకుంటున్నదని. తీరికగా ఆలోచిస్తే తన బెదిరింపువల్ల తనకే నష్టం అన్న విషయం ఆమెకు అర్థం అయిపోతుందన్న విషయం అతనికి తెలుసు- కాని ఆ ఆనందం యెక్కువసేపు నిలవలేదు జానకిని చూచేటప్పటికి.

"సారీ!! మిమ్మల్ని డిస్టర్బ్ చేశానను కుంటాను" అంది జానకి. "రాజేశ్వరి యిక్కడకు వస్తానంది. మీ గొంతు విని తను యిక్కడ వుందనుకున్నాను"


ఆ మాటతో ప్రభాకర్ ది అడ్వెంచర్, ప్రభాకర్ ది సింప్లటన్ 'సీ—సా' ఆడటం ప్రారంభించాయి.

"రాజేశ్వరి వస్తానందా? నాకు చెప్పలేదే! మరిచిపోయాను ఈవిడ జానకిగారని రాజేశ్వరి ఫ్రెండ్. ఇక ఈమె.... ఈమె నా కజిన్ జయ" అన్నాడు కంగారు పడిపోతూ.

"మీరు కట్టుకున్న చీర చాలా బాగుంది. ఎంత?" అంది జానకి.

జయ సమాధానం యిచ్చింది.

ఆ తరువాత ఓ రెండు నిముషాలపాటు యిద్దరు ఎక్స్‌పోనెంట్స్ చీరల పరిజ్ఞానాన్ని గురించిన అభిప్రాయాలు చెప్పుకుంటుంటే వినే అవకాశం ప్రభాకర్‌కి లభించింది. మూడో నిముషం నుంచి వారి మాటల తీరు అతనికి వళ్ళు మండిం



చేలా తయారయింది. నోటనిండా కాఫీ వుండగా, తుమ్ము వచ్చే సూచనలు కనడుతున్న పెద్దమనిషిలా మొహం పెట్టాడు.

"జయా! పోదామా? నాకు పనివుంది." జానకి వద్ద శలవు తీసుకుని జయతో సహా బయటపడ్డాడు. జయను యింటివద్ద డ్రాప్ చేయకపోవటం బాగుండదని తెలిసినా, రాజేశ్వరి చుక్క పక్కన వుండి వుండచ్చు అన్న విషయం అతన్ని మర్యాదలు మరిచిపోయేలా చేసింది. ఆ కంగారులోనే అతను కార్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు. ఒక అరకిలో మీటరు వెళ్ళాక తన హడావుడికి తనకే నవ్వు వచ్చింది. రాజేశ్వరి దూరంగా వున్నప్పుడు ఎన్నో సాహసాలు చేశాడు- చెయ్యాలనుకున్నాడు కాని యిప్పుడు ఎంతో పిరికిగా ప్రవర్తించాడు. తను ఎంత ధైర్యం తెచ్చుకోవాలన్నా సంవత్సరంనర నుండి వున్న అలవాటు అంత తొందరగా పోదుకదాఅనుకున్నాడు.

ఇంతలో భాస్కర్ తనకు అందచేయాల్సిన వస్తువు గుర్తుకువచ్చి వెనక సీట్ వంక చూశాడు. సీట్ ఖాళీగా వుంది ఒక మూల రుమాలు వుంది. వెనక్కి వాలి ఆ రుమాలు తీశాడు. అతని మొహం వివర్ణమైంది. ఆ రుమాలు నించి వస్తున్న సెంట్ వాసన సంవత్సరంన్నర నుండి అతనికి పరిచయమే!

అప్పుడు టైమ్ పదకొండూ పది అయింది.

* * *

పదకొండు అయినాక హోటల్ బయటకు వచ్చింది జయ. ఎవరో నేర్పరి అయిన దొంగ తన మెదడును కాజేసినట్లు అనిపించింది జయకి. మెదడు లేకపోతే యింకా తేలికగా వుండాల్సిన తల ఎంతో భారంగా వుంది. ఎవరో తనని.... జయ అంటే తనేగా.... పిలుస్తున్నట్లు అనిపించి చుట్టూ చూసింది. పక్కనించి భాస్కర్ వచ్చి "అలోహా నించా?" అని అడిగాడు.

"భాస్కర్ రెండు ఆస్ప్రో తీసుకువస్తావా? మళ్ళీ కాఫీ తాగి మాత్రలు వేసుకుంటేగాని నా మెదడు పని చేయదు."

* * *

రాజేశ్వరి ప్రభాకర్ రాసిన ప్రేమలేఖలు చూస్తుండగా ఆమె దృష్టి "రెండు రోజుల క్రితం ప్రభాకర్ కొన్న నవల మీద పడింది. ఉత్తరాల కట్టని వదిలేసి ఆ నవలని చేతిలోకి తీసుకుంది.... 'కరివేపాకు' (కరివేపాకు ఆహార పదార్థాలకు రుచిని, సువాసనను యిస్తుంది. కాని తినే ముందు అంతా కరివేపాకు ఆకుల్ని ఏరి అవతల పారేస్తారు. అలాగ తన వారి కోసం ఎన్నో త్యాగాలుచేసి తన జీవితాన్ని వారికోసమే గడిపి చివరికి వారి చేతనే వెలివేయబడ్డ త్యాగమూర్తి కథ)- "రాజేశ్వరికి ప్రేమతో-ప్రభా" అని రాసివుంది దాని మీద. "ఓ ప్రభా డియర్!" అనుకుంది రాజేశ్వరి వారం రోజులనుండి అతని ప్రవర్తన యిరిటేటింగ్‌గా కనబడి అతని మీద కోపాన్ని పెంచినా, తన కోసం ప్రభాకర్ తనకెంతో యిష్టమైన నవల కొన్నాడన్న విషయం ఆ కోపాన్ని పూర్తిగా కప్పేసింది. ఆ సమయంలో ఆ వుత్తరాల గురించి పూర్తిగా మరిచిపోయింది. ప్రభాకర్‌ని వెంటనే కలుసుకోవాలని లేచింది. తన పాకెట్స్ తీసుకుంటూ అప్రయత్నంగా ఆ నవలతో పాటు వుత్తరాల కట్టకూడా తీసుకుని ప్రభాకర్ రెస్టారెంట్‌లో వుండి వుండచ్చు అనుకుని అక్కడికు వెళ్ళింది- మధ్యలో బుక్ స్టాల్‌కి వెళ్ళి నవల యింకోటి కొనుక్కుంది. జయ ప్రభాకర్ వెళ్ళిపోయాక జానకి ఏం చెయ్యాలో తెలియక రెస్టారెంట్ హాల్‌కి వెళ్ళింది. రాజేశ్వరి, జానకి అక్కడ కలుసుకున్నారు.

"నువ్వు అరగంటక్రితం వస్తానని చెప్పావు!" అంది జానకి ఆరోపిస్తున్నట్లుగా.

"సారీ! అనుకోకుండా ఆలస్యం అయిపోయింది గాని ప్రభాకర్ కనబడ్డాడా? అతని కారు పార్కు చేసి వుంది" అంది రాజేశ్వరి.

"ఇప్పుడే అతను వెళ్ళిపోయాడు"

"నేను అనవసరంగా బుక్‌షాప్‌లోకి వెళ్ళాను. లేకపోతే కనబడేవాడే కాబోలు." అంది రాజేశ్వరి.

## సెన్సేషన్

బయటకు రాని
భావానలం
కనపడని
దావానలం
విద్రిస్తున్న
మస్తిష్కం
దహన మవుతున్న
ఖాండవం

ఆర్జించిన జ్ఞానం
అందిరాని గాండీవం
పగలంతా అడవి
రాత్రంతా సంస్కృతి

అలసిపోయినవాడికి
ట్రాపికల్ హీట్‌లో కూడ
కండలి, కొరికేసే
ఆర్కిటిక్ చలి
శిశిరంలో
మృత్యువు వాసన


—డాక్టర్ పంచారి రాజారామ్

"ప్రభాకర్‌కి ఏదో పని వుందిట. అతని కజిన్‌తో కలిసి హడావుడిగా వెళ్ళిపోయాడు.

"అతని కజినా ఎవరు?"

"పేరు జయ."

"నాకు తెలిసినంత వరకూ అతని





**కమల హాసిని**

చిత్రం : రావు. తెనాలి

కజిన్ పేరు జయ కాదే! అతని స్టెనో పేరు జయ. ఆ అమ్మాయి అయి వుంటుంది."

"కాదు అతను స్పష్టంగా చెప్పాడు. కజినే!" అంది జానకి.

అపార్థాల అగాథంలో పడబోయి నిల దొక్కుకుంది రాజేశ్వరి. ఏమో తనకి తెలియకుండా అతనికి జయ అనే కజిన్ వుండొచ్చు. లేకపోతే జానకికి అలా ఎందుకు చెప్తాడు.

"సరేగాని నా రూంకి వెళదాం రా!" అంది జానకి.

ఇద్దరూ జానకి రూంకి వెళ్ళారు.

"నిజంగా చాలా బోర్‌గా వుంది రాజు ఈయనేమో రాత్రి పదిగంటల వరకూ రారు. ఇక ఈయనతో రాకూడదు బాబూ!" అంది జానకి "యింతకీ మనం మ్యాట్నీకి వెడుతున్నామా లేదా."

"తప్పకుండా వెడదాం! నేను ప్రభాకర్‌తో ఒకసారి చూశాను. రెండోసారి తీసుకువెడతానని హామీ యిచ్చాడు. అన్నట్టు ఆ నవల యిదుగో" అంది తన



పాకెట్లో మధ్యనుంచి నవల తీసి చూపిస్తూ. "నేను నవల చదివాను గాని యిది ఫోర్త్ ప్రింట్ కదా-యిందులో పాఠకుల ప్రశ్నలకు. సందేహాలకు యిచ్చిన జవాబులు కూడా వున్నాయి— అవి చదివాక నీకు యిస్తాను "

"మరిచిపోయాను ప్రభాకర్ కజిన్ కట్టుకున్న చీర చాలా బాగుంది. ఎక్కడ కొన్నదో అడగటం మరిచిపోయాను కునుక్కో" అంది జానకి.

"సరేగాని. నేను రెండున్నరకల్లా థియేటర్‌కు వస్తాను. ఇక నేను వెళతాను" అంది రాజేశ్వరి టేబుల్ మీద వుంచిన తన సరంజామా అంతా కలెక్ట్ చేసుకుంటూ— ఈసారి పుస్తకాల కట్ట మరిచిపోయింది.

"నేనూ వస్తాను. నిన్ను ఎంట్రన్స్ దగ్గర దిగ బెడతాను." అంది జానకి.

రాజేశ్వరిని పంపి లాడ్జి సెక్షన్ వేపు నడవబోతున్న జానకి లోపలికి వస్తున్న జంటను చూసి ఆగిపోయింది. జయ. భాస్కర్‌లు లోపలికి రాగానే "భాస్కర్!" అంది.

"ఓ నువ్వా! జయ! ఈవిడ జానకి! ఈవిడ జయ" అని పరిచయంచేశాడు. చేశాక జయ వంక తిరిగి 'పావలా కాసు' అన్నాడు. జానకితో. "శుభలేఖ అని చెప్పాను కదా గుర్తుందా? ఇంటర్నేషనల్ హెవీ యింజనీరింగ్ కంపెనీలో పర్సనల్ మేనేజర్‌కి పి.ఏ.గా చేస్తున్నది" అన్నాడు.

"మరి కజిన్ అని చెప్పాడే ప్రభాకర్!"

ఇది మరీ యిరిటేటింగ్‌గా వుంది జయకి. అసహనంగా భాస్కర్ చెయ్యి పట్టుకు లాగింది. అప్పటికే భాస్కర్ కొంత అర్థం చేసుకున్నాడు. చేతి లాగుడుతో మిగతాది కూడా అర్థమైంది. "మళ్ళీ కలుస్తా! రూం నెంబర్ 343 కదూ!" అని జయను తీసుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

జానకి నిశ్చేష్టురాలై పోయింది-ఎంతగా అంటే జయను చీర ఎక్కడ కొన్నారు అని అడగలేనంత.

* * *

"జానకికి ప్రభాకర్ ఎట్లా తెలుసు?" భాస్కర్ అడిగాడు.

జరిగింది చెప్పింది జయ.

"మై గాడ్ నేను వెంటనే ప్రభాకర్‌ని కలవాలి. అతనికి నయం చేయబోతే బాక్ ఫైర్ అయ్యింది. ఇప్పుడా జానకి తల్లి రాజేశ్వరీదేవికి ఈ విషయం చెప్పిందంటే ఏమయినా వుందా?"

"ప్రభాకర్‌కి మనమేం సాయం చెయ్య నక్కరేదు. అతను తెలివి మీరిపోయాడు" అంది జయ ప్రభాకర్ ప్రతిపాదన బెదిరింపుల గురించి చెబుతూ.

కాలుస్తున్న సిగరెట్‌ని పొరపాటున మింగేసిన వాడిలా అయిపోయాడు భాస్కర్. తనతో ప్రభాకర్ చెప్పింది నిజమేకాబోలు - జయ డబల్‌గేం ఆడటం సత్యమే. ప్రభాకర్‌కి యిట్లా బెదిరించటం వల్ల లాభం ఏమిటి? తన కంపెనీలో టెక్నికల్ డైరెక్టర్ ఏకైక పుత్రిక, ఎంతో ఆస్థికి వారసురాలైన రాజేశ్వరిని వదిలి జయని పెళ్ళిచేసుకుంటాననటానికి ప్రభాకర్‌కి పిచ్చిలేదుకదా! జయ చాలా తెలివిగా వ్యవహరిస్తున్నది- తను చేయాలనుకుంటున్న పనులు ప్రభాకర్ బెదిరించటం వల్ల చేసున్నానని తనను నమ్మించాలని ప్రయత్నిస్తున్నది కాబోలు. జయ నిజంగా యిట్లా ప్రవర్తించకుండా యిదంతా తన భ్రమ అయితే బాగుండును. అయినా ప్రస్తుత సమస్య అదికాదు. తనతో పెద్ద మనిషి తరహాగా వ్యవహరించిన ప్రభాకర్‌ని రక్షిస్తే తనకి మేలు జరుగుతుంది. అందుకనే- "జయ! నన్ను ఎక్స్క్యూజ్ చెయ్యాలి. నేను అర్జెంటుగా ప్రభాకర్ యింటికి వెడుతున్నా!" అంటూ లేచాడు. "ప్రభాకర్ యిల్లు ఎక్కడ?"

* * *

"మీకో భయంకరమైన వార్త తీసుకు వచ్చాను." అన్నాడు భాస్కర్ ప్రభాకర్ కనబడగానే.

"నేనూ మీకో భయంకరమయిన వార్త తయారుగా వుంచాను" అన్నాడు ప్రభాకర్ నవ్వుతూ. రాజేశ్వరి రుమాలు కనబడగానే ప్రభాకర్ ది అడ్వెంచరస్-ప్రభాకర్ ది సింపుల్టన్‌ని మొండి తెగువతో ఓడించాడు

## చైతన్యం

కలలలోనుండి కారి కారి కొంత
కాగితంపైన తేలి తేలి కొంత.
ఉపన్యాసాల్లో ఊగి ఊగి కొంత
నవలల్లో నాని నాని కొంత
సీరియల్స్‌లో చినిగి చినిగి కొంత
నినాదాల నిప్పుల్లో కాలి కాలి కొంత,
చైతన్యంఅంతా చెల్లాచెదరైపోయింది
అందుకేనేమో!
ఆచరణ అందకుండా పోతోంది.

—పద్మలత

"నేను తీసుకువచ్చింది మహా భయంకరమయిన వార్త"


"మీరు నా కారులో వుత్తరాలు పెట్టారా?" అడిగాడు ప్రభాకర్.

"వెనక సీట్‌లో పెట్టానుగా చూడలేదా?"

"అయితే లాభం లేదు సార్! నేను చెప్పేదే భయంకరమయిన వార్త. మీరు ఆ వుత్తరాల కట్ట పెట్టి వెళ్ళాక రాజేశ్వరి అటు పోతూ నా కారు చూసి, ఆకర్షితురాలై సమీపించి. ఆ వుత్తరాలని పట్టుకు వెళ్ళిపోయింది"

"మీరు చూస్తూ వూరుకున్నారా?"

"నేను చూడలేదు. వుత్తరాలు లేవు. దాని బదులు రాజేశ్వరి రుమాలు వుంది. ఒకటి ప్లస్ రెండు. మూడేగా?"




"గుడ్ గాడ్! ఇక నా దెబ్బ కాచుకోండి." అంటూ జరిగింది చెప్పి "రాయీ రాయీ ఒరుసుకుంటే నిప్పు పుట్టినట్టు. రాజేశ్వరి జానకి కలిసే పెద్ద విస్ఫోటకం జరుగుతుంది" అన్నాడు భాస్కర్

"ఇప్పుడేం చేయాలి?" అన్నాడు ప్రభాకర్.

ముందు రాజేశ్వరికి ఆ వుత్తరాలు చేరాయో, లేదో కనుక్కోవాలి. చేరితే ఆవిడ ఆ వుత్తరాలు చదివిందా అన్నది తెలుసుకోవాలి. ఇవి జరిగాక మన తరువాతి ప్లాన్‌ని ఆలోచించుకోవాలి. వీటన్నిటికి నా పూర్తి సహకారం వుంటుంది. అసలు జానకికి రాజేశ్వరికి ఎట్లా పరిచయం." అన్నాడు భాస్కర్.

"జానకి భర్త యిక్కడ రెండు కంపెనీలకు ఎక్స్టర్నల్ ఆడిటర్. అతనితో పాటు ఈ వూరు వచ్చింది ఆ మహాతల్లి. ఆవిడా రాజేశ్వరి కలిసి చదివారు. ఆడవాళ్ళకి చదువెందుకూ అని మా తాతయ్యగారికే అనలేదు అనిపిస్తుంది యిప్పుడు"

ఫోన్ మోగింది. ప్రభాకర్ తీసుకున్నాడు.

"నేను ప్రభా! రాజుని!"

మౌత్ పీస్‌మూసి "రాజేశ్వరి" అన్నాడు ప్రభాకర్.

"ఇందాక అశోకాలో నీ కారు పార్కు చేసి వుండటం చూశాను. థాంక్స్ ప్రభా నా కోసం 'కరివేపాకు' నవల కొన్నావు కదూ- నీకు చెప్పకుండానే తీసుకున్నాను. ఇది నాలుగో ముద్రణట. ఇందులో ఆ నవల మీద పాఠకుల ప్రశ్నలకు సందేహాలకు జవాబులు కూడా యిచ్చారు. నీరసు గూరుండా హీరోయిన్ అతారింటికి వెడుతుంటే ఆమె జడలోని పువ్వు కింద పడిపోతుంది. హీరో ఆ పువ్వును తీసి హీరోయిన్‌కి యిస్తాడు. దానికిఅర్థం ఏమిటి అని అడిగితే ప్రేమ పవిత్రమైనది అని జవాబు యిచ్చారు. ఎంతో హృద్యంగా వుందికదూ!"

ప్రభాకర్ చాలా మంచి మూడ్‌లో వున్నాడు. అయినా "నాన్సెన్స్!" అని అన్నాకగాని కంట్రోలు చేసుకోలేక పోయాడు. "చూస్తుంటే ఆ తరువాతి సీన్‌లో హీరో జుట్టు ఎందుకు పీక్కున్నాడు అనిఅడిగితే ప్రేమగుడ్డిది కాబట్టి- అని జవాబు వచ్చేటట్లుంది" అన్నాడు

"అవును ప్రభా" చాలా ఎక్సైటెడ్‌గా వుంది రాజేశ్వరి గొంతు, "కరెక్టుగా అలాగే వుంది జవాబు. చాలా గొప్పగా వుందికదూ?"

ప్రభాకర్ మౌత్‌పీస్ మూసి జుట్టు పీక్కున్నాడు.

"ఏమిటి? ఏమయినా భయంకర నాటా? ఎందుకు జుట్టు పీక్కుంటున్నావు?" అడిగాడు భాస్కర్.

"ప్రేమగుడ్డిది కాబట్టి...." ఇంకా ఏదో చెప్పేవాడేగాని-రాజేశ్వరి మాట్లాడటంతో ఆగిపోయాడు. "నీకింత లిటరరీ మైండ్ వున్నప్పుడు నువ్వెందుకు రాయకూడదు ప్రభా? రాయడం అంటే గుర్తుకు వస్తున్నది- నీ కాలేజీలో నీ మ్యానుస్క్రిప్టు ఒకటి చూశాను. బహుశా నీ రచనకాబోలు అదికూడా తీసుకున్నాను. చదివాక నా అభిప్రాయం చెబుతాను.

గుటకలు మింగాడు ప్రభాకర్. "చూడమ్మాయి! జనాభా లెక్కల అతను వచ్చాడు అతనికి కొంత సమాచారం యివ్వాలి నువ్వు కొంతసేపు ఆగాలి" అని మౌత్‌పీస్ మూసి "రాజేశ్వరి ఆ ఉత్తరాల కట్ట తీసుకువెళ్ళింది. ఇంకా చదవలేదు. నేను రాసిన సాహిత్యం అనుకుంటున్నది ఎప్పుడు చదువుతుందో అనుకుంటాను" అని భాస్కర్‌తో అని "నా రచనలు ఎప్పుడు చదువుతావు?" అని రాజేశ్వరిని అడిగాడు.

"మధ్యాహ్నం నేను, జానకి కలిసి మ్యాట్నీకి వెడుతున్నాం సినిమాకు, నువ్వు రానన్నావు కదా వెడుతున్నాం. రాత్రికి చదువుతానులే."

"ఒక్క నిముషం ఆగు. జనాభా అతనికి ఇంకేదో వివరాలు కావాలిట" అని భాస్కర్‌తో "తాజా సమాచారం ఏమిటంటే రాయీ రాయీ కలవబోతున్నాయి- మాట్నీలో. నేను రానన్నానని జానకితో వెడుతున్నదిట- ఆ సినిమాకి. ఏం చెయ్యాలండి బాబూ?" అన్నాడు.

"మీరెందుకు వెళ్ళకూడదు?"

"నేనా? ఒకసారి చూశానండి. అది రెండోసారి చూడలేకే రాజేశ్వరితో పోట్లాట మొదలుపెట్టాను. నువ్వా సినిమా రెండోసారి చూస్తావా లేక ఆత్మహత్య చేసుకుంటావా? అని అడిగితే మూరెడు తాడు యిమ్మంటాను."

భాస్కర్ కొంతసేపు ఆలోచించి "ఒక్కక్షణం మీరు తప్పుకోండి" అని అతని చేతిలోని రిసీవర్ తీసుకున్నాడు.

ఆ తరువాత జరిగింది ప్రభాకర్ తన జన్మలో మరిచిపోలేడు. భాస్కర్‌కి ఆస్కార్, జ్ఞానపీఠ్ అవార్డులు రెండూ ఒకేసారి వచ్చారు అన్నా అతనంత ఆశ్చర్యంగా, గౌరవంగా భాస్కర్‌ని చూసేవాడు కాదు.

ప్రభాకర్ చేతిలోంచి ఫోన్ తీసు

దీపావళి శుభాకాంక్షలు!



కున్నాక భాస్కర్ గొంతు సవరించుకుని "చూడమ్మాయి! నేను మ్యాట్నీకి వస్తున్నాను. కాబట్టి జానకితో నీ ప్రోగ్రాం కాన్సిల్డ్. నీతో నేను చాలా మాట్లాడాలి కాబట్టి జానకి రాకూడదు. ఈ సంగతి జానకికి నేనే ఫోన్ చేసిచెబుతాను. నువ్వయితే మొహమాటపడతావు.

సరే! అవునూ నిన్నెదో అడుగుదామనుకున్నాను....

అవన్నీ తరువాత థియేటర్ దగ్గర.... ఇక వుంటాను" ఫోన్ పెట్టేశాడు. "ఇక జానకి విషయం మిగిలింది."

ప్రభాకర్ ఈ లోకంలోకి వచ్చాడు. "మీరు మిమిక్రీ చేస్తారని జయ చెప్పింది. కాని యింత గొప్పగా...."

"పొగడ్తలు తరువాత సార్! ముందు జరగాల్సినవి చూద్దాం. రాజేశ్వరికి జానకిని దూరం దూరంగా వుంచాలంటే మీరు రాజేశ్వరిని తీసుకుని ఒక వారం రోజులు ఏ నాగార్జున సాగరో వెళ్ళకూడదూ?" భాస్కర్ అన్నాడు.

"ఈ వారం నేను చాలా బిజీగా వుంటాను...."

"అయితే జానకితో సాగర్ పంపుదాం. ఆ కార్యక్రమం అయిపోతే రాజేశ్వరినుండి ఆ వుత్తరాలు సంపాదించటం మిగులుతుంది. అన్నట్టు రాజేశ్వరిగారి వాయిస్ మీ దగ్గర టేప్‌లో వుందా?" అని అడిగాడు.

"ఉంది."

"అయితే నాకా టేప్, రికార్డర్ యిచ్చి మీరు మంచి స్ట్రాంగ్ కాఫీ తయారు చేయించి పట్టుకురాగలరా?"

తల వూపాడు ప్రభాకర్. అతను రెండు కప్పుల కాఫీతో వచ్చేటప్పటికి భాస్కర్ హోటల్ అశోకాకి ఫోన్ చేస్తున్నాడు "అశోకా? రూం నెంబర్ 343 కి కనెక్షన్ యివ్వండి" అన్నాడు మౌత్ పీస్ చేత్తో మూసి ప్రభాకర్‌తో అన్నాడు. "రాజేశ్వరిగారి గొంతు సరిగ్గా వచ్చినట్టు లేదు. కాని ఫోన్‌లో కదా పర్వాలేదు అనుకుంటున్నాను. ఒకవేళ రాజేశ్వరి అనుమానిస్తే ఏం చెప్పమంటారు?"

"జలుబు చేసిందని చెప్పండి."

"జలుబు చేసిందనా? గుడ్! సరే!"

"హలో! రాజేశ్వరిని. నాకు జలుబు చేసింది."

"జలుబా? యిందాక మామూలుగా వున్నవుగా?"

"ఏమో! యిప్పుడు జలుబు చేసింది. నీకు ఎన్నాళ్ళ నుండో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. ఆ డిటైల్సన్నీ తరువాతగాని— నువ్వు నాకు ఒక సాయం చేయాలి. వెంటనే బయలుదేరి నాగార్జున సాగర్ వెళ్ళాలి."

"ఇప్పుడా? బస్సులు వుంటాయా?" అడిగింది జానకి. "అయినా యిప్పుడెందుకు?"

"బస్సులో వెళ్ళి లాభం లేదు. టాక్సీ హైర్ చెయ్యి. తరువాత రీయింబర్స్ చేస్తాను. ప్రభాకర్ ఎవరితోనో అక్కడికి వెడుతున్నాడు. నాకు అతనిమీద అనుమానంగా వుంది. నువ్వు కొంత స్పైయింగ్ చేయాలి. వెళ్ళి ప్రాజెక్ట్ హవుస్‌లో మకాం పెట్టు. అతనూ అక్కడే దిగుతాడు. మళ్ళీ రేపు పొద్దున కాంటాక్ట్ చేస్తాను."

"సరే."

"నువ్వు వెంటనే బయలుదేరాలి".

"సరే." అంది జానకి- "నీకు ప్రభాకర్ ఎప్పుడన్నా ప్రేమలేఖలు రాశాడా?" అంది టేబుల్ మీద రాజేశ్వరి మరిచిపోయిన వుత్తరాల కట్టను చూస్తూ.

"రాయలేదు గాని నువ్వు వెంటనే...."

"అందుకనేనా నీ అనుమానం...."

"జానకీ! నువ్వు త్వరగా వెళ్ళాలని అంటున్నాను యిందాకట్నించి...."

"అది కాదు యిందాక నువ్వు హడావుడిలో...." వుత్తరాల కట్ట గురించి చెప్పబోయింది జానకి.

"అంతకన్నా హడావుడిలో వున్నా నిప్పుడు. వెంటనే బయలుదేరు. థాంక్యూ! వుంటాను, బై." ఫోన్ పెట్టేశాడు. "ఈ జానకి మూలంగా ఒకసారి నాలుగువందలు నష్టపోయాను. ఈ దెబ్బతో జానకికి అయిదు వందల రూపాయల జలుబు వదిలిపోతుంది." అన్నాడు "ఇక మీకే బెంగాలేదు. అవునా?"

"లేకపోవడం ఏమిటండి? రాజేశ్వరి దగ్గర ఉత్తరాలు వున్నాయా? పైగా మ్యాట్నీకి ఆ సినిమాకి వెళ్ళాలా?"

"అవునవును ఉత్తరాల సంగతి మరిచిపోయాను. ఒకసారి కాజేసిన వాడికి-రెండోసారి కాజేయటం అంత కష్టంకాదు. మీరు మ్యాట్నీకి వెళ్ళినప్పుడు ఆ ఉత్తరాలు తీసుకువస్తాను. ఆ యింటి ప్లాన్ యింట్లో ఎవరెవరు వుండేది చెబుతారా?"

"జయ యిల్లు మీకు పరిచయం కాబట్టి పని సూక్ష్మంగా జరిగింది. రాజేశ్వరి ఇంట్లో దొంగతనమా? వద్దు. పట్టుపడితే ప్రమాదం."


"పట్టుపడనండి స్వామీ! మీకు ఆ ఉత్తరాలు అందచేస్తే నా అసైన్‌మెంట్ అయిపోతుంది" అన్నాడు భాస్కర్.

"సరే అయితే! అన్నట్టు మొన్న మీతో. పొద్దున జయతో అబద్ధం చెప్పాను." అన్నాడు తన బెదిరిపు అసలు స్వరూపం వివరిస్తూ "జయను సరదాగా ఏడిపించటమే నా ఉద్దేశ్యం."

"థాంక్స్! నా గుండె భారం తగ్గించారు. జయని అపార్థం చేసుకున్నాను నేను."

* * *

టైం చూసుకున్నాడు భాస్కర్-మూడు గంటలు. ఈపాటికి ప్రభాకర్, రాజేశ్వరి సినిమాహాల్లో వుండి వుంటారు అనుకున్నాడు. రాజేశ్వరి యింట్లో తను చేయబోయే దొంగతనం ఎంత ఎక్కువగా తీసుకున్నా గంటలో అయిపోతుంది— అంటే రాజేశ్వరి తిరిగి వచ్చేలోగానే! ఆ దొంగతనం ఎలా చేయాలా అని ఒక నిర్దిష్టమైన ప్లాన్ వేసుకోలేదు అతను. అవసరాన్ని బట్టి మార్చుకోగలిగే ఫ్లెక్సిబుల్ ప్లాన్ తయారుచేసుకున్నాడు.



బంగళా ముందు నిలబడి నేమ్‌ప్లేట్ చదివాడు.— 'ఇదేనన్నమాట రాజేశ్వరి యిల్లు' అనుకున్నాడు గేటు తీయబోతూ అసలు రాజేశ్వరి యింట్లో వుంటే ఈ దొంగతనం ఇంకా సులభమవుతుంది అని అనుకున్నాడు. పోర్టికోలో నౌకరు కాబోలు ఎదురుపడి లోపలికి తీసుకువెళ్ళాడు.

భాస్కర్ హాల్లో అడుగు పెట్టాడు. సోఫాలో ఒక అమ్మాయి కూర్చుని వుంది- ఈవిడని ఎక్కడో చూశానే అనుకున్నాడు భాస్కర్.

"యస్?" అంది ఆ అమ్మాయి.

"రంజారావుగారు వున్నారా?" అన్నాడు భాస్కర్. రాజేశ్వరి తండ్రి పేరు చెబుతూ.

"లేరు ఏమన్నా పనివుందా?"

"మీరు....?"

"నేను వారి అమ్మాయిని"

"అంటే రాజేశ్వరిగారా?" అయి వుండదు అనుకుంటూనే అడిగాడు.

"అవును. మీకు మా డాడీ...."

తరువాతి మాటలు భాస్కర్‌కి వినబడ లేదు అతనికి ఏం అర్థంకాలేదు సినిమా హాలులో వుండాల్సిన రాజేశ్వరి యిక్కడ ఎందుకు వుంది - వెంటనే ప్రభాకర్‌ని కల అనిపించింది అయినా రాజేశ్వరి వుంటేనే తన పని సుకరమవుతుంది కదా అని సమాధానపడ్డాడు

"అసలు నాకు మీతోనే పని వుంది. నేను మీ యూనివర్శిటీల చేస్తున్నారు కదూ"

"అవును."

"గుడ్. నేను ఆకాశవాణి నుండి వస్తున్నాను .."

"ఆకాశవాణి నుండా కూర్చోండి నిలబడే వున్నారు. అవునూ మిమ్మల్నెక్కడో చూసినట్టుంది" అంది రాజేశ్వరి కుతూహలంతో ముందుకి వంగి.

"చూసి వుండరు. విని వుంటారు. రోజూ వివిధభారతిలో వాణిజ్య ప్రకటనలు వింటారు కదా అందులో విని వుంటారు" అని అజంతా బ్లేడ్ ప్రకటన వినిపించాడు.

"ఆ గురుకు వచ్చా[illegible]. మీ గొంతు మీరు చెప్పే విధానం మరీ [illegible] భిన్నంగా...."

"థాంక్యూ!" అన్నాడు భాస్కర్ "నేటి విద్యావిధానం మీద - ముఖ్యంగా మిగతా విషయాలమీద, యువతరం అభిప్రాయాలు సేకరిస్తున్నాము—అంటే సమాజంలో అన్ని [illegible] సెక్షన్స్ నుండి పైగా డిఫరెంట్ ఫేకల్టీస్ నుంచి ఈ అభిప్రాయాలు సేకరిస్తున్నాం. మీరు యంయస్సిలో జువా

## జీవన గీతి

జీవితం ఒక పేరడి
కవిత్వం ఒక గారడి
జనన మరణమె
ప్రాస నియమం-
బ్రతుకు గతులె
ఛందః శాస్త్రం-
కఠిన పదముల కర్థమిచ్చే
నిఘంటువులే గత చరితలు-
ఆత్మజ్ఞానం అంధకారం
అర్థమవ్వదు అలంకారం
ప్రేమ ఆశ్చర్యార్థకం
పెళ్ళి సంయుక్తాక్షరం
మనిషి గ్రంథం
ఒకే ముద్రణ
మనసు అర్థం
కాని చి[illegible]ణ
సగటు మనుషుల బ్రతుకులన్ని
సమన్వయాలతో సంధులు—
దారి చూపగ ఎదురు తిరిగే
మనుషు లందరు గురువులు—

శైలకుమార్

లజి కదూ?" బ్యాగ్‌లో నుంచి టేప్ రికార్డర్ తీస్తూ అన్నాడు.

తల వూపింది రాజేశ్వరి. "నా అభిప్రాయం అంటే....? నేను ప్రిపేర్ అవ లేదు కదా? పైగా నా మూడ్ కూడా బాగా లేదు. యింకెప్పుడైనా...."

"ఇందులో ఏముందండి సింపుల్! మీరు చెప్పదల్చుకున్నది ఓ కాయితం మీ[illegible] రాసు[illegible] చదివేస్తుప్పుడు మాత్రం చూసి చదువుతున్నట్టు [illegible] సహజంగా [illegible]గా చెబుతున్నట్టు వుంటే చాలు. ఎంత- రెండు నిముషాలు మాత్రమే దానికి పెద్ద ప్రిపరేషన్ ఎందుకండి?" అన్నాడు భాస్కర్ "అవునూ? మీ [illegible] కూడా [illegible] శబ్దాలు యింత ఎక్కువగా వినిపిస్తాయా? మీ రూం ప్రశాంతంగా వుంటుందంటే రికార్డింగ్ అక్కడే చేద్దాం"

"నా రూం [illegible] వుంటుంది. [illegible] వెడదాం."


దీపావళి
శుభాకాంక్షలతో!



# ఉద్యోగవిజయం

రాజేశ్వరిని అనుసరిస్తూ వక్కడ చూశా వచ్చా ఈ రాజేశ్వరిని అనుకున్నాడు. రాజేశ్వరి రూంలో అడుగు పెట్టేటప్పటికి సమాధానం తెలిసింది—అక్కడ టేబులు మీద పెట్టివున్న పాకెట్లని చూసేటప్పటికి తను ప్రభాకర్ కారులో వుత్తరాలు పెట్టి బయటకు వస్తుంటే ఈవిడ లోపలికి వెడుతున్నది ఈ పాకెట్లు పట్టుకుని. అంటే వీటికి దగ్గరలోనే వుత్తరాల కట్టవుండచ్చు.

"కొంచెం మంచినీళ్ళు యిస్తారా?"

తల వూపి బయటకు నడిచింది రాజేశ్వరి. వెంటనే ఆ పాకెట్ల మీదకు దూకాడు భాస్కర్. ఆ టేబుల్ మీద పాకెట్లు, కరివేపాకు సవల తప్ప యింకా ఏం లేవు. పక్కనే వున్న బుక్ రాక్‌లో వెదకటం మొదలెట్టాడు.

రాజేశ్వరి గది బయటకు వచ్చి ఓ నాలుగు అడుగులు వేశాక-అనుమానంతో ఆగిపోయింది. ఎంతో తెలివిగా దొంగతనాలు జరుగుతున్న ఈ రోజుల్లో.... నౌకరుకి మంచినీళ్ళు తెమ్మని సంజ్ఞ చేసి మెల్లిగా వెనక్కి వెళ్ళింది.

వుత్తరాల కట్ట కనబడకపోయినా నిరుత్సాహపడకుండా వెతుకుతున్నాడు భాస్కర్. రాజేశ్వరి మళ్ళీ గదిలోకి వచ్చేటప్పటికి.

"ఏమిటది ఏం చేస్తున్నారు?" అంది రాజేశ్వరి.

ఆరోజు రెండుసార్లు విస్కీ తాగుతూ పట్టుబడిన రాజకీయనాయకుడిలా నవ్వాడు భాస్కర్. వుత్తరాలకట్ట కోసం వెతుకుతున్నానని చెప్పలేడు. ఇంతలో మంచి ఐడియా తట్టింది -"ఏమీ లేదు జువాలజీలో నాకు కొన్ని సందేహాలున్నాయి. జువాలజీ బుక్స్ కనబడేటప్పటికి...." అన్నాడు.

"సందేహాలా?"

"అవును. పోనీ మీరు తీర్చండి. బాతు అన్నా హంసఅన్నా ఒకటేనా? హంసకి రెక్కలు వుంటాయా? వుంటే ఎగుర్తుందా? హంస గుడ్డు...."

"స్టాపిట్!" అని "వీరయ్యా" అని గట్టిగా అరిచింది. "యూ! ఆకాశవాణి నుండి వచ్చాను అని మస్కా కొడతావా? నువ్వు.... నువ్వు ... దొంగతనం చేయటానికి సిగ్గులేదూ?...."

"నేనంతా వివరించగలను మీరు అపార్థం చేసుకోకండి. ప్రభాకర్ నన్ను"

భాస్కర్ మాటలు పూర్తి చేయనివ్వ లేదు రాజేశ్వరి. "ప్రభాకరా! ఆ పేరు నా దగ్గర ఎత్తద్దు. అసలు నువ్వెవరు? యూ గెట్ లాస్ట్ ఐసే! గెట్ లాస్ట్." భాస్కర్ ఏదో చెప్పబోయినా వినిపించుకోకుండా అంది "మీరు వెంటనే వెళ్ళిపోండి. లేకపోతే పోలీసులను పిలవాల్సి వస్తుంది."

టేప్‌రికార్డర్ బ్యాగ్‌లో పెట్టుకున్నాడు.

* * *

వెంటనే ప్రభాకర్ దగ్గరకు బయలుదేరాడు భాస్కర్ - ఆపరేషన్ వుత్తరాల కట్ట ఎలా ఫెయిల్ అయిందో వివరించాలని. అసలు సంగతి కనుక్కోవాలని. తన అసైన్‌మెంట్ ఫెయిల్ అయినందుకు అతను బాధపడటం లేదు. ఎందుకంటే రాజేశ్వరి యిప్పుడా వుత్తరాలు చదివినా ప్రభాకర్ మీద కొత్తగా కోపం తెచ్చుకున్నా పరిస్థితిలో కొత్తగా వచ్చే మార్పు లేదు- ఎందుకంటే ఆవిడకు ఆల్రెడీ అతని మీద బ్రహ్మాండమైన కోపం వుంది కాబట్టి.

ప్రభాకర్ అదోలా వున్నాడు. భాస్కర్‌ని ముభావంగా పలకరించాడు. భాస్కర్ జరిగిందంతా చెప్పి "ఏమ యింది?" అని అడిగాడు.

ప్రభాకర్ అదోలా దగ్గి, అదోలా నవ్వి, మళ్ళీ అలా అదోలా జుట్టు పీక్కుని "అంతా అయిపోయిందండి! ఎంత చేదన్నా రాజేశ్వరిని ప్రేమించాను ఈ రోజుతో అంతా శిథిలమైపోయింది. నేను జానకికి జయని కజిన్‌గా ఇంట్రడ్యూస్ చేశాను అసలు విషయం ఎలా తెలిసిందో రాజేశ్వరికి తెలిసింది- బహుశా జానకి సాగర వెళ్ళేముందు యిద్దరూ కలుసుకుని వుంటారు. దాంతో నన్ను క్రాస్ ఎగ్జామిన్ చేయటం ప్రారంభించింది హాలు నగర. నేను సరైన జవాబు యివ్వలేక పోయాను. నన్ను చడామడా దులపటం మొదలుపెట్టింది. నాకూ- అసలే టెన్షన్‌లో వున్నానేమో- సహనం పోయింది. దాంతో యిద్దరం తిట్టుకుని చివరికి విడిపోయాం. ఇంకేముంది?" అన్నాడు.

"అదేమిటండీ? ఇదంతా మా మూలంగా వచ్చింది. నేను జయ కలిసి ఆవిడకి మొత్తం కథంతా చెబుతాం. కావాలంటే క్షమాపణ కోరుతాం మిమ్మల్ని..."


"చూడండి మీ ఉద్దేశ్యాలు మంచివే! కాని యిప్పుడు రాజేశ్వరి చాలా బాడ్ మూడ్‌లో వుంది- పైగా తనని బ్రీకప్ చేసేశాననే అయిపోయాను. అసలే ఈ పాటికి జయ అంటేనే యింత ఎత్తున ఎగిరిపడుతుంటావి. ఇంక లాభంలేదు. మీరే చెప్పారుకదా నా పేరు విని చాలా కోపం తెచ్చుకుందని."

భాస్కర్ నిట్టూర్చాడు.

"ఇంత బాధలోనూ ఒకటే ఆనందంగా వుంది"

"ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగాడు భాస్కర్.

"కరివేపాకు"సినిమా రెండోసారి చూడకుండా పోయింది కదా!"




"నాకేం యింత ప్రగాఢం నడిచిందా?" అంది జయ.

"అవును నువ్వు తొందరపడి ప్రభాకర్‌ని బెదిరించావు. చూడు. యిప్పుడేమయిందో" అన్నాడు భాస్కర్ నవ్వుతూ. "ఇప్పుడేం చెయ్యాలో తెలియటం లేదు."

"మనం వెళ్ళి రాజేశ్వరిని కలిస్తే?"

"లాభం వుండదు. ప్రభాకరూ వద్దన్నాడు. ఆలోచిస్తే అది మంచి మార్గం కానిపిస్తూంది."

"అయితే నేనో మాట చెప్పనా? జానకి ద్వారా చెప్పిస్తేనో?" జయ అంది కొంత సేపు ఆలోచించి.

"ఫాంటాస్టిక్! కరణేశు మంత్రి అనిపించావు. మరి ఎప్పుడు శయనేషు....?"

"చాలుగానీ ముందు ఈ విషయం చూడు. ఆవిడని ఎలా కాంటాక్ట్ చెయ్యాలి?"

"ట్రంక్ చెయ్యచ్చు! కాని చాలా విషయాలు చెప్పాలి కాబట్టి, సాగర్ వెడితేనే మంచిది. ఇప్పుడే బయలుదేరతాను. ఈ టైంలో బస్ వుంటే అదృష్టవంతుడ్నే. లేకపోతే లారీలో పోవాల్సివస్తుంది"

*  *  *

భాస్కర్ అదృష్టవంతుడే! సాగర్‌కి వెళ్ళే బస్ దొరికింది. పదకొండు గంటల ప్రాంతాన అతను సాగర్ చేరాడు. వెంటనే ప్రాజెక్ట్ హౌస్‌కి వెళ్ళి జానకిని కలిశాడు.

"నువ్వా!" అంది జానకి తలుపు తీస్తూ.

"నీ ఆశ్చర్య ప్రకటన తరువాత గాని నన్ను ముందు లోపలకు రానీ! అన్నట్టు నీకు నేను క్షమాపణ చెప్పుకోవాలి"

"నీ క్షమాపణలు తరువాతగాని ముందు కూర్చో మంచినీళ్ళు కావాలా?"

"అక్కర్లేదుగానీ గాసులో వుంచుకో: అసలు విషయం చెపితే నీకు అవసరం వస్తుంది. నిన్ను యిక్కడకు రమ్మనమని చెప్పింది రాజేశ్వరి కాదు—నేనే! మిమిక్రీ అన్నమాట."

"నువ్వా? ఎందుకు?" అంది జానకి మంచినీళ్ళు తాగుతూ.

"నీకా కథ నా నోటితో చెప్పాల్సి వస్తుందని అనుకోలేదు. ఇకపోతే అసలు విషయం పెద్దది." అని కథంతా చెప్పాడు. "నువ్వు తక్షణం చేయాల్సిన పని ఏమిటంటే వెంటనే రాజేశ్వరికి ఫోన్ చేసి అసలు విషయం చెప్పాలి. మగ్‌లో పోస్తే గాని బీర్ కానట్లు నువ్వు చెబితేగాని రాజేశ్వరి వినదని మా అభిప్రాయం."

"ఫోనా? యిప్పుడా?" అంది జానకి. ఆవలిస్తూ "టైం పదకొండున్నర" అంది.

"జానకీ! నీకో విషయం తెలుసా? నువ్వు టైం యింత అని చెప్పకుండా టైం ఎంత అని అడిగి వుంటే యింతవరకూ నాతో ప్రశ్నలతోనే మాట్లాడినట్లు అయ్యేది" అన్నాడు భాస్కర్ నవ్వుతూ. "అయినా ఫోన్ చెయ్యటం అత్యవసరం"

"ఇప్పుడు ఫోన్ చేస్తానుగాని, రాజేశ్వరికి కాదు. మా వారికి. పాపం తంగారు పడి వుంటారు. అఫ్‌కోర్స్ మెసేజ్ వదిలానుకో!"

"మరి రాజేశ్వరికి....?"

"ఫస్ట్‌బస్‌కు బయలుదేరి హైదరాబాద్ వెడదాం. అక్కడ ముఖాముఖి రాజేశ్వరితో మాట్లాడుతాను. నచ్చచెప్పగలను అనుకుంటాను. అన్నట్టు వెళ్ళేటప్పుడు నా చార్జీలు నువ్వే పెట్టుకోవాలి. నీ మిమిక్రీ కాదు కాని నా బ్లాక్‌మని అయిదు వందల రూపాయలు పోయింది."

ప్రభాకర్, రాజేశ్వరి కలుస్తారన్న ఆశ చిగిర్చింది భాస్కర్‌లో.

*  *  *

హైదరాబాద్‌లో దిగేయగానే రాజేశ్వరి యింటికి వెళ్ళారు భాస్కర్, జానకి. భాస్కర్‌ని జానకితోపాటు చూసి ఆశ్చర్యపోయింది రాజేశ్వరి. రాజేశ్వరికి జానకి ఎంత నచ్చచెప్పినా లాభం లేకపోయింది. రాజేశ్వరి కొంత మెత్తపడటం చూసి భాస్కర్ కూడా ప్రయత్నించాడు. కాని పరిస్థితిలో ఇంప్రూవ్‌మెంట్ కనిపించలేదు. రాజేశ్వరికి ప్రభాకర్ మీద అంతకుముందున్న కోపం దాదాపుగా పోయింది గాని అభిమానం అడ్డువచ్చి రాజీకి రాలేకపోతున్నదని గ్రహించాడు భాస్కర్. ఎంతగా ప్రయత్నించినా లాభం లేకపోయింది.

*  *  *

టైప్ చేస్తున్నది కాని జయ మనసు మనసులోలేదు—వేళ్ళు మాత్రం యాంత్రికంగా తమ పనిచేసుకుంటున్నాయి. క్రితం రాత్రి నుండి అనుకుంటున్నదే.... ప్రభాకర్‌ని ఎందుకు బెదిరించానా అని.... అనుకుంటూ పశ్చాత్తాపపడసాగింది జయ. నిన్న సాయంకాలంవరకూ ఎంతో విషమంగావున్న పరిస్థితి జానకి మూలంగా యేమన్నా మారి వుంటుందా? సాగర్ నుండి భాస్కర్ తిరిగి వచ్చాడా?


టైప్ చేయటం ఆపి ఏదో ఆశిస్తున్నట్లు ఫోన్‌వంక చూసింది. జయను నిరాశపరచటం యిష్టంలేదన్నట్లుగా ఫోన్ మ్రోగింది. ఆత్రంగా ఎత్తింది జయ.


"ప్రభాకర్‌కి కనెక్షన్ యివ్వండి" రాజేశ్వరి గొంతు విని తన చెవులనే నమ్మలేకపోయింది జయ. ఆమె గుండె గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కావటానికా అన్నట్లు అతి వేగంగా కొట్టుకోసాగింది. జానకి, భాస్కర్‌ల యత్నం ఫలించిందన్న మాట అనుకుని ప్రభాకర్‌కి కనెక్షన్ యిచ్చి తనూ వినసాగింది.

"ప్రభా! కోపం వచ్చిందా? నన్ను క్షమించానని అనవూ?"

ప్రభాకర్ మాట్లాడలేదు.

"నిన్న నేనలా ప్రవర్తించినందుకు యింత కోపం వచ్చిందా? నువ్వు చేస్తున్న పని నీకు తప్పు అనిపించకపోతే నీ పి.ఏని నీ కజిన్ అని యితర్లకి ఎందుకు పరిచయం చేశావు? దాని మీద నాకు రావాల్సిన దానికన్నా ఎక్కువగానే కోపం వచ్చింగనుకో! అందుకే కదా క్షమాపణలు అడిగేది. రాత్రి భోజనం చెయ్యలేదు. సరిగ్గా






వడుకో లేదు. పొద్దున కాఫీ తాగలేదు యింతవరకూ...."

"ఎవరు తిన్నారు గనకా? ఎవరు పడుకున్నారు గనకా!" అన్నాడు ప్రభాకర్.

"ఎన్ని రోజుల తరువాతో విన్నట్లుంది నీ గొంతు. ఇంతకీ నన్ను క్షమించి నట్లేనా?"

చిన్నగా నవ్వాడు ప్రభాకర్. "ఇందులో నా తప్పు కూడా లేకపోలేదు...."

"ఏం లేదు! నా తప్పే!"

"సరే! మన తప్పే! లంచ్ టైం అవుతున్నది. నాకు ఆకలి వేస్తున్నది. నీకూ డిటో నే కదా? ఇంకో పావుగంటలో అశోకాలో...."

"పావుగంట కాదు అరగంట తరువాత. అన్నట్లు ఈ ఎపిసోడ్ యింతటితో మరిచి పోవాలి ఎప్పుడూ దీనిగురించిగుర్తుచేసుకో రాదు- చెప్పుకోనూ రాదు."

"సరే!"

"ఇంకో సంగతి! యిక జన్మలో కరివేపాకు సంగతిఎత్తను."

"సరే!"

ముగ్గురూ ఫోన్ పెట్టేశారు.

ప్రభాకర్ హడావిడిగా జయ దగ్గర వచ్చాడు. జంట నగరాల్లోని ఆనందాన్ని అంతా భరిస్తున్నట్లు వున్నాడు. "నిన్న భాస్కర్ చెప్పే వుంటాడు-సంగతిఅంతా కాని యిప్పుడే రాజేశ్వరి ఫోన్ చేసింది క్షమించమంది. నేనూ అదే అన్నాను. మూడు ముక్కల్లో చెప్పాలంటే యిద్దరం కలిశాం అన్నమాట. ఇంకా యిలాగేకలిసి వుంటాం- యింకోసారి పోట్లాడుకుని విడి పోయేంత వరకూ- అదీ సంగతి. పాపం మా విషయంలో భాస్కర్ చాలా శ్రమ పడ్డాడు. చెయని సాహసం లేదు- [illegible] దొంగతనానికి కూడా. అతనికి న థాంక్స్ ..."

"అంతేనా? ఒట్టిమాటలేనా? ఉద్యోగం లేదా?"

"ఫొజండ్ అపాలజీస్. మరిచి పోయాను. హడావిడిలో మరిచిపోయాను." అని లెటరుహెడ్ పాడ్ నుంచి ఒక షీట్ చింపి కింగగా సంతకం పెట్టి "పైన వున్న స్పేస్‌లో మాటర్ టైప్ చెయ్యి. "మామూలుగా మన అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ లాగానే. కాని ఒన్ ఇయర్ ప్రొబేషన్ అని. ప్రొబేషన్ పీరియడ్‌లో కన్‌సాలిడేటెడ్ పే ఏడువందల యాభై...."

"సైన్ హండ్రెడ్అనా? సరే!" అంది జయ నవ్వుతూ.

"సరే! ఇక వుంటాను. రాజేశ్వరిని కలవాలి" ప్రభాకర్ వెళ్ళిపోయాడు.

ప్రభాకర్ సంతకం పెట్టిన షీట్‌ని రోలర్‌లోకి ఎక్కించింది జయ. అది రకమయిన థ్రిల్‌తో టైప్ చెయ్యటం పూర్తి చేసింది.

ఆమె టైప్ చెయ్యటం పూర్తి చేసిందో [illegible]దో భాస్కర్ వచ్చాడు— 'నీ [illegible] నోట పలకాల సిలకా' అని పాడు[illegible].

"భాస్కర్ యిది తెలుసా? రాజే[illegible] [illegible]ప్రభాకర్‌కి ఫోన్ చేసి క్షమాపణలు అడిగి...."

"కాదు. ప్రభాకర్ రాజేశ్వరికి ఫోన్ చేసి క్షమాపణలు అడిగాడుట. ఇప్పుడే రాజేశ్వరి చెప్పింది" అన్నాడు భాస్కర్ [illegible] ఆపుచేసి.

"కాదు. నా చెవులతో విన్నాను.

"నేనూ విన్నాను."

"ఎలా సాధ్యం అది?"

"నీ పాట నా నోట పలకాల సిలకా."

"అంటే పొద్దున యిద్దర్నీ కదిపి [illegible]శాం నేను, జానకి. వాళ్ళ ఆత్మాభిమానాలు గట్రా చూస్తే వళ్ళు మండింది మాకు. అప్పుడు జానకి సలహా యిచ్చింది. దాంతో ఒకరు చేసినట్టు యింకొకరికి చేశాను. దాంతో వాళ్ళిదరూ ప్రియా ప్రియా అనుకున్నారు. నాకు కొన్ని ఏ సర్టిఫికెట్ డైలాగ్స్ వినబడ్డాయి అనుకో!"

"ఇది రెండోసారి నన్ను మోసం చెయ్యటం. ఈ సారీ అనుమానం రాలేదు -అది రాజేశ్వరి గొంతు కాదేమో అని. అఫ్‌కోర్స్ నేనింత వరకూ అంతశ్రద్ధగా ఆవిడ గొంతు వినలేదనుకో."

"అది సరేగాని ఏమిటి టైప్ చేస్తున్నావు? ఓ! నాకు అపాయింట్‌మెంట్ ఆర్డరా? ప్చ్! ఒక రోజు ముందుఅయినా బాగుండేది నాలాటి వాడికి యిది కాదు తగిన వుద్యోగం...." అని జేబులోంచి ఒక కాయితం తీసి జయకి యిచ్చి "యిది" అన్నాడు భాస్కర్.

స్క్రీన్ టెస్ట్స్ వగైరా ప్రోత్సాహకరంగా వున్నాయని, అయినా అనివార్య కారణాల వల్ల సెకండ్ హీరో వేషంకూడా యివ్వలేకపోతున్నామని, కాని అన్ని విధాల ప్రాధాన్యత వున్న (ఒక పాట కూడా) పాత్ర యిస్తున్నామని ఆశచిత్ర వారు రాసిన పుత్తరం అది.

"నువ్వా? నటించటమా? అసలు నటించటం వచ్చా నీకు!" అడిగింది జయ.

"నాకు రాదా? మరి యిందాకా నిన్నూ, ప్రభాకర్‌ని కూడా...."

"అది మిమిక్రీ చిట్టిబాబు! నటించడం వేరు, మిమిక్రీ వేరు"

"నటన నా జీవం. నటన నా ప్రాణం. నే బ్రతికింది, జీవిస్తున్నది నటించడం కోసమేగాని, యిటువంటి వుద్యోగాల కోసం కాదు." అన్నాడు భాస్కర్ జయ టైప్‌చేసిన లెటర్‌ని చూపిస్తూ. అని ఆ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ని చింపేశాడు.

"ఏమిటిది!" కోపం. బాధ. ఆవేశం. నిస్పృహ ఒకేసారి జయ గొంతులో పలికాయి. "నిన్ను ఆ దేవుడు కూడా .."

"నెరో ఫెస్ట్ చేపు అందివ్వు." అన్నాడు భాస్కర్ నవ్వుతూ "నాకు నటించడం రాదన్నావు మరి?"

(సమాప్తం)

## చిన్న మాట

నాల్గవ ఛాప్టర్ మొదట్లో భాస్కర్ పది రూపాయల నోట్ చింపిన సంఘటనకు హెన్రీ సిసిల్ రాసిన ఓ సంఘటనకు చిన్న పోలిక వుంది. అయితే ముగింపులో దాన్ని అందంగా వాడుకోవచ్చన్న అభిప్రాయంతో గ్రంథచౌర్యం చేయటం జరిగింది.

—రచయిత